
# మహిమ యమున

[ దత్తస్వామి చేసిన మహిమలు ]




ప్రొఫెసర్..డా॥.జన్నాభట్ల వేణు గోపాల కృష్ణమూర్తి (స్వామి)

# విషయ సూచిక.


| | | పుట |
|---|---|---|
| 1. | బాల్య జీవిత విశేషాలు........................ | 1 |

## బ్రహ్మలహరి.

| | | |
|---|---|---|
| 2. | శ్రీ దత్తునిగా దర్శనమిచ్చుట........................ | 7 |
| 3. | బ్రహ్మ తేజస్సును చూపుట........................ | 8 |
| 4. | విష్ణు చక్రమును చూపుట........................ | 9 |
| 5. | ఫణికి ఆత్మలింగమును చూపుట........................ | 11 |
| 6. | విశ్వరూప దర్శనము నిచ్చుట........................ | 12 |
| 7. | ఆదిపరాశక్తియే........................ | 14 |
| 8. | సాక్షాత్తు శ్రీ రాముడే........................ | 14 |
| 9. | స్వామి శ్రీ లక్ష్మీ నరసింహుడే........................ | 15 |
| 10. | శ్రీ వేంకటేశ్వరునిలో స్వామి దర్శనం........................ | 16 |
| 11. | స్వామి శ్రీ వేంకటేశ్వరుడే........................ | 17 |
| 12. | సీతమ్మగారికి, ఫణికి దివ్య దృష్టి నిచ్చుట........................ | 18 |
| 13. | బొంబాయిలో దివ్య దర్శనము........................ | 19 |
| 14. | శివ దత్త దర్శనము........................ | 20 |
| 15. | పాదముద్రలు........................ | 21 |
| 16. | గ్రీష్మమును శమింపచేయుట........................ | 21 |
| 17. | చిత్రంలో కదలికలు........................ | 22 |
| 18. | దత్త చిత్రంలో స్వామి కనిపించుట........................ | 23 |
| 19. | దత్త దిగంబర దర్శనమిచ్చుట........................ | 23 |
| 20. | విద్యుత్ శక్తిని, రంగు కిరణాలను చూపించుట........ | 24 |
| 21. | దత్త సాక్షాత్కారమును కలిగించుట........................ | 25 |
| 22. | శ్రీ కృష్ణ రూపములను తనలో చూపుట........................ | 26 |

23. బాలకృష్ణుడే........................................ 26
24. భద్రకాళి దర్శనము................................ 27
25. బదరిలో స్వామి దర్శనమిచ్చుట.................. 27

## విఘ్నలహరి.

26. విచిత్ర వ్యాధిని పోగొట్టుట........................ 28
27. మృత్యుముఖమునుండి కాపాడుట.................. 28
28. బాలునకు ప్రాణభిక్ష................................. 29
29. వెన్నుపోటును క్షణమున తగ్గించుట................ 29
30. పునర్జన్మను ప్రసాదించుట........................ 30
31. గుండెపోటు నుండి రక్షించుట..................... 31
32. శిరోవేదన నివారణ................................. 32
33. వసుమతి, శ్రుతకీర్తుల నొప్పులనుతగ్గించుట............. 32
34. సీతమ్మ గారి తలనొప్పి తగ్గించుట.................. 33
35. శస్త్ర చికిత్స నొప్పులను తగ్గించుట.................. 33
36. కాలిన బొబ్బలు స్వీకరించుట...................... 33
37. రక్తపోటును స్వీకరించుట......................... 34
38. మృత్యువునుండి రక్షించుట........................ 34
39. అతిసార, శూలవ్యాధులను పోగొట్టుట............. 36
40. సైన్సును మించిన శక్తి............................. 37
41. బాలికను కాపాడుట................................. 38
42. హనుమద్భక్తునికి గండము తప్పించుట.......... 39
43. జ్ఞానము ద్వారా ఆరోగ్యము......................... 39
44. నారదముని గానం.................................. 41

## శివలహరి.


45. సాక్షాత్తు దత్తుడే.................................... 42
46. కమల గంధములు వెలువడుట.................... 43
47. మరియొక సంఘటన.................................... 44
48. స్వామి మూడు తలలోడు........................... 46
49. రూపాయి నాణెము సృష్టించుట.................. 46
50. పుల్కాలను సృష్టించుట.............................. 46
51. స్వామి వాక్యమే సత్యము............................ 47
52. శివుడు ఆదిత్య స్వరూపుడు......................... 48
53. సంన్యాసి పరీక్ష........................................ 48
54. మంచి ఉద్యోగమును అనుగ్రహించుట............ 50
55. పుత్రుని అనుగ్రహించుట.............................. 52
56. రైలు ప్రమాదమునుండి రక్షించుట................ 52
57. ఫణిని ఆవేశించి స్కూటరు నడుపుట.............. 53
58. శ్రీ సాయియే.............................................. 54
59. ఉద్యోగమును రక్షించుట............................. 55
60. స్వామి నరసింహ సరస్వతియే...................... 55
61. అరచేతి నుండి వాసనలను చూపుట.............. 56
62. సర్వజ్ఞత................................................... 56
63. సూర్యుని కనుమరుగు చేయుట..................... 57
64. ఒకే సమయమందు రెండు ప్రదేశములందు ఉండుట.................................................. 57
65. సరిత అనుభవము....................................... 58
66. సర్వ వ్యాపియే........................................... 58
67. రుద్రాభిషేక ప్రభావము................................ 60
68. నాటి కృష్ణుడే............................................. 60
69. మహిమల గురించి బోధ.............................. 61
70. గోలోకమును చూపించుట............................ 62
71. ఇటీవలి సంఘటనలు................................... 64

# మనవి

ప్రొ॥ డా॥ జన్నాభట్లవేణుగోపాల కృష్ణమూర్తి గారినే స్వామి లేక దత్తస్వామి అని భక్తులందరూ పిలుస్తారు. స్వామి సాక్షాత్తు శ్రీదత్తాత్రేయుడని భక్తుల ప్రగాఢ విశ్వాసము. స్వామి మహిమలు అనంతాలు. 'నాన్తోస్తి మమదివ్యానాం' (గీత) గదా! మచ్చుకు కొన్ని వ్రాసినాము యీ మహిమ యమునలో. "అవిశ్వాసులకు విశ్వాసాన్ని మహిమ యమున ద్వారా, భక్తి దరిద్రులకు, భక్తిని "భక్తి గంగ" ద్వారా, జ్ఞానదరిద్రులకు జ్ఞానాన్ని "జ్ఞానసరస్వతి" ద్వారా దానంచేత దత్త ప్రీతిని పొందండి. దానమే దత్తస్వరూపము" అంటారు స్వామి. ఇంక "జ్ఞాన సరస్వతి" మహాగ్రంధము ముద్రణము కావాలి. ఇప్పటికి చాల దత్తగ్రంధములను ముద్రణము చేసి ప్రచారమును చేసినాము. "నా కార్యము, ప్రచారముచేసి జీవులనుద్ధరించుట. నన్ను వ్యక్తిగతంగా సేవించుట కన్నను, నా కార్యమున సహకరించి సేవించువాడు నాకు ఎంతో సంతోషమును కలుగచేయును". అంటారు స్వామి. ఎవరికి ఎట్లు అనుకూలమో అట్లే యీ దత్తసేవలో పాల్గొనవచ్చును. శ్రీ కోనేరు సత్యనారాయణగారు ముద్రణమునకు కంప్యూటర్‌ను, శ్రీ భీమశంకరంగారు 50 వేలు, శ్రీ చంద్రశేఖర్ గాయత్రీ దంపతులు 55 వేలు, శ్రీ అజయ్‌గారు 60 వేలు దానము చేసినారు. శ్రీ శేషాద్రిగారు శ్రీ దత్తవాణి మాగజైన్‌ను నడుపుటకు నడుము కట్టినారు. శ్రీ శర్మగారు స్వామి భజనలను క్యాసెట్లు చేసి భక్తులకు యిచ్చుచున్నారు. శ్రీ బాలకృష్ణమూర్తి దంపతులు మరియు ఈ ప్రచార సేవలో కుటుంబ సభ్యులు మూలస్తంభముగా నిలచి కావలసిన ద్రవ్యమంతయూ సమకూరుస్తూ సేవ చేసినారు. ఇంకా ఎందరో దత్త భక్తులు యధాశక్తి గురుదక్షిణలనిచ్చి, యీ గ్రంధములను యోగ్యులకు అందచేసి వారిచ్చు గురుదక్షిణలను స్వీకరించి యీ దత్తకార్యమగు జ్ఞానభక్తి యజ్ఞములలో సమిధలుగా మారి త్యాగముతో శ్రీ దత్తుని చేరుచున్నారు. "త్యాగేనైకే అమృతత్వ మానశుః"- అని శ్రుతి. స్వామికార్యంలో స్వార్ధ రహితమైన సేవచేసి హనుమంతుడు అగ్రగణ్యుడైనాడు. శంకర, రామానుజ, మధ్వ, మీరాదులు జ్ఞాన-భక్తి ప్రచార సేవతోనే కైవల్యమును పొందినారు. ప్రచార సేవాకర్మ చేయ అవకాశములేని వారు వారి కర్మఫల త్యాగముతో (అనగా వారి సంపాదన నుండి దానము చేయుట) ముక్తిని పొందవచ్చునని గీతా వచనము "కర్మఫల త్యాగః" అని అంటారు స్వామి.

కావున దత్తసేవలో పాల్గొని దత్త కైవల్యాన్ని పొందగోరు వారికి మా దత్త - ఆహ్వానమిదే !

**"నా కార్యమున పాల్గొను సేవ సాధన యొక్క ఫలస్వరూపము. అది నా అనుగ్రహమున్ననే జీవునకు లభించును" అని స్వామి వాణి.**


**దత్త భక్త బృందము**



స్వామి తల్లిదండ్రులు



స్వామి పండిత గోష్ఠిలో



స్వామి కల్యాణంలో

# మహిమ యమున.
## పీఠిక.

మహిమలు, అనగా కొన్ని వస్తువులను సృష్టించుట, కొన్ని దివ్య తేజో దర్శనములను చూపుట మొదలగు ఊహాతీత క్రియలు. ఇవి పంచభూతములకు సంబంధించినవే కావున జగత్తులోని భాగములే. ఈ జగత్తును సృష్టించుట ఒక మహాసిద్ధి. దానిలోని స్వల్ప భాగములే అష్ట సిద్ధులైన మహిమలు.

జగత్ సృష్టియే బ్రహ్మమునకు స్వరూప లక్షణము కాదనియు అది కేవలము తటస్థ లక్షణము అని రెండవ బ్రహ్మ సూత్రము చెప్పుచున్నది.

అయితే స్వరూప లక్షణము అనగా నేమి? స్వరూప లక్షణము అనగా ఒక ప్రత్యేకమైన శరీరాకారము. "గంగడోలు కలది ఆవు" అన్నట్లు.

అయితే తటస్థ లక్షణమనగా నేమి?

తటస్థ లక్షణమనగా " స్వరూపమునకు చేరియున్న అనిత్యమైన లక్షణము. "మువ్వల దండ కల్గది ఆవు" అన్నట్లు.

ఆ మువ్వల దండను ఆవు మెడలో నుండి తీసి, గాడిద మెడలో వేసినచో, గాడిద ఆవు అగునా? కాదు కాదు. గంగ డోలును ఆవు నుండి వేరు చేయలేము గదా.

రాజు శరీరమున ఉన్న అలంకారములవలె, మహిమలు బ్రహ్మమునకు గుర్తు కాజాలవు. అలంకారములు ధరించినంత మాత్రమున పగటి వేషగాడు రాజు కాగలడా? కాదు కాదు. అలానే పరమాత్మనుండి, మొండి బిడ్డలైన రాక్షసులు తపస్సు అను మొండి పట్టుదల ద్వారా సిద్ధులు పొందిన రావణాదులు పరమాత్మ అయినారా? కాలేదు గదా.

ఎట్టి సిద్ధులను ప్రదర్శించని శ్రీరాముని , స్వర్గమునే సృష్టించిన విశ్వామిత్రాది బ్రహ్మర్షులు, పరమాత్మగా గుర్తించలేదా? మరి, పరమాత్మను గుర్తించు స్వరూప లక్షణములేవి? " సత్యం జ్ఞానం" - "రసోవైస:" ఇత్యాది శ్రుతులవలన జ్ఞాన ప్రేమానందాది కల్యాణ గుణములే.

రాక్షసాదులు మహిమలను చూపుచున్నప్పుడును వాటిని చేయుచున్నవాడు పరమాత్మయే. లైటును వెలిగించుచున్నది తీగెలో ప్రవహించు విద్యుత్తే కానీ, తీగెకాదు. ఇది తెలియక, రాక్షసాదులు, కార్తవీర్యార్జునాదులగు యోగులు, కేవలము తీగెలగు తామే కర్తలమని అహంకరించి పతనము చెందిరి. చివరకు పరశురాముడును సర్వ క్షత్రియ సంహారము తానే చేసెనని గర్వించి, శ్రీరాముని చేత గర్వభంగము పొందెను. శ్రీరాముడెప్పుడును గర్వమును పొందలేదు.

హనుమంతుడు తానెట్టి అద్భుత సిద్ధులను ప్రదర్శించినా, తాను తీగె మాత్రమేనని గుర్తించి "దాసో2హమ్మని" ఆ సిద్ధుల కర్తృత్వమును పరమాత్మకే అంటకట్టినాడు. కావున హనుమంతుడు సదా విజయమును పొందెను. చివరకు పరమాత్మయగు శ్రీరాముడును యుద్ధము చేసి హనుమంతునకే విజయమునిచ్చినాడు! తండు మహర్షి దర్భలను కోయుచుండగా తన పిడికిలి నుండి గుప్పెడు విభూతి సృష్టించపడగా గంతులు వేయసాగెను దానిని తానే సృష్టించెనను కొని! శంకరుడంతట సాక్షాత్కరించి బొటనవేలు నుండి విభూతికొండను సృష్టించగా తండువు శంకరుని పదములపై పడెను. శ్రీరాముని చేత జయించబడిన పరశురామునికి, శ్రీరాముడినే జయించిన హనుమంతునికి భేదము తెలుసుకున్నవాడు జ్ఞాని. ఈ హనుమంతుడి మార్గములోనే నడచి సదా దాసో2హమ్మని పథంలో శిరిడిసాయి కూడా ఎప్పుడు "అల్లామాలిక్" అనేవాడు. తాను హనుమంతుని దత్తపుత్రుడేననియు, వర్షముపడుచున్నను హనుమంతుని విగ్రహమున్న పైమెట్టున కూర్చొనక, ప్రపత్తినే ప్రదర్శించెను. కావున పరమాత్మనుండి సదా కీర్తిని, విజయమునే పొందగలిగినాడు.

ఇట్టి ప్రపత్తి భావమును అవతారములగు హనుమదాదులు కలిగియున్నను, వారిని ఆరాధించు భక్తులు వారిని పరమాత్మ స్వరూపములుగనే ఆరాధించవలెను. ఏలననగా, వారు విద్యుత్తీగలే. విద్యుత్తీగెను ఎచ్చట తగిలిననూ షాక్ కొట్టును. కావున విద్యుత్తుకు తీగెకు అద్వైతమే. తీగెను విడచిన విద్యుత్తు మనకు అందనిది. తీగె ద్వారానే స్పృశించగలము. ఇదే అవతారతత్త్వము. విద్యుత్తీగెయును మామూలు తీగెవలె సన్నగా వంకరలు తిరిగియుండు ధర్మములు కలిగియున్ననూ వాటిని చూచి విద్యుత్తీగెను మామూలు తీగెయని భ్రమించరాదు. అట్లే రామ, కృష్ణాది అవతార శరీరములు సైతము, ఇతర శరీరములవలె ప్రకృతి ధర్మములను కలిగి యున్నంత మాత్రమున వారిని సామాన్య జీవులని భ్రమించరాదు.

అజ్ఞానులగు నాస్తికులను ఆస్తికులుగా మార్చుట కొరకు ఈ సిద్ధులు ఆరంభావస్థకు సంబంధించినవి. ఆస్తికుడు జ్ఞాన - భక్తులను రెక్కలతో భగవత్ప్రాప్తిని పొందవలెను. కావున వారికి సిద్ధులు అనవసరమే కాక, హానికరము. ఈ సిద్ధులను పొంది అహంకరించి పతితులగుట చాల సులభము. ఈ సిద్ధులు కలవాడిని చేరి తన స్వార్ధములగు, ఐహికములను సాధించుకొనుచూ మరింత స్వార్ధము పెంచుకొని పరమాత్మకు దూరమగును. జ్ఞానము చేత గలిగిన ప్రతిఫలాపేక్ష రహితమైన భక్తియే వారికి మార్గము.

యమున నీలవర్ణ. ఈ రంగు తమోగుణ సూచకము. మహిమలు తమోగుణులైన పామరులకు సంబంధించినవి కావున " మహిమయమున" యని దీనికి నామకరణము చేయుట జరిగినది.

" అష్ట సిద్ధుల అవసరమేల? సుందరాకృతికి సొమ్ములు ఏల?
జ్ఞాన (భక్తి) యోగమే నా సౌందర్యము జ్ఞానులు (భక్తులు) దత్తుని గుర్తించెదరు."

స్వామి ఎన్ని అష్టసిద్ధులు ప్రదర్శించినా ఎంత ఉన్నతబోధ చేసినా దుర్యోధనాదులు విశ్వసించలేదు. ప్రదర్శించిన విశ్వరూపమును గారడి విద్యగా

భావించినారు. కావున జీవునకు శ్రద్ధలేకుండా, పరమాత్మ ప్రయత్నించినను ప్రయోజనములేదు. ఈ శ్రద్ధను కలిగియుండుటయే జీవుడు మొదటి అడుగు పరమాత్మవైపుకు వేయుట. అప్పుడు పరమాత్మ జీవునివైపుకు 100 అడుగులు వేయును. పరమాత్మయే మొదటి అడుగు వేస్తే జీవులు పరమాత్మను సైతం విశ్వసించక నిర్లక్ష్యంతో పరాభవిస్తారని "అవజానంతి మాంమూఢా:" అని గీతలో చెప్పబడినది. సిద్ధులను ప్రదర్శించినప్పుడు భయము ఆశ్చర్యము కలుగునే తప్ప ఆనందము ప్రేమ కలుగవు. ఆనంద ప్రేమలు జ్ఞాన – భక్తి తత్త్వములు ద్వారా కలుగును. భయము కన్నను భక్తి గొప్పది. అంతిమక్షణంలో పరమాత్మ తనను రక్షించడన్న భయంతో పరమాత్మను సేవించుటకన్నను, ఎట్టి ప్రతిఫలాపేక్షలేక కేవలము భగవద్గుణ జ్ఞానంతో ఏర్పడిన ఆకర్షణరూపమైన ప్రేమ యను భక్తి కలుగుటవలన పరమాత్మను సేవించుట అత్యుత్తమము. ఇట్టి భక్తికి పరమాత్మ లభించును " భక్త్యాత్వనన్యయాలభ్య: " అని గీత. జ్ఞానము వలన భక్తి ఏర్పడును. భక్తివలన పరమాత్మ లభించును. కావున జ్ఞానము మూలకారణము, భక్తి ప్రాప్తికారణము. స్వామి భక్తుల రోగములను తీసివేయునప్పుడు వారి కర్మ ఫలములను తరువాత జన్మలకు తోసివేయును. దాని వలన ఆ కర్మ ఫలములు మరింత వడ్డీతో అనుభవించ వలయును. మహాభక్తుల కర్మ ఫలములను స్వామి తానే అనుభవించును. ఈ రెండు పద్ధతులను జ్ఞాని – భక్తుడగు జీవుడు అంగీకరించడు కావున తన కర్మఫలములను తానే అనుభవించకోరును.

స్వామి సృష్టించు తేజస్సు మొదలగునవి, స్వామి సృష్టించిన సూర్యచంద్ర నక్షత్ర తేజస్సులముందు అల్పములు కావున జ్ఞాని యీ మహాసృష్టియే స్వామి యొక్క మహాసిద్ధిగా భావించి అల్పములగు అష్టసిద్ధులను చూడకోరడు.

"జ్ఞానమే నా సహజ సత్య స్వరూపం, ప్రేమయే నా సహజసత్య సౌందర్యం. ఈ రెండె నను బట్టగా గుర్తులిచ్చుట, నా అలంకారాలె యీ అష్టసిద్ధులు".

"సహ్యాద్రి వాసిని నేను – సాక్షాత్తు దత్తుడు నేను"

స్వామి.
(జన్నాభట్ల వేణుగోపాల కృష్ణమూర్తి)

# బాల్య జీవిత విశేషాలు.

శ్రీ దత్తస్వామి అని కొంతకాలము పిలువబడిన శ్రీ వేణుగోపాల కృష్ణమూర్తి గురుదేవులను భక్తులందరూ "స్వామి" అని పిలుస్తారు సంక్షేపంగా. స్వామిగా వ్యయనామ సంవత్సర ఫాల్గుణ శుక్ల విదియా ఆదివారమునాడు ఉష:కాలంలో ఉత్తరాభాద్రా 4వ పాదంలో మకరలగ్నంలో శ్రీ దత్త పరబ్రహ్మమే అవతరించినారు. వీరి తండ్రిగారు శ్రీ వీరభద్రయ్య శాస్త్రి గారు. సంస్కృతాంధ్ర భాషలందు ఆశుకవీశ్వరులు. శతాధిక గ్రంధ కర్తలు. మహాజ్యోతిష పండితులు. వీరి తల్లి గారు శ్రీమతి హనుమాయమ్మ గారు. ఇంటిపేరు జన్నాభట్ల వారు. కాశ్యపగోత్రము. గుంటూరుజిల్లాలోని వినుకొండ తాలూకాలోని నాగులవరము వీరి జన్మ గ్రామము. ఈ గ్రామము పూర్వకాలమున నాగులపుట్టలతో నిండియుండెనట. ఇది తక్షకుని నుండి గోవును దక్షిణగా గ్రహించి, పరీక్షిత్తును రక్షించుట విధి నియమ విరుద్ధమని అర్థించిన తక్షకుని ఆశీర్వదించి కశ్యపుడు వెనుతిరిగిన స్థలమట.

స్వామి తాతగారు శ్రీ కోటీశ్వర శాస్త్రి గారు. నిరంతర రామనామ జపతత్పరులు. వీరు మరణించినపుడు రామనామమును లెక్కించుచు వేలు చేతిమీద నిలచియుండెనట! వీరి కుటుంబమున కొందరు దుర్మార్గులు చేతబడులతో బాలురను సంహరించుచుండగా, స్వామి అష్టమ గర్భమున జన్మించినారట. స్వామి జన్మించగనే ఆ దుర్మార్గులు మరణించిరి. స్వామికి 5-6 సంవత్సరముల వరకు పేరుపెట్టలేదు. స్వామి ఊరిలోను ఇంటిలోను వెన్న దొంగిలించుటవల్లను, స్వామి వారి మేనత్త శేషమ్మగారు స్వామికి "వేణు గోపాలకృష్ణుడని" నామధేయమును నిశ్చయించినారట.

స్వామి అల్లరి శాంతించవలయునని ఉపనయనమును చేసి గ్రామవాసులందరికిని అన్న దానమును చేశారు. స్వామికి సంస్కృతమును బోధించవలయునని తండ్రిగారు చెప్పిన 8 శ్లోకములతోనే స్వామి ఆ చిన్ననాడు తదుపరి శ్లోకములను సమన్వయించిరట.

సంస్కృతంలో ఆశు కవిత్వం ప్రవహించు చుండగా, కావ్యాలను, స్తోత్రాలను, వేదాంత శాస్త్ర గ్రంధాలను శతాధికంగా ఎల్లప్పుడూ స్వామి వ్రాయుట ప్రారంభించిరి. 11 సంవత్సరములలో స్వామి వ్రాసిన కావ్య శ్లోకములను చూసి సంస్కృత పండితులు ఆశ్చర్యచకితులయ్యారు. శ్రీ మద్దుల పల్లి సత్యనారాయణ శాస్త్రి గారు, శ్రీ తాతాచార్యులు గారు మొదలగు మహాపండితులు స్వామి శ్లోకములు కాళిదాస శ్లోకములను మరిపింప చేయుచున్నవని పలకటం ఆనాటి విశేషం. శ్రీ వావిలాల వెంకటేశ్వర శాస్త్రి గారను గొప్ప వేదాంత పండితుడు " ఇతడికి సర్వ శాస్త్రములు కరతలామలకములు" అని ప్రశంసించారు కూడా. శ్రీ దోర్బల ప్రభాకర శర్మగారు, జన్నాభట్ల వీరేశ్వర శాస్త్రి గారు మొదలగు మహా పండితులెందరో స్వామి దైవికమైన ప్రతిభ కలవాడని వేనోళ్ళ పొగిడినారు. మచ్చుకు కొన్ని శ్లోకములు స్వామి గ్రంధములగు

**"వైయాసకమ్ నుండి"**

ఉపత్యకాభూత జగత్త్రయేఽపి, నేత్రత్రయావేక్షిత జంతుజాలం
అధిత్యకాయాంహి జటాసటాభి: , సాక్షాన్మహా సింహమివోపవిష్టమ్
(శివ వర్ణనమ్)

ఉల్లంఘయంశ్చిత్ర విచిత్రరీత్యా, బృందావనే గోపవధూజనాన్వా
తురంగమాన్కర్ణరథావరోధం, ముహుర్ముహు: పర్యహరన్మురారి:
(సైంధవ వధ సందర్భంలో కృష్ణుడు రథమును నడుపుట)

తరణి:కిరణేన తచ్ఛిరో - ధృతమాణిక్యరుచం ప్రకాశయన్
సమదర్శి రహస్య జన్మనే, స్వసుతాయేవ కరేణ వహ్నిద:
(కర్ణ వధానంతర సందర్భము)

**" శ్రీ కృష్ణ భాగవతమ్" నుండి**

వీరాయ కంసాదినిశాచరాణాం, మారాయ రాధాదిమనస్వినీనామ్
పారాయ సంసార మహాంబురాశే:, చోరాయ జారాయ తపశ్చరామి.

పింఛావిష్కృత శేఖరాయ తులసీ హారాయ, పీతాంబర -
వ్యానద్ధాయకటే రథ: కరతలే పారిప్లవద్వేణవే
సాయంకాల వనాంతరాగత గవాం పశ్చాత్కృతాయవ్రజై:
వామాలోకన వామలోచన కృత స్పందాయతే వందనమ్.

పాదక్షేప ఝులత్ఝులధ్వనిరయై రానందమాతన్వతే
ముక్తామేఖలయావిశిష్ట కలయా చక్షుస్సమాకర్షతే
ఆలిప్తాయ పయోభిరంతిమ గృహద్వారాద్బహిర్ధావతే
కస్మైచిన్మహసేనమాంసి మహతే బాలాయ నీలాయ తే.

స్వామి 10 సం॥ ప్రాయంలోనే భవిష్యత్తును చెప్పేవారు. తండ్రిగారి జ్యోతిషశాస్త్రము అలవడటము అని అందరూ అనుకొనేవారు. కానీ ఆ సంఘటనలు మచ్చుకు రెండు వింటే - జ్యోతిషానికి అతీతమైన దైవశక్తి మనకు గోచరిస్తుంది.

స్వామి గ్రామానికి పక్క గ్రామమైన కూకట్లపల్లిలో ఒక రైతు స్వామి ఇంటికి వచ్చి స్వామి తండ్రిగారికి తన కూతురి పెండ్లి శుభలేఖను యిస్తున్నాడు. స్వామి 10 సం॥ బాలుడు అక్కడే ఉన్నాడు. "పెండ్లికూతురు పెండ్లి కాగానే మరణిస్తుంది కదా. ఎందుకు ఈ పెండ్లి?" అని అన్నారు. ఆ రైతు నిర్ఘాంతపోయినాడు. ఇంటిలో అందరూ స్వామిని మందలించినారు. ఆ రైతు తిరుపతిలో స్వామి సన్నిధిలో పెండ్లి చేశాడు. పెండ్లి కాగానే, పెండ్లికూతురు అత్త మామలకు నమస్కరిస్తూనే బోర్లాపడి ప్రాణాలు విడచినది! ఈ సంఘటనతో ఆ గ్రామమంతా అట్టుడికినది! అలానే, అదే వయస్సులో స్వామి పక్క గ్రామమైన కుందిర్తిలోనున్న మేనమామ గారింటికి పోయినారు. ఆయన ఇంటిలోని ఒకడైరీ తీసుకొని ఫలానా తేదినాడు అత్తయ్య కలరాతో మరణించును అని వ్రాసి సంతకము చేసి ఆనాటి తేది కూడ వ్రాసినారు

స్వామి. ఆ విషయమును మేనమామ చూడలేదు అనాడు. అలానే ఆ తేదీ నాడు కలరాతో ఆమె మరణించినది. తరువాత మేనమామ తన డైరీ చదువుచుండగా విషయము బయటపడినది.

స్వామి 19 సంవత్సరముల వయస్సులో కెమిస్ట్రీలో పి.హెచ్.డి. డిగ్రీని సంపాదించి విశ్వంలో విశిష్ట స్థానమును పొందటం ఎంతటి ప్రతిభ! విద్యాభ్యాసం వల్ల కాశీ ప్రయాగలలో 5 సంవత్సరములు నివసించి ప్రతిదినము గంగా స్నానము, రుద్రాభిషేకములను చేసేవారు. స్వామి 15-16 సం॥ ప్రాయములో ఎందరో పండితులతో శాస్త్రార్థములను చేసి అచట పండితులకాశ్చర్యమును కలిగించారు కూడా. "తత్తు సమన్వయాత్" అను బ్రహ్మ సూత్రమున నున్న 'తు' శబ్దమునకు 102 అర్థములను చెప్పగా వాటిని కాశీ పండితుల వేదాంత పత్రికలో ప్రచురించి గౌరవించారు. కాశీ పీఠాధిపతియగు శ్రీ కరపాత్ర స్వామి వారు స్వామిని సంన్యసించి పీఠమునకు ఉత్తరాధిపతిగా రమ్మని కోరటం వీరి ప్రతిభకు నిదర్శనం కాదా? స్వామియును సిద్ధమై తండ్రిగారికి తెలుపగా, పెద్దకొడుకు కావున అంగీకరించలేదు. ఇది దైవనిర్ణయము కాకపోతే మరేమిటి? మనబోంట్లను ఉద్ధరించవలసిన కార్యం ముందు ఉండగా స్వామి ఎలా సంన్యసిస్తారు ఆ రోజున? ఇది మన అదృష్టం కాదా?

ప్రయాగలో మహాకుంభమేళ జరిగినది. ఆర్య సమాజము - సనాతన ధర్మములను రెండు పక్షములకును వాదోపవాదములు జరిగినవి. ఆర్య సమాజము నిరాకారుడగు ఈశ్వరునే విశ్వసించును. సాకారము కానీ, నరావతారములను కానీ విశ్వసించదు. సనాతన ధర్మము సాకార, నరావతారములను విశ్వసించును. (ఆర్య సమాజము పండితులతో 16 సం॥ స్వామి సంస్కృతంలో వాదించినారు.) ఆ వాదములో ఒక చిన్న సందర్భము.

స్వామి:- ఈశ్వరుడు సర్వ శక్తి మంతుడా? కాదా?
ఆర్య స. పం.:- ఈశ్వరుడు సర్వశక్తి మంతుడే. ఇది అన్ని మతములకు అంగీకారమే.

స్వామి:- అన్ని శక్తులున్న ఈశ్వరుడు ఆకారముగా మారగల శక్తిని, మరియు అవతారములనెత్తు శక్తిని కలవాడే అయి ఉండవలెను. అట్టి శక్తి లేదన్నచో ఈశ్వరుడు సర్వశక్తిమంతుడని అంగీకరించలేము గదా. ఆ శక్తి లేనివాడు అన వలసివచ్చును.

ఆర్య స. పం.:- **శక్తి యున్ననూ అవసరమున్ననే** ఈశ్వరుడు దానిని ఉపయోగించును. ఈ సందర్భములో **అవసరములేదు** కాన ఆ శక్తిని ఉపయోగించలేదు.

స్వామి:- కాదు. అవసరమున్నది. **నిరాకారుని** ధ్యానించలేము. కావున సాకారుడైన ఈశ్వరుడు కావలయును. **సాకారములగు** విగ్రహాదులు దర్శన స్పర్శలనేయిచ్చు చున్నవి. వీటితోబాటు సంభాషణ, సహవాసములను ఇచ్చుటకు ఈశ్వరుడు నరునిగా అవతరించుచున్నాడు.

ఆర్య స. పం.:- "నతస్య ప్రతిమా" "అరూపం" "నచక్షుషా" ఇత్యాది శ్రుతులు ఈశ్వరుని నిరాకారమును చెప్పుచున్నవి.

స్వామి:- "యత్సాక్షాత్" "ప్రత్యగాత్మానమైక్షత్" ఇత్యాది శ్రుతులు బ్రహ్మము ప్రత్యక్షమనియు, కంటితో చూచిరని చెప్పుచున్నవి. నిరాకారమును చెప్పు శ్రుతులు ఈశ్వరునితో అభిన్నమైన ఈశ్వర శక్తిని గురించి చెప్పుచున్నవి.

ఈ వాదముతో ఆర్య సమాజ పండితులు నిరుత్తరులైనారు.
స్వామి ఒక అద్వైత మత పీఠాధిపతితో సంస్కృతములో వాదించిన సందర్భము.

పీఠాధిపతి:- **అజ్ఞానియగు** సామాన్య జీవుని చూచి **తండ్రి "తత్త్వమసి"** - "నీవు ఆ బ్రహ్మమైయున్నావు" **అని అన్నాడు** కదా. **కావున సామాన్య** జీవుడును బ్రహ్మమే.

స్వామి:- ఇక్కడ **"అసి" అను ధాతువునకు " అతి త్వరలో** కాగలవు" అని "లట్" అర్థమును వ్యాకరణ **సమ్మతమే కావున తీసుకొనవలెను.** ఇక్కడ తండ్రి తన

అతివాత్సల్యము వలన అతి త్వరలో పుత్రునికి బ్రహ్మత్వము సిద్ధించ వలెను అని అనువాకాంతమున ఆశీర్వదించి ముగించుచున్నాడని గుర్తించ వలెను.


ఈ వివరణముతో ఆ పీఠాధిపతి **ఆశ్చర్యపడి స్వామిలోనికి అతినిశితముగా** చూచి దత్తదర్శనమును పొంది **సంతృప్తి** పడి " **నీవు త్రిమతములను సమన్వయించి** సిద్ధాంతమును స్థాపించగల సమర్థుడవు" అని ప్రశంసించెను. **ఆదిశంకరులకు శ్రీ** దత్తుడు చండాల వేషమున బోధించిన ఘట్టము ఇచ్చట స్ఫురించుచున్నది. **తత్త్వమసి** అను వాక్యము అద్వైత మతమునకు పెట్టని కోట. దీనిని వేరొక మార్గములో అన్వయించి స్వామి త్రిమత సమన్వయ సిద్ధాంతమును ప్రతిపాదించుచు సంస్కృతములో అనేక గ్రంధములను రచించిరి. మొదటి దశలో స్వామి ఎల్లప్పుడును సంస్కృత పండితులతోనే చాలాకాలము వరకు వేదాంత శాస్త్రములో చర్చలు, వాదములు, సత్సంగములను చేయుచుండిరి. రెండవ దశలో పామరులనుద్ధరించ దలచి దత్త వేదము, దత్త గురు భగవద్గీత, దత్తోపనిషత్తులను తెలుగు తాత్పర్య సహితముగా రచించి జ్ఞాన మార్గమును భక్తుల చేత ప్రచారము చేయించినారు. గోపీ గీతలను, భక్తి గంగలను గ్రంధముల ద్వారా భక్తి మార్గమును ప్రచారము చేయించినారు.

స్వామి 30 సం॥ ప్రాయములోనే రసాయన శాస్త్రములో ప్రొఫెసరు పదవి నలంకరించెను. స్వామి **ధర్మపత్ని శ్రీమతి జయలక్ష్మి నరసకుమారి. ముగ్గురు** పుత్రులు చి॥ ఆంజనేయ, వీరభద్ర, **వత్సార ఋషి నామధేయులు. పుత్రిక చి.సౌ.** హనుమాయమ్మ. సామాన్య మానవునకు **ముక్తి మార్గమును ఉపదేశించుచు,** "తన కర్తవ్యములకును, విశ్రాంతికిని పోను మిగిలిన సమయమును **టీవీ, సినిమాలు,** కథల పుస్తకములను చదువుట, వ్యర్థ సంభాషణములు అను **వ్యసనములందు** దుర్వినియోగము చేయక, సాధనకు సమర్పించిన చాలును **జీవుడు తరించగలడు;** సాధనయనగా స్వామి నుండి ఎట్టి ప్రతిఫలమును **ఆశించక, కేవలము** స్వామి కల్యాణ గుణములచే ఆకర్షింపబడి, స్వామి వలన **కష్టనష్టాలు వచ్చినా** స్వామిని త్యజించలేని మహావ్యసనము అగు నిరంతర ప్రేమధారా **భక్తి** ప్రవాహమే" అని అంటారు స్వామి



బ్రహ్మ యజ్ఞంలో స్వామి







స్వామి చిత్రాలు



దత్త జయంతి నాడు



**చిలుకూరు బాలకృష్ణ మూర్తి,**
రిటైర్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్
A.P. State Co-operate Bank
**శ్రీమతి భవాని**
నల్లగేటు డౌను, 41-15-5,
కృష్ణలంక, విజయవాడ.
ఫోను- 2521809.

**శ్రీ కోనేరు సత్యనారాయణ**
(ఛైర్మన్, కోనేరు లక్ష్మయ్య
ఇంజనీరింగ్ కాలేజి)
**శ్రీమతి శివ కాంచనలత**





**శ్రీ దశిక శ్రీ కృష్ణ సూర్యనారాయణ**
**మూర్తి**
UTI అసిస్టెంట్ మేనేజర్
**శ్రీమతి నాగలక్ష్మి**



శ్రీ సీతేపల్లి చంద్రశేఖర్‌గారు,
ఇంజనీర్ (కువైట్)
వారి ధర్మపత్ని శ్రీమతి గాయత్రిగారు,
వారి పుత్రికలు చి॥ ప్రియాంక,
చి॥ మానస



ఆత్మూరి శేషాద్రిగారు,
ఆడిటర్
శ్రీమతి లలితగారు

శ్రీ శిష్ట్లా భీమశంకరం,
ఆడిటర్
శ్రీమతి వసుమతి




స్వామి



## బ్రహ్మలహరి.
## (దివ్య దర్శనములనిచ్చుట.)
## శ్రీ దత్తునిగా దర్శనమిచ్చుట.

సీతమ్మ

విజయవాడ - కృష్ణలంకలోని సీతమ్మ గారికి ఒకసారి బంగారు ఛాయతో త్రిముఖ షడ్భుజ దర్శనమిచ్చినారు స్వామి. ఆ దర్శనముతో ఆమె మూడు రోజులు తన్మయావస్థలో నుండినది.

స్వామి తిరుపతిలో ఖాది బోర్డు మాజీ సెక్రటరీ శ్రీ గండ్రకోట శివరామమూర్తి గారింట్లో మూడు రోజులు శ్రీ దత్త భగవానుని భజన చేయటం తటస్థించింది. మూడవ రోజున ఒక అద్భుతం జరిగింది. మూడవ రోజున భక్తులందరూ నమస్కరించు సమయంలో శివరామ మూర్తి గారి పెద్ద కోడలు వల్లికి ఒక అద్భుత దర్శనం కలిగింది. స్వామి వారు ఆమెకు త్రిముఖ షడ్భుజ రూపంలో దర్శన మిచ్చారు. " నీ కిప్పుడు నేనెలా కనిపించానో అందరికి వినపడేలా చెప్పు" అన్నారు దత్తస్వామి. " మీరు త్రిముఖ షడ్భుజములతో దర్శన మిచ్చారు" అన్నది ఆమె. అప్పుడు స్వామి మందహాసము చేయుచూ " నిజమేనా? బాగా చూసి చెప్పు" అన్నారు ఆమెతో. అప్పుడు ఆమె కన్నులు నలుపుకొని మరల చూచింది. "నిజమే అలానే కనిపిస్తున్నారు" అని చెప్పింది.

శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారి ప్రియతమ భక్తులు శ్రీ సుబ్రహ్మణ్యం గారు. వీరు ఒకసారి శ్రీ స్వామీజీని కలసి, " స్వామీజీ! నేను ఉద్యోగం మానేస్తాను, తమ సేవలో గాణుగాపురంలో ఉండిపోతా" నన్నారుట. ఈ విషయమే విజయవాడలో స్వామిని కలసినప్పుడు చెప్పారు. అప్పుడు స్వామి ఇలా వచించారు. - " వద్దు మీరు గాణుగాపురం వెళ్ళవద్దు" అన్నారు. సుబ్రహ్మణ్యంగారు గాణుగాపురం వెళ్ళలేదు. ఈ సంఘటన జరిగిన నెల రోజులలోనే సుబ్రహ్మణ్యంగారు మైసూరు ఆస్పత్రిలో మరణించినారు. ఆయనకు చివరి ఘడియలలో స్వామి దర్శనమిచ్చారు. ఆ దర్శనంలో త్రిముఖ షడ్భుజ రూపంలో స్వామి దర్శనం అనుగ్రహించారు. ఆ దర్శనంలో దత్త ముఖాల స్థానంలో స్వామి ముఖమే ఉన్నదట!.

ఆ సమయంలో సుబ్రహ్మణ్యం గారు భార్యతో ఇలా చెప్పినారట. "నీవు పోయి విజయవాడలో నున్న స్వామిని దర్శించుకో తరిస్తావు " అని వచించారట. "ఆయన సాక్షాత్తు దత్తుడు. ఆయన నాకు త్రిముఖ షడ్భుజ రూపంలో సాక్షాత్కరించినారు. ఆయన పాదాల వద్ద ఒక ఋషి పుష్పాలను పైకిచల్లుతూ స్వామిని ఆరాధిస్తూ కనిపించినారు" అని చెప్పినారట. ఈ మాటలే సుబ్రహ్మణ్యం గారి చివరి మాటలట. ఈ మాటలు చెప్పగానే, మాట పడిపోయి సుబ్రహ్మణ్యంగారు పరమపదించినారు. వీరి భార్య విజయవాడ వచ్చి ఈ విషయం వివరించినారు. సుబ్రహ్మణ్యంగారి అపరక్రియలను శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ స్వయముగా నిర్వహించినారట. సుబ్రహ్మణ్యంగారు ఎంత యోగ్యులో కదా. అంతిమ దత్త దర్శనం పొందినాడు గదా!



శ్రీలక్ష్మి

## బ్రహ్మ తేజస్సును చూపుట.



భాస్కర్

విజయవాడ కృష్ణలంకలో మా గృహంలో మూడవ అంతస్తులో శ్రీ దత్త పీఠాన్ని స్వామి ప్రతిష్ఠించినారు స్వయంగా. ఇది తన మూలస్థానం అంటారు స్వామి. ఆ పీఠంలో ప్రతిరాత్రి మేము దత్త భగవానునికి పుష్పశయ్య అమర్చి, సేవిస్తు ఉంటాము. ఆ శయ్యపై స్వామి శయనించేవారు రాత్రిళ్ళు. మా పెద్ద కోడలు శ్రీ లక్ష్మి స్వామిని గురువుగా భావించేది. శ్రీ దత్త భగవానునికై వేసిన ఆ పుష్పశయ్యను ఒక మానవ మాత్రుడు (అనగా మన స్వామి) పాదాలతో త్రొక్కుతూ ఆ శయ్యపై శయనించటము అంత ఇష్టంగా ఉండేదికాదు ఆమెకు. " నేను భౌతికంగా ఎక్కడ ఉన్నా, ప్రతిరాత్రి యీ శయ్య పై నేను శయనిస్తాను కావున, యీ మందిరం తలుపులు మూసిన తరువాత ఎవరూ తలుపు సందులు, కిటికీ సందులు ద్వారా లోపలకు చూడవద్దు" అని స్వామి ఒకరోజు గట్టిగా శాసించినారు, ఒకసారి నేను ఆ ప్రయత్నం చేయగా.

ఇంతలో కార్తీక మాసం వచ్చింది. ఒక కార్తీక సోమవారం నాడు రాత్రి శ్రీ లక్ష్మి కార్తీక దీపం తులసికోట వద్ద వెలిగించుకొని, మందిరం తలుపులు వేసియున్నందున కిటికిలో నుండి పీఠానికి నమస్కరిద్దామని లోపలికి తొంగిచూచింది.

అంతే, ఆహా! అది అద్భుత దర్శనం. మహాతేజస్సుతో, శయ్యపై, కర్పూర గౌర శరీరంతో శ్రీ దత్త ప్రభువు దర్శనమిచ్చినారు శయనించిన ముద్రతో!.

ఆశ్చర్యం - ఆనందం - సంభ్రమాలతో నిర్ఘాంతపోయి భయంతో కిందకు పరుగుతీసింది. మరునాడుగాని అసలు విషయం బయట పడలేదు.

మరునాడు స్వామి వేంచేశారు. జరిగిన విషయమంతా పూసగుచ్చినట్లు విన్నవించింది శ్రీ లక్ష్మి. అప్పుడు స్వామి ఇలా శెలవిచ్చారు. "ధన్యురాలవు! నీకు బ్రహ్మతేజస్సు యొక్క సాక్షాత్కారం కలిగింది. ఆ దర్శనం ఎన్నో జన్మల తపస్సు యొక్క ఫలమ"ని స్వామి చెప్పటంతో - ఆమె ఆనందానికి అవధులులేవు.

## విష్ణు చక్రమును చూపుట.

స్వామి సత్యనారాయణపురంలో ఓగిరాల వారి వీధిలోయున్న శిష్ట్లా భీమశంకరం, వసుమతి గారి ఇల్లు పావనం చేశారు. ఆ సందర్భంలో ఒక రోజు స్వామి సాయంకాలం తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం వాస్తవ్యురాలు శ్రీమతి పద్మ గారితో ఫోనులో సంభాషిస్తున్నారు. ఆమె గొప్ప భక్తురాలు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుని చేతిలోని పద్మమేనట. ఆ భక్తురాలితో స్వామి ఫోనులో మాట్లాడుచూ, "నందనా" అనే పాట వినిపిస్తున్నారు. ఆ పాటలో -

"అష్ట సిద్ధులను భ్రమలను వీడుము - పాఫలకేగద మాయలు వింతలు"

అని పాడారు. వెంటనే పద్మ ఇలా అన్నారు.



రమ



పద్మ (రమ అక్క)



పద్మ (రామచంద్రాపురం)

"పోనీ స్వామి! అష్టసిద్ధులు నాకు చూపకపోతే సరే మీ ఇష్టం. కాని నాకు చూడాలని ఉంది. ఒక పని చేయండి. విజయవాడలో ఉన్నారుగదా. అక్కడ ఎవరికైనా యీ క్షణంలోనే ఒక సిద్ధిని చూపించి, వారిచే నాకు ఫోను చేయించి, వారికి ఏమి అనుభవమైనది వెంటనే నాకు చెప్పించండి. అది చాలు నేను సంతోషిస్తాను" అన్నది ఆమె.

ఆ సమయంలో విజయవాడలో సత్యనారాయణపురంలో భీమశంకరం గారి ఇంట్లో ప్రక్క భాగంలో అద్దెకున్న పద్మా ప్రభాకర్‌ల యింటికి ప్రభాకర్ గారి మరదలు రమ హైదరాబాదు నుండి ఆ రోజే రావటం జరిగింది. ఆ సమయంలో ఆ పిల్ల రమ వారి ఇంట్లో నుండి భీమశంకరం గారి ఇంట్లోకి వస్తోంది. ఫోనులో పాట పాడుతున్న స్వామిని చూచింది. అంతే! ఆశ్చర్యచకితురాలైంది. ఏమిటి ఈ విచిత్రం! స్వామి తల వెనుక పంచ రంగులతో ఒక తేజశ్చక్రము తిరుగుతు కనిపించింది. అంతకు ముందు స్వామిని చూడటంగాని, స్వామిని గురించి వినటంగానీ లేని ఆ పిల్ల తెల్లపోయింది. ఆ దివ్య దర్శనంతో ఆ పిల్ల ఎంతటి ఉద్రేకానికి లోనైందంటే, ఆ రోజు సాయంత్రం జరిగిన భజనకు రాలేదు సరికదా ఆ భజన సమయంలో స్వామి వంక చూడటానికే భయపడి వణకసాగింది. ఏమిటి? కారణం అని ఆ పిల్ల అక్కగారు వత్తిడి చేయగా అప్పుడు భయపడుతూ భయపడుతూ ఆ నిజాన్ని వివరించింది. అప్పుడు కాని అందరికి ఆ విషయం తెలియలేదు.

తర్వాత స్వామి ఆమె పూర్వజన్మను గురించి వివరిస్తూ, ఆమె శ్రీరంగంలో భగవత్సాన్నిధ్యంలో నృత్యం చేసిన నర్తకి అనియు, ఆ పుణ్య విశేషం చేత ఈ జన్మలో ఆమెకు స్వామి ఈ దివ్య చక్ర దర్శనం – అనుగ్రహించారని వివరించారు. ఆ దివ్యదర్శనం జరిగిన విషయాన్ని, వెంటనే భీమశంకరం గారి కుమారుడు ఫణి రామచంద్రాపురం ఫోను చేసి పద్మగారికి ఈ దివ్య ప్రదర్శనమును గురించి తెల్పటంతో ఆమె పరమానంద భరితురాలైంది. రమ కూడా ఫోనులో పద్మతో మాట్లాడటంతో పద్మ ఆనందానికి అవధులులేవు.

"రమ చూచినది విష్ణు చక్రము. అదే కాల చక్రము. పంచరంగులే పంచభూతములతో చేసిన సృష్టి" అని వివరించారు స్వామి.

ఇది ఇలా ఉండగా మరియొక విచిత్ర సంఘటన జరగటం విశేషం.

రమ విజయవాడలో విష్ణుచక్రం దర్శించిన సమయంలోనే - స్వామి గ్రామమైన నరసరావుపేటలో ఒక భక్తునికి శ్రీ లక్ష్మీయను అమ్మవారు పూని, స్వామి బంధువులతో ఇలా సెలవిచ్చాడు.

"విజయవాడలో ఉన్న మీ స్వామి తలచుట్టూ ఎప్పుడూ పంచరంగుల విష్ణుచక్రం తిరుగుతు ఉంటుంది. అది ఈనాడు ఒకరికి కనిపించింది" అని చెప్పుట మరో అద్భుతవిశేషము.



## ఫణికి ఆత్మలింగమును చూపుట.

ఫణి

అది కార్తీక మాసం. సోమవారం. భీమశంకరంగారి ఇంట్లో ఆ రోజు స్వామి ఉన్నారు. కార్తీకమాసం మొదటి సోమవారం కదా. సాయంకాలం స్వామి భజన ఆరంభించినారు. ఆ రోజు స్వామి ఎన్నో కొత్త పాటలను ఆశువుగా చెప్పసాగినారు. రాత్రి 10-30 అయింది. భక్తులందరూ నిద్రలోకి జారుకున్నారు. భీమశంకరంగారి కుమారుడు ఫణిమాత్రం స్వామి పాదాలవద్ద ఆసీనుడైయున్నాడు. స్వామి నిద్రించకుండా ఫణి నిద్రించడు గదా. స్వామి పాదసేవ చేస్తూ, స్వామి నిద్రించిన తరువాతనే ఫణి నిద్రిస్తాడు ఎప్పుడూ. కానీ, ఆ రోజు మాత్రం ఎందుకో స్వామి ఫణిని పోయి నిద్రించమని చాలాసార్లు హెచ్చరించారు. ఫణి స్వామి మాట వినలేదు. స్వామి కసురుకున్నారు. "పోయి పడుకో" అని పెద్దగా అరిచారు. నిద్రలోకి జారుకున్న కొందరు భక్తులు త్రుళ్ళిపడి లేచి " ఇదేమిటి? యీ రోజు యిలా అరుస్తున్నారు స్వామి" అని ఆశ్చర్యపడి మరల నిద్రలో మునిగినారు. ఫణి

మాత్రం భీష్మించుకొని కూర్చుండి నాడు స్వామి పాదసేవ చేస్తూ. సరిగ్గా అర్ధరాత్రి 12 గం॥ లింగోద్భవకాలమైనది. స్వామి హృదయమునుండి ఒక మహాతేజోమయమైన తరంగము – జ్యోతిర్లింగం బయటకు వచ్చినది. దాని నుండి 'ఓంకార' నాదము నిరంతరము వెలువడుచున్నది. . దాని తేజస్సులో ఆ గది గోడలు కూడా కనిపించుటలేదు. "స్వామీ! ఏమిటిది? శివలింగము!" అని అరచినాడు ఫణి. దానికి స్వామి " ఇది రోజూ వస్తుంది. ఎవరికీ కనపడదు." అన్నారు. ఫణి ఆత్మలింగమును పట్టుకొన వలయునని స్పృశించినాడు. ఫణి చేతి వ్రేళ్ళు లింగములోనికి దూరినవి. బయటకు తీసినాడు. వ్రేళ్ళు చాలాసేపు మెరిసినవి. సుమారు15 ని.లు ఆత్మలింగము నిలచి, మెల్లగా స్వామి హృదయంలోకి పోయి అదృశ్యమైనది. ఈ దివ్య దర్శనమును పొందిన ఫణి 3 రోజులు ప్రాపంచిక అవస్థకు అతీతంగా ఉండిపోయాడు. ఆ మరునాడు స్వామి యిలా వివరించినారు. "సృష్టి చేయాలని మొదటగా కలిగిన సంకల్ప శక్తి తరంగమే ఆత్మ లింగము. ఆ తరంగమే కుండలిని – ఆది శక్తియగు అనఘ ".

ఈ దివ్యదర్శనము ఫణి యొక్క పూర్వజన్మ పుణ్యఫలమేననియు, ఫణి సాక్షాత్తు ఆదిశేషుని అవతారమని వివరించిన స్వామి దివ్యవాక్కులను విని అందరూ ఆనందడోలికలలో తేలియాడినారు. ఆహా! ఎంతటి అద్భుత దర్శనము!.

## విశ్వరూప దర్శనము నిచ్చుట.

మేమందరం స్వామికోసం నిరీక్షిస్తున్నాము. ఇంతలో అజయ్ గారికి సీతమ్మ గారికి మధ్య ఒక సంభాషణ జరిగింది. అది ఇలా ఉంది. సీతమ్మగారు క్రిందటి రోజున స్వామి సువర్ణ తేజస్సుతో తనకు యిచ్చిన శ్రీ దత్త దర్శనమును గురించి అజయ్‌గారికి వర్ణించి చెప్పుచున్నది. ఇప్పటికీ ఆ రూపము కనపడుచున్నదని, తనివి తీరుటలేదనియు ఎంతో ఉద్రేకముతో చెప్పుచున్నది. అప్పుడు అజయ్‌గారు అదివిని "సీతమ్మగారూ! మీకే కదా కనపడినది. నాకు కనపడటం లేదుకదా" అని అన్నారు, ఆ భాగ్యం తనకు కలుగని వేదనతో.

ఇంతలో స్వామి రానే వచ్చారు. సత్సంగం ప్రారంభమైనది. ఆనాడు గురుపూర్ణిమ. స్వామి సత్సంగంలో భక్తులకు భగవద్గీతాసారము నంతయు 3 గం॥ సమయము ప్రవచన వర్షము కురిపిస్తున్నారు. "మనస్సంగం వల్లనే కర్మఫలాలు జీవుడికి అంటుకుంటాయి. జడమైన కర్మ, జడదేహంతో పాటు భస్మమౌతున్నది. మనస్సంగం లేకుండా వ్యాసుడు అంబిక - అంబాలికలందు పుత్రోత్పాదనం చేసినా ఏ పాపము అంటలేదు. మనస్సంగం లేని సీత, రావణ స్పర్శచేత దూషితురాలు కాలేదని అగ్ని రాముడికి చెప్పినాడు. శరీరస్పర్శ లేకపోయినా, మనస్సు చలించుట చేత రేణుక, శిరశ్ఛేద పాప ఫలాన్ని పొందినది. పరకాయ ప్రవేశం ద్వారా తాను పొందిన స్త్రీల భోగాల ఫలాలు తనను అంటవని, మనస్సంగం లేనందున తాను పవిత్రుడనని శంకరులు సర్వజ్ఞ పీఠం ఎక్కుతూ సరస్వతీ దేవి ఆక్షేపించగా, ఆమెతో అన్నారు. హనుమంతుడు కూడా లంకలో వివస్త్రలుగా నిద్రించుచున్న అసురవనితలను చూచినందున, మనస్సంగ రాహిత్యం వల్ల పాపిని కాలేదని సుందరకాండలో తలచినాడు. ఇదే నిష్కామ కర్మ యోగము........" అని యిలా గీతాతాత్పర్యాన్ని అమృతవర్షంగా కురిపించినారు. హఠాత్తుగా, స్వామి ఎంతో వేగంగాలేచి 5 నిముషాలు నిలబడినారు. తరువాత ఆసీనులై, భక్తులలో ఉన్న సీతమ్మగారినీ ఆత్మీయభక్తుడగు అజయ్‌గారినీ " మీరిరువురూ ఏమి చూశారు? " అని స్వామి ప్రశ్నించగా, ఇరువురూ ఒకే సమయంలో ఒకే దృశ్యాన్ని చూసినట్లు వారి సమాధానాలలో చెప్పారు. అయితే ఆ దృశ్యం ఏమిటి? భక్తులంతా వినాలని కూతూహలపడ్డారు. ఆ దృశ్యం ఇది. స్వామి విశ్వరూపంలో గోచరిస్తున్నారు. ఆ విశ్వరూపుని పాదాల మీద అర్జునుడు సాష్టాంగపడి ఉన్నాడు. స్వామి వెనుక బంగారు రథం ఒకటి ఖాళీగా ఉన్నది. " ఒకే సమయంలో ఒకే దృశ్యాన్ని ఇరువురికీ చూపించటంలో కంటిభ్రమ కాదని తేలింది గదా" అన్నారు నాతో - అలా ఇరువురికీ దర్శనమిచ్చుటలో అంతరార్థం ఏమిటని నేను అడిగినందుకు. "మరియును, అజయ్, సీతమ్మకే దర్శనమైనది తనకు కాలేదని బాధపడుచున్నందున ఇట్లు చేశాను" అన్నారు.

ఆహా! ఎంతటి మహిమ!.

సరిత



## ఆదిపరాశక్తియే.

మొట్టమొదట సారిగా తాను ఆశువుగా చెప్పిన భజనపాటను " గౌరీ కళ్యాణ వైభవమే", " పారాణి పాద పద్మములవిగో, జగదంబవియట కదలుచున్నవే", అంటూ పాడుతున్నారు స్వామి ఒకసారి విజయవాడలో. ఇంతలో గుంటూరు నుండి సరితగారు వచ్చారు. ఆమె స్వామిని చూచి స్తంభించిపోయి స్వామి పాదాల మీద పడిపోయింది. ఆమె లలితా సహస్ర నామాలను నిత్యం పారాయణం చేస్తుంది. స్వామి ఆమెకు లలితగా సాక్షాత్కరించడంతో తదేక దృష్టితో చూస్తోంది. పారాణితో, మెట్టెలతో, బంగారు గజ్జల పట్టాలతో పాదాలు ఎంత స్పష్టంగా కనిపించిన వంటే, ఇప్పటికీ అవి ఆమె కన్నుల ముందు గోచరిస్తున్నవట! స్వామి నవ్వుతూ " అవి నా పెండ్లి నాటి పాదాలు" అన్నారు. దత్తుడికీ శక్తికీ అభేదం అని బోధించటమే గదా ఈ సన్నివేశం.



## సాక్షాత్తు శ్రీ రాముడే.



వెంకటేశ్వరరావు పద్మజ

మార్చి 12వ తేదీన శివరాత్రి. మేము శివరాత్రి ఉత్సవాలకు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి మైసూరు ఆశ్రమమునకు వెళ్ళాము. సభ ముగియగానే స్వామీజీ ఇలా ఆజ్ఞాపించారు. " శివరాత్రి దీక్ష పూర్తయింది. మీరందరూ వెంటనే ఎవరి ఇండ్లకు వాళ్ళు వెళ్ళిపోండి. 15 వ తేదీ ఉదయంలోగా – ఎవరి స్థానాలకు వారు చేరుకోండి" అని ఆజ్ఞాపించారు. ఏమిటి! స్వామీజీ ఇలా ఆజ్ఞ ఇచ్చారు! అనుకొన్నాము. పత్రికలు చూడగా – 15 మార్చిన అయోధ్యలో రామమందిరం శిలాన్యాసం ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిసింది. స్వామీజీ ఆజ్ఞానుసారంగా మేము బయలుదేరి విజయవాడ చేరుకున్నాము. మార్చి 15వ తేదీ రానే వచ్చింది. ఈనాడే రామ మందిరం శిలాన్యాసం. గుజరాత్ అల్లర్లుతో ఉడికిపోతున్నది. ఆ రోజు మధ్యాహ్నం స్వామి 2 గం॥ కృష్ణలంకలో శ్రీవెంకటేశ్వరరావు గారింటికి వచ్చి భిక్షను గ్రహించినారు. అపుడు నేను "స్వామి!

యీ రోజు అయోధ్యలో శిలాన్యాసం గదా. ఏమి గందరగోళం జరుగుచున్నదో" అన్నాను. స్వామి "అయోధ్య అనగా యుద్ధము లేనిది అని అర్థము" అని వివరించారు. సరిగ్గా 3 గం॥కు శ్రీరాముని హనుమంతుని కీర్తిస్తూ స్వామి భజనలు చేశారు. సాయంత్రం 4 గం॥ అయినది. భజన చేస్తున్నంత సేపు స్వామి బాణాలు రెండు చేతులతో వేస్తూనేయున్నట్లు చేతులు కదిలించుచున్నారు అక్కడ ఎట్టి అల్లర్లు జరుగకుండా. "సాయంత్రం టీవీలో చూడండి రక్షణ బాణాలు వేశానుగదా" అన్నారు. ఫణి ఇలా అన్నాడు. "స్వామీ! 2.15కు ముహూర్తం అంటున్నారు కదా! మీరు 3 గం॥లకు భజన ఆరంభించి రక్షణ బాణాలు వేశాను అంటున్నారు గదా? ఇదేమిటి స్వామి?" అన్నాడు. ఫణికి స్వామి దివ్య దృష్టి నిచ్చి అయోధ్యలో శిలాన్యాస కార్యం చూపించారు. కొన్ని అనివార్య కారణాల వల్ల శిలాన్యాసం 1.15 ని॥లు ఆలస్యంగా తోసుకుపోయి 3.30 కే జరిగినది. ఫణికి అయోధ్యలో కోతులు మందలు మందలుగా నిలచి కనిపించినవట.

స్వామి సంకల్పముతో సీతమ్మగారికి అయోధ్యను రక్షించుచున్నట్లు హనుమంతులవారు కనిపించారు. "ఏమి కనిపించిందో చెప్పు" అని స్వామి ఆదేశించగా సీతమ్మగారు చెప్పినారు. మన భజన మధ్యలోనే శిలాన్యాసం జరిగినదని ఫణికి 4 గం॥ సమయంలోనే స్వామి చెప్పినారు. ఆ రోజు విశ్వామిత్రుల నుండి పొందిన సమస్త దివ్యాస్త్రములను ప్రయోగించానని స్వామి చెప్పినారు. ఆ రోజు సాయంత్రం టీ.వీలో చూచిన సత్యం 3.30 గం॥లకు జరిగిన శిలాన్యాసం! ఇది ఒక చక్కటి నిదర్శనం.

## స్వామి శ్రీ లక్ష్మీ నరసింహుడే.

అజయ్‌గారు పూర్వజన్మలో 1600 సం॥ క్రింద యోగానంద లక్ష్మీనరసింహాచార్యులు అను నామధేయంతో తిరుపతిలో ఉన్న అర్చకులని స్వామి చెప్పేవారు. ఒకరోజు అజయ్‌గారు హఠాత్తుగా ఉదయం భార్య లక్ష్మితో " ఈ రోజు

పానకం తయారు చేయి" అన్నారు. లక్ష్మి (అజయ్‌గారి భార్య) "ఇదేమిటి? యీ కోరిక! ఆఫీసుకు పోయేటైములో" అనుకొని పానకం చేయలేదు.

ఆ రోజు స్వామి రాజమండ్రిలో ఉన్నారు. రాత్రి 9 గం॥ విజయవాడ స్టేషన్‌కు వచ్చినారు. స్వామిని తీసుకుని వచ్చుటకు అజయ్‌గారు స్టేషన్‌కు వెళ్ళారు. స్వామి అజయ్‌గారి స్కూటర్ వెనుక ఆసీనులగుచూ "ఇప్పుడు నీ వెనుక సింహం కూర్చున్నది తెలుసా!" అంటూ ఆశువుగా దారిపొడుగునా " అహో పింగళాక్షాగ్ని జాజ్వల్య మానా......." అని ఆరంభించి నరసింహస్వామి వారి భజనను పాడినారు.

ఇంటికి రాగానే లక్ష్మితో "పానకం చేసినైవేద్యం పెట్టు" అని ఆదేశించినారు! ఎంత విచిత్రము! ఉదయం సంగతి అప్పుడు గుర్తుకు వచ్చింది అజయ్‌కు లక్ష్మికీ! ఉదయం అజయ్‌గారి ద్వారా తానే మాటలాడితినని చెప్పినారు. భక్తులనావేశించి భగవానుడు మాటలాడునని " తన్మయాహితే" అను నారద భక్తి సూత్రాన్ని నిరూపించినారు స్వామి.

## శ్రీ వేంకటేశ్వరునిలో స్వామి దర్శనం.

ఆ రోజుల్లో స్వామి రోజూ ఎర్రని స్వెట్టర్ ధరించేవారు. ఒకసారి ఒక విచిత్రం జరిగింది. అజయ్, ఫణి తిరుపతి వెళ్ళటం తటస్థించింది. శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్ళారు ఇద్దరూ. శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహంలో స్వామి ఎర్రని స్వెట్టర్ వేసుకొని నవ్వుతూ దర్శనమిచ్చారుట. ఆహా ! ఎంతటి విచిత్ర దర్శనం. ఆ యాత్రలో ముచ్చటగా మూడు సేవలు చేసుకోవాలని సంకల్పించారు అజయ్‌గారు. " మీకు రెండు సేవలే ఈ రోజు లభిస్తాయి" అని స్వామి చెప్పారు. అయినా వదలకుండా ప్రయత్నించారు అజయ్‌గారు. ఆ రోజు ఎంత ప్రయత్నించినా మూడవసేవ దొరకలేదు. ఆహా! అది దత్త దివ్య వాణి గదా!

# స్వామి శ్రీ వేంకటేశ్వరుడే.

ఫణి మద్రాసులో ఒక ఉన్నతోద్యోగానికి అందరి బలవంతంతో ఇంటర్వ్యూకు వెళ్ళినాడు. మొదటి ఇంటర్వ్యూ జరిగింది. సెలక్టు అయిన 14 మందిలో ఫణి కూడా ఉన్నాడు. కాని ఫణికి విజయవాడ వదలటం ఇష్టం లేదు. ఎందుకంటే స్వామి సన్నిధిలో నుండి స్వామికి సేవ చేయ్యటమే అతడి జీవిత లక్ష్యం. ఇంతలో రెండవ ఇంటర్వ్యూకు పిలుపు వచ్చింది. రెండవ ఇంటర్వ్యూకు పోవటానికి సిద్ధమై బయట వేచియున్నాడు. అత్యాశ్చర్యకరంగా శ్రీ వేంకటేశ్వరుడు దర్శన మిచ్చారు. " నీకీ ఉద్యోగం యిస్తాను" అన్నారు. ఫణి వెంటనే " నాకు వద్దు ఈ ఉద్యోగం". విజయవాడలో స్వామి రూపంలో ఉన్న నీ సేవ చేయటమే నా లక్ష్యం" అన్నాడు. శ్రీ వేంకటేశ్వరుడు నవ్వుతూ " అవును నీ రూటు వేరులే" అంటూ అదృశ్యమైనాడు. అపుడు ఫణి టైం చూసుకొన్నాడు. సరిగ్గా మధ్యాహ్నం 12 గం॥. ఆ రోజు దత్త జయంతి. ఆ సమయంలో స్వామి విజయవాడలో భక్త సందోహంతో ఆసీనులైయున్నారు. సరిగ్గా అదే 12 గం॥ సమయంలో స్వామి అజయ్‌గారి వైపుతిరిగి "గోవింద గోవింద నామమే చాలు, అన్నపానములేల ఉద్యోగమేల?" అని పాడినారు. అజయ్‌గారు ఉలిక్కిపడ్డారు. ఎందుకంటే ఆ సమయానికి తన ఆఫీసులో ఉండాలిసినపని ఉండటం చేత దానిని గురించే ఆలోచిస్తున్నారు. వెంటనే స్వామి "నీ గురించి కాదులే, ఫణి గురించి-యిది. మంచి ఉద్యోగమిస్తానని నేను మద్రాసులో ఇప్పుడు చెప్పియున్నాను. కాని వద్దంటున్నాడు. నేనేం చేసేది?" అన్నారు. భీమశంకరం, వసుమతి గారు స్వామికి ఒక కొత్త స్వెట్టర్‌ను అర్పిస్తూ నమస్కరించారు. స్వామి నవ్వుతూ చమత్కారంగా "ఫణి ఫైనల్ సెలక్షన్ కోసం ముందుగా నాకీ బహుమతిని యిస్తున్నారా ఏమి? అలా అయితే ఇది నాకు వద్దు. ఎందుకంటే ఫణి ఉద్యోగమును ఇస్తానంటే వద్దంటున్నాడు." అని అన్నారు. ప్రతిఫలాపేక్ష లేకుండానే అర్పించామని వారనగా దానిని స్వీకరించారు. తరువాత రెండవ ఇంటర్వ్యూలో సెలక్టు కానందున తిరిగి వచ్చిన ఫణి, విషయమంతా వివరించగా భక్తులు ఆనందాబ్ధిలో తేలియాడారు. స్వామి శ్రీ వేంకటేశ్వరుడు తానేనని నిరూపించటానికి ఈ చిన్న సంఘటన చాలదా?

# సీతమ్మగారికి, ఫణికి దివ్య దృష్టి నిచ్చుట.

సీతమ్మగారికీ, ఫణికీ స్వామి అనేక దివ్య దర్శనాలనిచ్చినారు. సీతమ్మగారికి నిత్యము దివ్య దర్శనాలనిచ్చి ఆమె చూచినది భక్తులకు చెప్పి ఆనందింప చేయమని చెప్పేవారు. ఆమెకు శ్రీరామునిగా, ఆంజనేయునిగా గణపతిగా, శివునిగా శివలింగరూపంగా పెక్కుమార్లు వేంకటేశ్వరస్వామిగా, శ్రీమన్నారాయణునిగా, దత్తునిగా దర్శనాలనిచ్చారు. అజయ్‌గారి భార్య ప్రమాదంలో ఉండగా సీతమ్మగారితో "చూడు చూడు ఏంకనపడుతోందో చెప్పు" అన్నారు. సీతమ్మగారికి బ్రహ్మదేవుడు సాక్షాత్కరించి "చూడు ఏంచేస్తానో" అన్నాడు. అప్పటి నుండి రోగం తిరుగు ముఖం పట్టింది. ఒకరోజు శివలింగం పైన స్వామి ముఖం కనిపించింది. ఆ లింగానికి ఋషులందరూ అభిషేకము చేస్తున్నారట! ఫణికి సత్యనారాయణపురంలో ఆత్మలింగం కనిపించిన సమయంలో సీతమ్మగారికి కృష్ణలంకలో స్వామి కనిపించి " నీవూ ఆత్మ లింగాన్ని చూస్తావా?" అని అడిగి పెద్ద కృష్ణవర్ణ శివలింగాన్ని చూపించారట! వైకుంఠ ఏకాదశినాడు స్వామిని ఆసీనులను చేసి ఉత్తరద్వార దర్శనం భక్తులు చేయగా, స్వామి సీతమ్మ గారికి శ్రీమన్నారాయణునిగా దర్శనమిచ్చినారు. జ్ఞాన సరస్వతిగా, కనక మహాలక్ష్మిగా, కనకదుర్గగా, శంకరాచార్యునిగా, శ్రీ నృసింహ సరస్వతిగా, అక్కలకోట మహారాజుగా, సాయిగా సీతమ్మగారికి స్వామి అనేకసార్లు దర్శనములను ఇచ్చారు.

స్వామి ఫణికి కూడా రామునిగా, గణపతిగా, మారుతిగా, వేంకటేశ్వరునిగా కృష్ణునిగా దర్శనములనిచ్చినారు. ఒకరోజు ఫణికి స్వామి శివునిగా దర్శనమిచ్చినపుడు ఆ రోజు ప్రతి వస్తువూ, ప్రతి ప్రాణి శివునిగానే కనిపించసాగినది. ఫణి, స్వామిని చేరినపుడు, స్వామి శివ తాండవము భజన చేస్తున్నారు! స్వామిని శరణము పొందగా ఆ భావము శాంతించినది. స్వామి తాను రచించిన "కొండెక్కిరానా" భజన చేస్తూ ఫణిని వేంకటేశ్వరుని విగ్రహము వైపు చూడమన్నారు. ఫణికి వేంకటేశ్వరస్వామి బాష్పాలు తుడుచుకుంటూ కనిపించినారట. తిరుపతిలో

మూలవిరాట్టు విగ్రహం వద్ద "నిన్నెంత తలచినా సంతృప్తి రాదయ్యె తీరమన్నది లేని ప్రణయసాగరమీవు" అను చరణం పాడుతున్నప్పుడు (ఇది స్వామి రచించిన కొండెక్కి రానా పాటలోనిది) విగ్రహం ఒక్కసారి దేదీప్యమానంగా ప్రకాశించినదట! ఫణికి, సీతమ్మగారికి దివ్యదృష్టినిచ్చామన్నారు స్వామి. వారు దర్శించినవి, భక్తులకు చెప్పమని ఎప్పటి కప్పుడు వారిని భక్తులకు చెప్పమనేవారు స్వామి. " ఈ ఇరువురికీ నేనెప్పుడు ఏ రూపంలో ఉన్నా కనిపిస్తాను. అది, వారు మీకు చెప్పి మిమ్ములను ఆనందింప చేసే సేవను వారికి యిస్తున్నాను" అన్నారు స్వామి.



## బొంబాయిలో దివ్య దర్శనము.

శ్రీ సూర్యనారాయణ, శ్రీమతి భాగ్య (ఫణి సోదరి)


ఫణి బొంబాయికి పనిమీద వెళ్ళటం తటస్థించింది. అచట ఒకరోజు స్వామిని గురించి ఆలోచిస్తున్నాడు. ఒక దివ్యదర్శనమైనది. స్వామి భుజానికి సంచి తగిలించుకొని కనపడినారు. పైన దేవతలు, ఋషులు కనపడినారు. ఈ విచిత్ర దర్శనానికి ఫణి ఆశ్చర్య చకితుడైనాడు. ఇంతలో దేవతలు, ఋషులు మాటలు ఇలా వినపడినవి. " వీడెవడురా నాయనా! సృష్టి నియమాలన్నింటినీ శాసిస్తున్నాడు! అవును ఇతడే దత్తుడు. జ్ఞాన – భక్తి ప్రచారానికి మహా మాయను దట్టంగా కప్పుకుని భూలోకానికి వచ్చాడు!" అని ఇదే దివ్య రహస్యం!!

అదే రోజు అదే సమయంలో విజయవాడలో స్వామి! చిరునవ్వు చిందిస్తూ ఒక కొత్తపాటను ఆశువుగా పాడినారు. "బ్రహ్మర్షిర్వా దేవోవాస్యాత్ దత్తాత్రేయం కోజానాతి" అని అంటె " బ్రహ్మర్షులైనా, దేవతలైనా కానీ, దత్తాత్రేయుని ఎవరు తెలుసుకొన గలరు?" అని అర్థము.

ఆహా! శ్రీ దత్త భగవానులే నరరూపంలో ఈ లోకంలో సంచరిస్తున్నారని ధ్రువ పరచటమే గదా! ఆ నరావతారుని దర్శించి, సేవించి వారి వచనామృతమును గ్రోలి ధన్యులమైన మన అదృష్టమే అదృష్టము గదా!

శ్రీ దత్తా శరణమయ్యా ! అని ప్రణమిల్లుదుము!!

# శివ దత్త దర్శనము.



బరోడా మహరాజ్

స్వామి, మేము శ్రీశైలంలో శివసదనంలో బసచేసి వున్న రోజులవి. సత్రంలోని శివాలయంలో ఎదురుగా ఒక మహా పురుషుడు (బరోడా మహారాజ్) కనిపించారు. ఆయన రోజూ ఒక గ్లాసు పాలను మాత్రం తీసుకుంటూ, శివపురాణము పారాయణ చేస్తున్నారు. స్వామి " ఈ యోగి పుంగవుడు మార్కండేయుని అంశ సంభవుడు" అన్నారు.

ఒకనాడు శివసదనంలో మా వసతి గృహములో మేము ముగ్గురము ఉన్న సమయంలో ఇలా అన్నారు " శ్రీ దత్త భగవానులు ఈ రోజు మధ్య శివముఖము యిరుపక్కల బ్రహ్మ, విష్ణు ముఖములతో తేజోవంతముగా వున్నారు శివదత్తులుగా. బరోడా మహారాజ్ స్వామి పాదాల వద్ద సేవ చేయుచూ స్వామి ముఖమును చూచుచున్నారు."

ఆ నాటి రాత్రి మేము ముగ్గురము కరివెన అన్నదాన సత్రములోని ఆ యోగి పుంగవుడు నివసించుచున్న గదికి వెళ్ళినాము. ఆ మహరాజ్ ఇలా పదేపదే గానంచేసినారు. చేతులతో చప్పట్లు కొడుతూ ఆనందోద్రేకంలో స్వామి వైపు చూస్తూ

" ఆజ్ మీ దత్తకో దేఖ్‌లీ" అని అనగా " ఈ రోజు నేను దత్తుని చూశాను" అని అర్థము. దీని వల్ల ఆ ఉదయం స్వామి చెప్పిన దివ్య దర్శన వివరమునకు శ్రీ మహారాజ్ పాడిన కీర్తనకు ఎంత పొంతన వున్నదో కదా! స్వామి చెప్పిన మాటనే మహారాజ్ గానం చేశారు. తరువాత మేము అర్థం చేసుకున్నదేమంటే శివదత్తునిగా దర్శనము ఇచ్చినది స్వామియేనని.

## పాదముద్రలు.

2001 సం॥ డిసెంబరు 30 నాడు దత్త జయంతి. అద్భుతంగా అనేక భక్త బృందంతో జరిగినది. ఆ నాడు స్వామికి పీఠ మందిరం లోనే శయ్యను ఏర్పాటుచేసినాము. ఫణితో స్వామి యిలా అన్నారు. " ఈ రోజు రాత్రి దత్తుడు తప్పక మహిమను చేస్తాడు". కానీ ఆ నాటి రాత్రి స్వామి శ్రీ కోనేరు సత్యనారాయణ గారింట్లో సత్సంగం చేయటానికి వెళ్ళారు. అందుకని పై మందిరం తాళం వేసివచ్చారు. అందువలన కింది అంతస్థులోనే స్వామికి శయ్యను ఏర్పాటు చేయవలసి వచ్చింది. స్వామి వచ్చేటప్పటికి చాలా పొద్దు పోయింది. స్వామి వస్తూనే "పైన పడుకోమన్నారు కదా పోతాను" అన్నారు. "స్వామి! పై మందిరం తాళం వేశాముకదా! అందుకే ఇక్కడ శయనం ఏర్పాటుచేశాము" అని అన్నాము. స్వామి చిరునవ్వు చిందిస్తూ సరే అని రెండవ అంతస్థులోనే శయనించారు. ప్రొద్దుననే లేచి స్వామి స్నానాదులు ముగించుకొని కాలేజీకి వెళ్ళిపోయారు. ఆ తర్వాత మేము మూడవ అంతస్థులో వున్న దత్త మందిరం తాళంతీసి చూస్తే శయ్యమీద శ్రీ దత్త పాదాల ముద్రలు వేలి ముద్రలు స్పష్టంగా కనిపించినవి. ఆహా! ఎంతటి మహిమ "తాళము వేసినా నేను ప్రవేశించలేనా" అన్నట్లు రాత్రి స్వామి చిరునవ్వుకు అర్థమని గ్రహించినాము. ఆహా! ఎంతటి అద్భుతం.

## గ్రీష్మమును శమింపచేయుట.


స్వామి సాక్షాత్తు శ్రీ దత్త భగవానులే. పంచభూతాలు ఆయన వశవర్తులే. విజయవాడలో ఒక సంవత్సరము గ్రీష్మ ప్రతాపము తగ్గించమని వేడుకున్నారు. "కాల కర్మములలో జోక్యము చేసుకొనరాదు అయినా నిరూపణము కొరకు తగ్గింతును" అని స్వామి తాను రచించిన " శ్రీ దత్త దేవం యోగాధినాథం - కోటి సుగుణ సుందరాయ" అను భజన చేయించారు. భజన తరువాత ఇట్లు వచించారు. "ఈ సూర్యుని తేజస్సు దత్తుని తేజస్సు చేత ప్రకాశించుచున్నది" అంటూ నిమీలితనేత్రులైనారు స్వామి. ఇంతలో సాయంకాలము 4 గం॥ అయినది.

ప్రచండభానుడు కొంచెం కొంచెం శాంతిస్తున్నాడా అన్నట్లుంది. ఆకాశము మేఘావృతమైనది. ఉరుములు మెరుపులతో కుంభవృష్టి కురిసింది. మరునాటి నుండి ప్రకృతి శాంతించింది. ఆహా! ఎంతటి మహిమ. మరుసటి సంవత్సరము కూడా భక్తుల ప్రార్థనమేరకు స్వామి స్పందించారు. అలానే చేశారు. ఆ తరువాత సంవత్సరము "కాల చక్రమున, కర్మ చక్రమున జోక్యము చేసుకొనరాదని" స్వామి భక్తులకు వివరిస్తూ, "ఇట్టి కోరికలు కోరకండి" అని హితవు చెప్పారు. ఆహా! పంచభూతములు స్వామి వశవర్తులనుటకు ఇది నిదర్శనము కాదా!

## చిత్రంలో కదలికలు.

స్వామి లీలలు అనంతాలు. అజయ్ కూడా స్వామి మహిమను చూడాలని మనస్సులో కోరుకున్నాడు. స్వామి అజయ్‌ను చూసి నవ్వారు, అంగీకరించినట్లుగా. ఒకనాడు అజయ్ స్వయంగా పాయసం తయారు చేసి శ్రీ దత్త ప్రభువుకు నివేదన చేస్తున్నారు. దత్తుని చిత్ర పటంలో స్వామి విచిత్రముగా కన్నులను త్రిప్పుతూ పెదవులను పాయసం చప్పరిస్తున్నట్లు కదలించసాగారు. దానితో నిశ్చేష్టుడైన అజయ్‌గారికి శరీరమంతా ముచ్చెమటలు పోసినవి. ఆ రోజు రాత్రి స్వామి వారు యింటికి వేంచేసినప్పుడు, ఈ విచిత్రాన్ని అజయ్ గారు వివరించగా " అవును పొంగలి బాగా చేస్తావుగదా వెనుక జన్మలో తిరుపతిలో నీవు స్వామికి అర్చకుడివిగా బాగా చేసేవాడివి" అని చిరునవ్వు చిందించారు. అజయ్ దంపతులు విస్తుపోయారు. అజయ్ భార్య లక్ష్మి స్వామికి అన్నం వడ్డిస్తూ "స్వామీ! వారికి దివ్య దర్శనం కల్గించారు గదా, నాకూ చిన్నదేదైనా చూపరా?" అని అడిగింది. స్వామి తల ఊపి అంగీకారంగా నవ్వినారు. మరురోజు ఆమె వంట చేస్తుండగా ఒక చిన్న జ్యోతి లక్ష్మికి కనిపించింది. కూరచేస్తూ అలానే నిలబడి దాని వంకే చూస్తున్నది లక్ష్మి. ఆ జ్యోతి 5 నిముషాలు ప్రయాణించి దత్త చిత్రంలోనికి పోయి అదృశ్యమైనది. ఆహా! ఎంతటి అద్భుత లీల!

## దత్త చిత్రంలో స్వామి కనిపించుట.


సుగుణ

ఫైర్ ఆఫీసరు ప్రభాకరంగారి తల్లి సుగుణ గారు. వసుమతి గారితో కలసి దత్త పీఠం వద్ద చిత్రపటం చూడటానికి కృష్ణలంకలోని మా ఇంటికి వచ్చినారు. ఆ చిత్రపటం చూసినప్పుడు సుగుణ గారికి దత్త ప్రభువు చిత్రపటంలో స్వామి నవ్వుతూ కనిపించటంతో ఆమె ఆశ్చర్యచకితులయ్యారు. "వసుమతీ! చూడు చూడు దత్త చిత్రపటంలో స్వామి ఎలా కనిపిస్తున్నారో" అంటూ ఉద్వేగ భరితురాలైనారు. అప్పుడు వసుమతి ఇలా అనుకున్నదట, మా ఇంటికి బయలుదేరునప్పుడు. స్వామి అసలు సాక్షాత్కరిస్తారా? అని మనస్సులో వసుమతి గారు అనుకొన్నదట!

## దత్త దిగంబర దర్శనమిచ్చుట..


మంగ


లక్ష్మి (జడ్జి భార్య)



అమ్మాజీ

తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం నివాసి శ్రీమతి మంగగారు స్వామికి ఎంతో ఉత్తమ భక్తురాలు. ఆమెకు తరచు స్వామి కనపడేవారు. ఒకసారి ఆమె బొంబాయి పోతూ "స్వామీ! నీడలాగ నా వెంట ఉండవా!" అని కోరగా స్వామి "అలానే" అన్నారు. ఆమె బొంబాయి పోతుండగా స్వామి నీడలాగానే వెంబడించినారు. తిరిగివస్తూ రైలులో "ముఖం కనపడకుండా నీడలాగ వద్దు స్పష్టంగా కనిపించమ" ని స్వామిని కోరగా ఎదురుగా కూర్చున్నారు. విజయవాడ రాగానే దిగిపోయినారు. ఒకసారి స్వామితో ఫోనులో " నీ నిజ స్వరూపంతో ఎక్కువ సేపు నిల్చోండి స్వామి!" అనగానే స్వామి దత్త దిగంబర అవధూత పిశాచరూపంతో నిలువగా భయపడి పారిపోయిందట.

మంగగారి ఇంటి పక్కనే నివసించే జడ్జిగారి భార్య స్వామి రచించిన దత్తవేద గ్రంథం చదవగానే, స్వామిని దర్శించకముందే స్వామి ఎదురుగా నిలబడి దర్శనమిచ్చినారు. ఆమె స్వామిని తర్వాత దర్శించినది. అలానే ఆమెకు ఒకసారి శివలింగంలో అభిషేక సమయంలో స్వామి స్పష్టంగా కనపడినారట.

రామచంద్రాపురం నుండి స్వామిని చూడాలని వచ్చిన అమ్మాజీ అను భక్తురాలికి, ఊర్ధ్వత్రిపుండ్రాలతో, శంఖ చక్రాలతో శ్రీ-మహా విష్ణువుగా దర్శనమిచ్చినారట.

## విద్యుత్ శక్తిని, రంగు కిరణాలను చూపించుట.



శేషాద్రి, లలిత దివ్య

భక్తులు శ్రీ ఆత్మూరు సుబ్బారావుగారు వారి సతీమణి శేషమ్మగారు ఎప్పటినుండో స్వామిని వారింటికి ఆహ్వానిస్తున్నారు. సరే! అన్నారు స్వామి. కాని ఆ సమయం రాలేదు. శ్రీ సుబ్బారావు గారి పుత్రిక చి॥ సౌ॥ గాయత్రి అల్లుడు చంద్రశేఖర్ గారు కువైట్‌లో ఉన్నారు. ఈ దంపతులు స్వామి వ్రాసిన దత్త వేదమును చదివి, తన్మయత్వం చెంది తృతీయ ముద్రణము కావించి ప్రచార సేవ చేసిన ధన్యులు.

శ్రీ సుబ్బారావుగారు ధర్మపత్నితో సహా వచ్చి స్వామిని ఒకరోజు ఇందిరా టవర్స్‌లో ఉన్న పుత్రుడు శేషాద్రి, కోడలు లలిత, ఇద్దరు అమ్మాయిలు నివసిస్తున్న ఇంటికి తీసుకపోయి స్వామి చేత భజన, సత్సంగం చేయించినారు. అందరూ స్వామికి నమస్కరించారు. కోడలు లలితగారు స్వామి పాదాలు స్పృశించి నమస్కరించగనే కరెంటు షాక్‌ను పొందినది! ఒక అమ్మాయి నమస్కరించగా స్వామి హస్తము నెత్తి ఆశీర్వదించినారు. ఆ అమ్మాయికి స్వామి హస్తం నుండి రంగు రంగుల కిరణాలు ప్రసరిస్తూ రావటం కనిపించింది. రెండవ అమ్మాయి నమస్కరించగా, స్వామి శరీరంలో విద్యుత్ వలయాలు గిరగిర తిరుగుతూ స్వామి శరీరం అంతా విద్యుత్ శక్తితో నిండి తెల్లగా ప్రకాశించటం కనిపించింది! ఆ కుటుంబం ఆనంద పరవశులైనారు.

విశ్వాసం పెంపొందించటానికి స్వామి ఇట్టి అనుభూతులు ప్రసాదిస్తారని మనం గ్రహించాలి. మర్నాడు వారు తమ అనుభూతులను నాకు ఫోనులో చెప్పారు.

నేను చాలా సంతోషించాను. మీరు అందరూ ధన్యులన్నాను. ఆ సాయంత్రం స్వామి మా యింటికి వచ్చారు. వారికి ఈ అనుభూతుల విషయం చెప్పాను.

స్వామి చిరునవ్వు చిందిస్తూ "వారిని బ్రహ్మరంధ్రం వరకు చేర్చాను" అన్నారు స్వామి. ఆ తరువాత నేను వారికి ఫోను చేసి ఈ విషయం చెప్పాను. వారు మహదానంద భరితులైనారు. ఆ అమ్మాయిలలో ఒకరికి స్వామి శరీరం నుండి పింక్ రంగు కాంతి అనంతంగా రావటం చూచిందట. అది నా ప్రేమ స్వరూపం అన్నారు స్వామి.


## దత్త సాక్షాత్కారమును కలిగించుట.

శ్రీ కోనేరు సత్యనారాయణ గారు దత్తాత్రేయ రూపమును చూడలేదు. ఒకసారి స్వామి దత్త హోమమును చేయునప్పుడు సత్యనారాయణ గారికి ఆ హోమాగ్నిలో శ్రీ దత్తుడు సాక్షాత్కరించి దర్శనమిచ్చెను. ఆ తరువాత మా ఇంటిలో ఉన్న దత్త పీఠములో ఉన్న శ్రీ దత్తుని చిత్రమును చూచి సత్యనారాయణ గారు ఆశ్చర్యపడినారు. సాక్షాత్తు అదే రూపములో శ్రీ దత్తుడు తనకు హోమాగ్నిలో దర్శనమిచ్చినాడు! సత్యనారాయణగారు ధన్యజీవి కదా! దత్త దర్శనము చేత తరించినారు. స్వామి సత్యనారాయణగారి గురించి భక్తులకు ఇలా చెప్పినారు. " ఆ జీవుడు సత్య - ధర్మములను తప్పని సజ్జనుడు. అందుకే ఆ జీవిపై నాకు ప్రేమ. ఈ జీవుడు వెనుక జన్మలో కేరళ రాజు. నేను శంకరాచార్యుల అవతారంలో ఉన్నప్పుడు నాకు భిక్ష చేసిన పుణ్యశీలి" అన్నారు.

ఒకరోజు శంకరజయంతి అని తెలియకుండానే సత్యనారాయణగారు శంకారాచార్యులను గురించి యింటిలో మిత్రులతో ప్రశంసించినారు చాలాసేపు. స్వామి మరునాడు కాషాయ దుస్తులతో పెద్ద శంకరాచార్య చిత్రమును తీసుకువెళ్ళి బహూకరించినారు ఆయనకు! ఆయన చాల ఆశ్చర్యము చెందినారు.

## శ్రీ కృష్ణ రూపములను తనలో చూపుట.

శ్రీమతి వసుమతి గారు స్వామి చూపే దివ్య దర్శనములు కంటి భ్రమలను కల్పిస్తున్నారా? (కనుకట్టు విద్య) అను కొన్నదట. స్వామి ఆమెకు దివ్య దర్శనమునీయ సంకల్పించినారు. కృష్ణాష్టమినాడు, స్వామిని ఆసీనులను చేసి భక్తులు అర్చించినారు. ఆ సమయములో స్వామి శరీరావయవములందు మురళిని వాయిస్తున్న శ్రీ కృష్ణ రూపములు వసుమతిగారి కన్నులకు స్పష్టంగా గోచరించినవి. దానితో వసుమతిగారు ఎంతో ఉద్రేకమునకు లోనైనారు. ఆమెపై అభయ హస్తమునుంచి స్వామి శాంతింప చేసినారు. అట్లుతాను చేయనిచో ఆమెకు ప్రాణాపాయము కల్గియుండెడిది అని స్వామి మాతో చెప్పినారు.



## బాలకృష్ణుడే

సుజాతగారి తల్లి (పద్మావతి)

స్వామి సుజాత వాళ్ళింటికి గత 5 రోజులనుండి మధ్యాహ్నం 3 గం॥కు వేంచేస్తున్నారు. ప్రతిరోజు 3 గం॥ నుండి సాయంత్రం 6 గం॥ వరకు భజన నిర్వహిస్తున్నారు. స్వామి దర్శనానికి సుజాత వాళ్ళ అమ్మగారు రావటం విశేషం. మొదటి రోజున ఆమెకు స్వామి సాక్షాత్తు బాలకృష్ణుడుగా దర్శనమిచ్చి పులకింపచేశారు. ఆ పారవశ్యంలో ఆమె అన్నం కలిపి తన చేతితో తానే స్వామికి గోరుముద్దలు తినిపించి ధన్యురాలైనది. స్వామి ఆమెను సంతోషింపచేయుటానికే 5 రోజులుగా (పంచాహ్నికంగా) వాళ్ళింటికి వచ్చి సత్సంగం చేస్తున్నారు. నిన్న స్వామి ఒక రహస్యాన్ని వెల్లడించి భక్తులను ఆశ్చర్య చకితులను చేశారు. ఆమె ఎవరో కాదు సాక్షాత్తు ద్వాపరయుగంలో శ్రీ కృష్ణుని పెదతల్లి రోహిణిదేవియేనట. అందుకే ఆమెకు శ్రీ కృష్ణుడంటే అంత ఇష్టం - అని వివరించారు స్వామి. చివరిరోజున కిరీటం, పింఛం, మురళితో కనిపించారు స్వామి ఆమెకు. స్వామి లలాటంపై మెరిసే మూడు తేజోబిందువులతో ఊర్ధ్వ త్రిపుండ్రాలు ప్రకాశించినవట. ఆమె ఎంతో ఉద్వేగమునకు గురియై అశ్రువులు రాల్చినది. ఆహా! ఆమె ఎంత ధన్యురాలు.

## భద్రకాళి దర్శనము.

మంగళగిరిలో సీతమ్మగారింట్లో, స్వామి ఒకరాత్రి నిద్రించుచుండగా, బయట పడుకున్న సీతమ్మగారికి 5 ని.॥లు స్వామి గురకతో కూడిన నిద్ర మరల 5 ని.॥ సంస్కృతంలో పెద్దగా గద్దించి మాట్లాడుట మారిమారి వినిపించినవి. సీతమ్మగారు లేచి కిటికీ సందుద్వారా గదిలోకి చూడగా భద్రకాళి, సర్వాలంకారములతో నీలిరంగు చీరెతో, స్వామితో సంభాషిస్తూ దర్శనమిచ్చినది! తలుపు తట్టి లోపలకు పోదామని అనిపించినా, మరలవద్దని, పోయి పడుకున్నారు సీతమ్మగారు. సీతమ్మగారి నుండి యీ విషయమును విని, భద్రకాళితో చేసిన సంభాషణ వివరములను గురించి స్వామిని అడిగితిమి. స్వామి యిట్లు వచించినారు. " ఆమె జీవులను మహామారియను రోగము (ఎయిడ్స్) తో నాశనము చేయుదునని అంటున్నది. ఇంకా సమయము రాలేదని,అట్లు చేయవద్దని నేను గద్దించి చెప్పితిని". ఆహా! దత్తుడు తప్ప భద్రకాళినే గద్దించగల ధైర్యము ఎవరికి ఉన్నది!.



## బదరిలో స్వామి దర్శనమిచ్చుట.

సుస్మిత (శ్యాంరసియా)

శ్రీమతి పద్మ, వెంకటేశ్వరరావు గార్లు బదరీ యాత్రకు బయలుదేరుచు, స్వామికి నమస్కరించి, తమ వెంట ఉండి రక్షించమన్నారు. వారి చిన్న కూతురును స్వామి "శ్యాం రసియా" అని పిలిచేవారు. ఆ అమ్మాయికి ఆ మీరా భజన స్వామి పాడితే చాలయిష్టము. బదరిలో కొండ మార్గమున బస్సు పోవుచుండగా ఆ అమ్మాయికి స్వామి బస్సుపక్కన నడుచుకుంటూ దర్శనమిచ్చి, ఆ పాపను చూచి నవ్వినారు. ఆ పాప కూడ తిరిగి నవ్వింది. యాత్రనుండి రాగానే, స్వామి వారితో ముచ్చటిస్తూ "శ్యాం రసియా! నీకు ఒకచోట కనపడినాను. నిన్ను చూచి నవ్వితిని. నన్ను చూచి నీవు నవ్వినావు" అన్నారు. శ్యాం రసియా కొంతసేపు ఆలోచించి "అవును బదరిలో కొండ మార్గమున బస్సు పక్కన నడుస్తూ స్వామి నన్ను చూచి నవ్వినారు" అన్నది. స్వామి వారి వెంట నడచి వారిని రక్షించినారన్నమాట.

# విష్ణులహరి.

## విచిత్ర వ్యాధిని పోగొట్టుట.

బందరులో రిటైర్డు ఇన్‌కంటాక్సు ఆఫీసరు సుబ్బారావుగారి కుమారుడు ఇంజనీరింగ్ విద్యార్థికి తన స్వేద దుర్గంధము తనకు తెలిసి వికారపెట్టుట అగు వ్యాధి వచ్చెను. ఎందరో వైద్యులు చికిత్స చేసినా నిష్ఫలములయ్యెను. గ్రహజపములు దైవారాధనములను ఎన్నో చేసిరి. ఎందరో మహాత్ములను ఆశ్రయించినా లాభము లేదయ్యెను. చివరకు ఆ తండ్రి స్వామిని చేరెను. ఇంతమందికి చేతకానిది నా వల్లకాదని స్వామి నిరాకరించెను. ఆ తండ్రి "నీవు దత్తుడవని భక్తులు చెప్పుచున్నారు కావున నీవే నా దిక్కు" అని దీనాతిదీనముగా ప్రార్థించెను. స్వామి హృదయము ద్రవించి విభూతినిచ్చెను. ఆ విభూతిని తండ్రి పుత్రునినుదుట పెట్టగనే ఆ రోగము మాయమయ్యెను. ఆ తండ్రి బంధుమిత్రులతో వచ్చి స్వామిని ఆరాధించినాడు.



## మృత్యుముఖమునుండి కాపాడుట.

రమణ, సుజాత

మేము దంపతులము మా తృతీయ పుత్రుడు చి.॥ రమణ కోడలు సుజాత పిల్లలు కలసి హైదరాబాదులో బాగ్‌లింగంపల్లిలో మా స్వగృహంలో ఉన్నరోజులవి. ఒకసారి స్వామి హైదరాబాదు వచ్చి మాగృహాన్ని పావనం చేసారు. ఆ సమయంలో దైవ స్వరూపురాలు శ్రీమతి సత్యకుమారిగారు వచ్చారు. స్వామికి నమస్కరించి కూర్చున్నారు. స్వామి నుండి విపరీతంగా శక్తి కిరణాలు బయటకు ప్రసరిస్తు ఉండటం ఆమె ప్రత్యక్షంగా చూశారు. ఆమెపై శ్రీ దత్తప్రభువు ఆవేశించినారు. ఆమె బాగా కంపించసాగినది. అప్పుడు స్వామి ఆమెతో ఇలా వచించారు.

స్వామి. – మీరెవరు స్వామి?
ఆమె. – "నేను దత్తాత్రేయుడను"
స్వామి – మరి, నేను ఎవరు?

ఆమెలోని ( దత్త దేవుడు) - నీవే నేను, నీవే నేను అని మూడు పర్యాయములు వచించారు. తర్వాత ఆమె మామూలు మనిషి అయినారు. అప్పుడు స్వామి ఆమెతో ఇట్లా వచించినారు. "ఈ రోజు నీకు సమయము ఆసన్నమైనది. సిద్ధముగా నుండుము" అన్నారు. ఈ సంభాషణ వింటున్న మేము తికమక పడ్డాము. మాకేమి అర్థంకాలేదు. సరే! ఏం జరుగుతుందో చూద్దామని మిన్నకున్నాము. ఆమె ఇంటికి వెళ్ళింది. రాత్రి 12 గం॥ అయింది. ఆమె ఫోను చేసింది నీరసంగా మాట్లాడింది "స్వామి! నా పని అయిపోయింది" అని. ఆమె మృత్యుముఖంలో పడినది. స్వామి ఆమెకు ఫోనులో అభయమిచ్చినారు. ఉదయానికే ఆమె పరిపూర్ణ స్వస్థతను పొందింది!. ధన్యురాలు!!


ప్రభాకర్

## బాలునకు ప్రాణభిక్ష


ప్రభాకర్ పుత్రుడు (శ్రీకర్)

విజయవాడ సత్యనారాయణపురంలో శ్రీ భీమశంకరంగారి ఇంట్లో ప్రభాకర్ అద్దెకు ఉంటున్నారు. అతడు స్వామి భక్తుడు. ఒకనాడు ప్రభాకర్ గారి బాబుకు చాలా పెద్ద జబ్బు చేసింది. "స్వామీ, రక్షించండి. అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" అని ప్రభాకర్ వచ్చి విలపించినారు. ఆ బాలుడు మాత్రం సామాన్యుడా! స్వామిని చూచిన చాలు వచ్చి పాదాలకు నమస్కరించేవాడు. స్వామి ప్రభాకర్‌కు అభయమిచ్చారు. "నేను యమ భటులను రానీయను" అంటూ ఆ రోజు వారింటిలోనే శయనించారు. రాత్రి తెల్లవార్లు ఆ దంపతులు మేలుకునే ఉన్నారు. అర్ధరాత్రి అయింది. అర్ధరాత్రి సమయమున యమభటులు రానేవచ్చారు. స్వామి వారిని పొమ్మని చెప్పుచున్నట్లు చేతులతో సైగలు చేశారు. అంతే! బాలుడు స్వస్థత పొంది ఆరోగ్యవంతుడైనాడు. ఇది మహిమ కాక మరేమిటి?

## వెన్నుపోటును క్షణమున తగ్గించుట.

ఒకసారి మా తృతీయ పుత్రుడు చి॥ రమణ హఠాత్తుగా రాత్రి వెన్నునొప్పితో విలవిలలాడుచూ లేచాడు. వాని భార్య సుజాత డాక్టర్లకు ఫోన్లు చేయ ప్రయత్నిస్తోంది.


రమణ స్వామిని "మామయ్యగారు" అని పిలిచేవాడు. స్వామి రమణను "తాత్య" అని పిలిచేవారు. ఆ నొప్పి భరించలేక రమణ స్వామిని దీనంగా స్మరించాడు. క్షణములో వెన్నుపోటు అదృశ్యమైనది. అంతా స్వామి అనుగ్రహం! స్వామి చాలా కాలము వెన్నుపోటుతో బాధపడ్డారు.

## పునర్జన్మను ప్రసాదించుట.

అజయ్ స్వామి వారి పరమ భక్తుడు. వీరి భార్యయే నాగలక్ష్మి. ఆమె కూడా స్వామి భక్తురాలే. ఈ దంపతులు విజయవాడలోని సత్యనారాయణపురంలో సొంత ఇంట్లో ఉంటున్నారు. వారింట్లో స్వామి - "బ్రహ్మదత్తుల" చిత్రాన్ని ప్రతిష్ఠించి సేవించుకొనమని ఆనతి ఇచ్చారు. వారింట్లోనే "బ్రహ్మ జ్ఞానము" అను గ్రంధమును రచించినారు కూడా. ఇలా ఉండగా ఒకరోజు స్వామి అజయ్‌తో "లక్ష్మికి (అజయ్ భార్యకు) నేను చెప్పానని చెప్పుము. దైవధ్యానంలో ఉండమనుము. రధం వస్తున్నది, ఎక్కటానికి సిద్ధంకమ్మని చెప్పు" అని వెళ్ళిపొయినారు. అజయ్‌గారు నిశ్చేష్టులయ్యారు. ఆ రోజు రాత్రి లక్ష్మి యమభటుడు ఇనుప గునపముతో కనిపించినాడు. తెల్లవారుఝామున లక్ష్మి పెద్ద కేకతో కోమాలోకి పోయినది. స్కానింగు తీయగా మెదడు నరాలు చిట్లి చాలపెద్ద రక్తపు గడ్డకనిపించినది. "ఇది సెకండరీ స్టేజి, లాభంలేదు" అన్నారు డాక్టర్లు. వైద్యం చేయటానికి కూడా నిరాకరించినారు. అజయ్ వచ్చి స్వామిని శరణముజొచ్చినాడు. స్వామి విభూతి కుంకుమల నిచ్చినారు. వాటిని పొట్లం కట్టుకొని జేబులో ఉంచుకున్న అజయ్ ఆసుపత్రికి పోయివాటి సంగతి మరచినాడు ఆ దారుణ పరిస్థితి దు:ఖంలో. లక్ష్మి బయలుదేరిన అజయ్ చేతిని పట్టుకుంది. ఎంత విడిపించు కున్న వదలదు! చివరకు విభూతి కుంకుమలు గుర్తుకురాగా వాటిని లక్ష్మి నుదుటిపై పెట్టగా, లక్ష్మి అజయ్‌చేతిని వదిలినది! లక్ష్మి ద్వారా స్వామియే అజయ్ చేతిని పట్టుకున్నానని స్వామి తరువాత చెప్పినారు. స్వామి లక్ష్మికి మరల స్కానింగ్ తీయమని పదేపదే చెప్పగా, మరల స్కానింగ్ తీసినారు. రక్తపుగడ్డ అదృశ్యమైయున్నది! లక్ష్మి మాటలాడ ఆరంభించినది. లక్ష్మని యింటికి తెచ్చినారు. ఆ రోజు స్వామి శయనించిన గదినుండి అర్ధరాత్రి రెండు విభిన్న కంఠముల

వాగ్వాదము, అజయ్ తండ్రిగారికి వినవచ్చెను. మరునాడు స్వామి తాను కాలభైరవునితో లక్ష్మి విషయంలో వాదించినానని చెప్పినారు.

మరునాడు గురువారము స్వామి "ఈ రోజు నీవు ఆఫీసుకు పోవచ్చును" అని అజయ్‌తో అన్నారు. ఆరోజే లక్ష్మి చకచక నడచినది. స్వామి తనవ్యాధిని అనుభవిస్తారని లక్ష్మి తనవ్యాధి గురించి స్వామికి చెప్పవద్దని అజయ్‌తో చెప్పుచుండెను. కానీ, స్వామి లక్ష్మి వ్యాధిని ఆకర్షించుకొని ప్రతి ఆదివారము కోమాలోకి పోయేవారు. స్వామి నిద్రిస్తున్నారని అందరూ తలచిరి. "నా భక్తుల కర్మ ఫలములను నేను అనుభవిస్తానని ధర్మదేవునితో ఒప్పందం చేసుకున్నాను. కావున కర్మ ఫలం అనుభవించనిదే పోదు. నేను కర్మ ఫలాన్ని రద్దుచేయగల శక్తి కలిగియున్నను, దానిని దుర్వినియోగ పరచను. భక్త కర్మఫల భోగార్థమే పరమాత్మ నరావతారమునెత్తుటకు ఒక కారణము. నా శక్తిని ఉపయోగించి కర్మఫలాన్ని అనుభవిస్తూ బాధపడకుండ కూడ ఉండగలను కానీ అది ధర్మదేవుడిని మోసగించుట అగును కావున కర్మఫల భోగంలో మీలాగానే నేనూ బాధపడతాను. స్వామి బాధపడుట ఏ భక్తుడూ సహించలేడు. కావుననే నిజమైన భక్తుడు స్వామిని ఏమీకోరడు. నిష్కామంగా అర్చిస్తాడు" అని ఎప్పుడూ బోధిస్తారు స్వామి. లక్ష్మికి అంతా ఆరోగ్యం వచ్చినా చేతికి మాత్రం యింక కొంత వ్యాధి ఉండెను. ఆమె పొరపాటున "ఈ చేయి కూడా బాగు చేయండి స్వామీ!" అని అడిగింది అంతే! ఆ కర్మశేషాన్ని స్వామి అనుభవించలేదు. ఆ చేయి పూర్తిగా బాగా కాలేదు. "కర్మ శేషం కొంచెం అయినా జీవుడు అనుభవించాలి. ఆ న్యాయమే లక్ష్మిని అలా అడిగేలాగా చేసింది" అన్నారు, స్వామి. ఆహా! ఎంతటి నగ్న సత్యం స్వామి వద్దకు అతిథిగా పోవాలేకాని బిచ్చగాడిగా కాదు అని స్వామి చెపుతారుగదా.



## గుండెపోటు నుండి రక్షించుట.

కామేశ్వరమ్మ

కామేశ్వరమ్మగారు అజయ్‌గారి అత్తగారు. ఆమె హృద్రోగముతో బాధపడుచుండెను. ఎప్పటికప్పుడే మృత్యువాతపడినట్లే అగుచుండెను. తల్లి అంటే మమకారం కల అజయ్‌గారి భార్య నాగలక్ష్మి తన తల్లిని రక్షించమని కన్నీటితో

స్వామిని అర్థించింది. ఆదే ఆమె మొదటిసారి స్వామిని దర్శించటము. స్వామి "పుట్టినవారు గిట్టక తప్పదు. నీవు నీ తల్లి వ్యామోహమును తెంచుకొనుము" అని హితవు చెప్పినారు. కానీ, లక్ష్మి తన పట్టును విడువలేదు. "ఇది నీ మొదటి కోరిక కావున చెల్లిస్తాను" అన్నారు స్వామి. అంతే! ఆమె తల్లి గుండె జబ్బు అదృశ్యమై వెంటనే స్వస్థురాలైనది. గుండెకు వెంటనే శస్త్ర చికిత్స చేయవలయునన్న వైద్యులు మరల పరీక్షించగా రోగము లేదు! ఇది మహిమకాక మరేమిటి?.

## శిరోవేదన నివారణ.

మా పెద్ద కోడలు శ్రీలక్ష్మి చాలా కాలంనుండి విపరీతమైన శిరోవేదనతో బాధపడుచూ స్వామి పాదములపైపడి శరణువేడింది. స్వామి ఆమెను అనుగ్రహించదలచారు. ఆమె శిరోవేదనను ఆకర్షించి, ఆమెను శిరోవేదన నుండి విముక్తురాలను చేసినారు. మరియొక సమయంలో ఆమె కంఠంలోని తీవ్రమైన బాధను స్వీకరించి, స్వామి ఆమెను రక్షించారు. మరియొక సమయంలో ఆమె అంత్యకాలం సమీపించగా, స్వామి ఒక దండం పట్టుకొని ఇంటిచుట్టూ తెల్లవార్లు పహారాకాయుచు యమభటులను పారద్రోలి ఆమెకు ప్రాణభిక్ష పెట్టారు. శ్రీ లక్ష్మి తలనొప్పి తగ్గించటమే కాదు ప్రాణ దానం కూడా చేశారు స్వామి.

## వసుమతి గారి తలనొప్పిని తగ్గించుట.

ఒకసారి భక్తురాలు వసుమతి విపరీత శిరోవేదనను అనుభవించుచుండగా దానిని స్వామి తన పాదముమీదకు ఆకర్షించుకున్నారు. వెంటనే వసుమతిగారి తలనుండి ఒక అగ్ని జ్వాలలేచి బయటకు పోయినట్లు కనిపించినది. వెంటనే వసుమతికి శిరోవేదనమాయమైనది. రాత్రి అంతయును స్వామి పాదపీడతో బాధపడినారు.

## మా కుమార్తె శ్రుతకీర్తి అనుభవం

స్వామి గుంటూరులో మా అమ్మాయి శ్రుతకీర్తి (భర్త రమేష్) వాళ్లయింటికి చాలాసార్లు వచ్చేవారు. అక్కడ ప్రదర్శించిన మహిమలు అద్భుతం. 1. మా శ్రుతకీర్తి బుగ్గనొప్పిని తగ్గించుట. 2. బెంగుళూరు డాక్టరుగారి రూపంలో శ్రుతకీర్తికి స్వప్నంలో ఆపరేషన్‌చేసి బుగ్గ వ్యాధిని తగ్గించుట.

## సీతమ్మ గారి తలనొప్పి తగ్గించుట.

భక్తురాలు సీతమ్మగారు చాలా కాలమునుండి శిరోవేదనతో బాధపడుచుండెను. స్వామిని చూచుటకు మొదటి సారిగా మా ఇంటికి వచ్చింది. అప్పుడు స్వామి శయనించి యున్నారు. సీతమ్మగారికి ఒక అద్భుత దర్శనమైంది. పైనుండి బంగారు కాంతి రింగులు గిరగిర తిరుగుచు వచ్చి స్వామి శిరస్సులో లీనమగుచున్నాయి. స్వామి సీతమ్మగారి వైపు చూచి చిరునవ్వు చిందించారు అంతే! సీతమ్మగారి తల నొప్పి శాశ్వతంగా అదృశ్యమైనది. కానీ తరువాత 3 రోజులు స్వామి విపరీతమగు శిరో వేదనతో బాధపడ్డారు. ఆహా! ఇది స్వామి అనుగ్రహమేకదా!

## శస్త్ర చికిత్స నొప్పులను తగ్గించుట.

వసుమతిగారికి శస్త్ర చికిత్స జరిగినది. విపరీతములగు నొప్పులతో బాధపడుచున్నది ఆసుపత్రిలో. రాత్రి 9 గం॥కు ఆమె భర్తయగు శ్రీ భీమశంకరంగారు స్వామికి నమస్కరించినారు, మనస్సులో తనభార్య నొప్పులు తలచుకుంటూ. స్వామి నవ్వి ప్రసాదమును భీమశంకరంగారి చేతిలో నుంచి "ఇది వసుమతికి యిమ్ము" అన్నారు. సరిగా సమయం 9 గం॥ అయినది. అదే సమయంలో వసుమతి గారికి ఆసుపత్రిలో ఒక విద్యుత్‌శక్తి షాక్ కొట్టినట్లు అనుభూతి కలిగినది. అంతే! నొప్పులన్నీ మాయమైనవి!.

## కాలిన బొబ్బలు స్వీకరించుట.

ఒకసారి స్వామి విజయవాడలో తన యజ్ఞోపవీతాన్ని తీసి దత్త చిత్రపటం వద్ద ఉంచి "ఒక దత్త భక్తుడగు మాదిగవాడు అగ్ని ప్రమాదమునకు గురియైనాడు వాని కాలిన బొబ్బలను తీసుకుంటున్నాను" అని అన్నారు. వెంటనే స్వామి శరీరంమీద భయంకరంగా కాలిన బొబ్బలు గోచరించాయి. 3 రోజులు నరకయాతనను అనుభవించినారు. ఎట్టి ఔషధమును ఉపచారమును స్వీకరించకయే 4వ రోజు అవి అదృశ్యమైనవి. స్వామి మరల యజ్ఞోపవీతాన్ని ధరించినారు. స్వామి దృష్టిలో భక్తి యొక్క గాఢతయే తప్పు, కుల ప్రసక్తి ఎప్పుడును ఉండదని విశదము కాలేదా!.

## రక్తపోటును స్వీకరించుట.

శ్రీ కోనేరు సత్యనారాయణగారు కోనేరు లక్ష్మయ్య ఇంజనీరింగ్ కాలేజీ ఛైర్మన్. వారికి స్వామియందు శ్రద్ధాభక్తులు కలవు. సత్యనారాయణగారు సత్యము ధర్మము మూర్తీభవించిన అత్యుత్తమసాధకుడని మాతో ఎప్పుడూ స్వామి చెప్పేవారు. ఒకరోజు ఆయన సోఫాలో స్వామిని తన ప్రక్కన కూర్చుండబెట్టుకొని తన రక్తపోటును పరీక్షా సాధనములో చూచుకొనుచున్నారు. అప్పటికి 15 రో॥ నుండి ఎన్నో వైద్యములు చేయించుకున్నా రక్తపోటు తగ్గలేదు. తన అనారోగ్యమును గురించి స్వామితో ముచ్చటించారు ఆయన. స్వామి చిరునవ్వు చిందించారు. “ఇప్పుడు ఎంత ఉందో?” అన్నారు స్వామి. వెంటనే ఆయన పరీక్షలో ఆశ్చర్యము! రక్తపోటు పూర్తిగా తగ్గినట్లు పరీక్షా సాధనము చూపించింది. ఆయన దానికి విస్మితులైనారు. ఆ నాటి రాత్రి స్వామి మా ఇంటిలో శయనించారే కాని తెల్లవార్లు రక్తపోటుతో బాధపడినారు.


భక్తుల అనారోగ్యమును తాను స్వీకరించి అనుభవించి భక్తులకు సుఖమును అందించటం శ్రీ దత్తుని లక్షణము కదా!.



## మృత్యువునుండి రక్షించుట.

శ్రీ విజయరామ్

శ్రీమతి రమ



ఒకసారి భక్తురాలైన రమకు హైదరాబాదులో తీవ్రమైన అనారోగ్యం వచ్చింది. అది ఒక విచిత్రమైన వ్యాధి. డాక్టర్లకు అంతుపట్టలేదు. ప్రతిదినము 3 గంట॥ అయ్యేటప్పటికి క్రుంగిపోవటం, విలవిలటాడిపోవటం ఇక ప్రాణంపోతుందేమో అని భయపడటం జరుగుతోంది. ఎందరో డాక్టర్లు పరీక్షించి “అమ్మా! భయంలేదు నీకు ఏ అనారోగ్యం లేదు” అంటూ ఏదో మందులు ఇచ్చారే తప్ప ఈ వ్యాధి తగ్గటంలేదు. మేము మా రమా వాళ్ళింటికి వెళ్ళాము. పరిస్థితి చాలా తీవ్రంగా ఉంది. ఆమె



పవన్
(రమ పుత్రుడు)

లావణ్య
(రమ పుత్రిక)



పడే నరకబాధను చూడలేకపోతున్నాము. ఆమెను రక్షించుట స్వామి వల్లే అవుతుంది అందుకే వెంటనే విజయవాడ ఫోన్ చేసాము మా అబ్బాయి భాస్కర్‌కు. విషయంచెప్పాము - స్వామి వారు ఎక్కడున్నారో తెలుసుకొని, వారికి ఈ విషయము చెప్పి రమను రక్షించమని ప్రార్థించమని కోరాము. అప్పటికి రాత్రి 7-30 గం॥ సమయం అయింది. ఆశ్చర్యం! స్వామి వారు అప్పటికే అనగా మ॥ 1గంటకే విజయవాడ వచ్చేశారని, మా కోడలు బాలతో "మీ వాళ్ళలో ఒకరు మరణించనున్నారు" అని చెప్పి వెంటనే స్నానం చేసి రుద్రాభిషేకం ప్రారంభించారని, అభిషేకంలోనే ఉన్నారని, స్వామి వచ్చి ఇప్పటికి ఆరు గంటలు అయిందని చెప్పారు. భాస్కర్ నేను చెప్పిన రమ అనారోగ్యం విషయాన్ని వినగానే దు:ఖితుడయ్యాడు. "స్వామీ" హైదరాబాదునుండి ఫోన్ నాన్నగారు మాట్లాడుతున్నారు, ఒకసారి మాట్లాడరా? అని విన్నవించాల్సిన విషయం భాస్కర్ చెప్పకముందే, "నేను ఆ పని మీదనే ఉన్నానని చెప్పు" అని మా అబ్బాయితో అన్నారట. రమను చంద్రశేఖరాష్టకం చదువుకోమని కూడా ఆదేశించారు. ఈ ఫోను వార్త వినగానే మేమందరం చంద్రశేఖరాష్టకం చేయటం మొదలుపెట్టాము. అంతే! వ్యాధి తిరుగుముఖం పట్టటం ఆరంభమైనది. మరునాడు కూడా మధ్యాహ్నం 3 గం॥కు ఆ వ్యాధి కనిపించింది. మేము ఆదుర్దా పడ్డాము. స్వామిని ప్రార్థించాము. వెంటనే చంద్రశేఖరాష్టకం పారాయణ చేయసాగాము. ఆ సాయంత్రం బాగ్‌లింగంపల్లిలో మా ఇంటికి వచ్చారట స్వామి. మా కోడలు సుజాత స్వామిని తీసుకుని రాత్రి 9 గం॥కు రమాసుందరి వాళ్ళింటికి వచ్చింది. స్వామి వచ్చి విశ్రమించారు. రమ స్వామి పాదాలు గట్టిగ పట్టుకుంది. ఏడవటం మొదలు పెట్టింది. శరీరం క్రుంగిపోతోంది. యమయాతన అనుభవిస్తోంది. రాత్రి 12 గం॥ దాటింది. మేము అక్కడే ఉన్నాము కదా! స్వామి అలానే పడుకొనే ఉన్నారు. రమ స్వామి పాదాలు వదలలేదు. ఆ బాధచూడలేక "స్వామీ! ఆమెను రక్షించనన్నా రక్షించండి, లేకపోతే అంతం చేయండి, కానీ ఈ నరకబాధను చూడలేక పోతున్నాము" అని ప్రాధేయపడ్డాము కన్నీరు పెట్టుకుంటూ. స్వామి తటాలున లేచి కూర్చున్నారు. "నీవు కూడా ఇట్లు మాట్లాడుచుంటివా?" అంటూ మా రమను చంద్రశేఖరాష్టకం చదవమన్నారు. మేము కూడా చంద్రశేఖరాష్టకం పారాయణం చేశాము. స్వామి నిమీలిత నేత్రులై ఆమె రక్షణకు

సంకల్పించారు. అంతే చంద్రశేఖరాష్టకం పారాయణం పూర్తికాగానే రమ తేరుకున్నది. స్వామి అనుగ్రహం వల్ల వ్యాధి నుండి బయటపడి రక్షించబడినది. ఆహా! స్వామి సర్వజ్ఞతకు ఇంతకంటే మరి ఏమి నిదర్శనము కావలెను?

## అతిసార, శూలవ్యాధులను పోగొట్టుట.

ఒకసారి అతిసారవ్యాధి వాంతులు విపరీతంగా వచ్చి, నా పరిస్థితి అస్తవ్యస్తమైనది. ఆ రోజు స్వామి అజయ్‌గారింటిలో ఉన్నారు. స్వామి అజయ్‌గారితో "ఇంత దత్తసేవ చేసిన బాలకృష్ణమూర్తికి (నేను) ఆపద వచ్చినప్పుడు ఆదుకోకపోతే ఎలా?" అన్నారట. స్వామికి వెంటనే అతిసారవ్యాధి, వాంతులు ఆరంభించినవి. అదే సమయానికి సరిగా ( ఉదయం 7 గం॥లకు) నాకు వ్యాధి అదృశ్యమైనది. అజయ్‌గారు స్వామి బాధను ఆ రోజంతా కనులారా గాంచి ఆశ్చర్యపడి "పుస్తకాలలో స్వామి భక్తుల వ్యాధులను అనుభవిస్తారని చదివితినిగానీ ఇదే మొదటిసారి చూచుట" అని నిశ్చేష్టులైనారు స్వామి అనుభవిస్తున్న రోగబాధను చూస్తూ.

2. మరియొక సారి నేను కడుపులో వ్యాధి ముదిరి అన్నము తినుట ఆగిపోయినది. అన్న హితవులేక శుష్కించితిని. స్వామి వచ్చినారు. భోజనము చేస్తున్నారు. నేను స్వామి పాదాల వద్ద కూర్చుని "స్వామీ! తమరు శ్రీ నరసింహ సరస్వతి అవతారమున ఒక భక్తుని శూలను పోగొట్టినారు కదా అలానే నన్ను ఇప్పుడు అనుగ్రహించండి" అని దీనంగా వేడుకున్నాను. స్వామి హృదయం ద్రవించినది. వెంటనే తాను తింటున్న అన్నమును 3 ముద్దలను నాకు ప్రసాదంగా ఇచ్చారు. అవి తిన్నాను. మెతుకు పోయినా వికటించే స్థితిలో ఉన్న నాకు ఏమికాలేదు. అప్పటి నుండి అన్న హితవు పుట్టి శూలరోగము పోయి పూర్ణారోగ్యమును పొందితిని.

3. మరియొక సారి నాకు స్నానం చేస్తుండగా నడుము పట్టివేసింది. బాత్‌రూమ్ నుండి బయటకు రాలేక పోయినాను. నా శ్రీమతి సహాయంతో వచ్చి పడుకున్నానే కానీ ఇటూ అటూ కదలలేక పోయినాను. స్వామిని మనస్సులో తలచుకొని నా పరిస్థితి నివేదించుకొన్నాను. మధ్యాహ్నం 3 గం॥కు స్వామి వచ్చారు. నా మంచం మీద కూర్చున్నారు. లేచి నమస్కారం కూడా పెట్టలేకపోయాను. "నీ బాధను నేను తీసుకోనా?" అన్నారు స్వామి. "స్వామీ! వద్దు, వద్దు నా కర్మ ఫలాన్ని

నన్నే అనుభవించనీయండి. మీరు తీసుకోవద్దు మీ అనుగ్రహమే చాలు" అని ప్రార్థించాను. స్వామి విభూతి నోట్లో వేసి నడుముకురాచారు. 3 గం॥ల నుండి 6గం॥ల వరకు భజన చేశారు. గుంటూరు వెళ్తూ వెళ్తూ నా దగ్గర కూర్చుని "మీరు బాధను నన్ను తీసుకోవద్దన్నారు కదా! దత్తునిగా నేను తీసుకుంటే క్షణంలో తగ్గేది. అందుకే 3 గం॥లు భజన చేశాను భక్తునిగా మీ కోసం. ఇక తగ్గుతుంది లేండి" అని. అంతే నేను పూర్తిగా కోలుకొన్నాను. అంతా స్వామి అనుగ్రహమే.

" భక్తుడు నీవే - దత్తుడు నీవే । ఒక్కడె మామా - భావసిద్ధుడు" అని స్వామిని గురించి గానము చేయుదము గాక.

## సైన్సును మించిన శక్తి

గుంటూరులో జరిగిన సంఘటన వినిపించి తరింతునుగాక॥

భగవంతుని మహిమల యందు పూర్తి విశ్వాసము కలుగని వారు ప్రత్యక్ష ప్రమాణం మీద ఆధారపడతారు. సైన్సునే నమ్మిన వారు వీరు. సైన్సునే నమ్ము ఒక ఇంజనీరింగ్ విద్యార్థిని అనుభవం ఇది. ఒకనాడు ఆ విద్యార్థినితో స్వామి "నిన్న టీవి చూశావా? రామాయణంలో హనుమంతుడు సముద్రాన్ని లంఘించే దృశ్యం ఎంతబాగుంది" అని అన్నారు. ఆ విద్యార్థిని "నేను చూడలేదు. క్రికెట్ ఆట చూస్తున్నాను. అయినా సైన్సు ఇంత వృద్ధియైన రోజుల్లో సముద్రాన్ని దూకటం నమ్ముతారా?" అని అన్నది. స్వామి ఒకనాడు ఆ విద్యార్థిని ఆహ్వానంపై వారి యింటికి పోవటం జరిగింది గుంటూరులో. ఆమెకు మహిమల మీద నమ్మకం కుదరలేదు కదా! స్వామిని పరీక్షించదలచింది. ఆ విద్యార్థిని వారింటిలో అద్దెకున్న 6 సం॥ నుండి శూలవ్యాధితో బాధపడుచున్న ఒక వృద్ధుని స్వామికి చూపించి "వీరి వ్యాధిని మీరు పోగొట్టండి. 6 సం॥ నుండి ఎన్ని వైద్యాలు చేసినా నిష్ఫలమైనది. నేను ఆధ్యాత్మికమును నమ్ముతాను" అని అన్నది. స్వామి చిరునవ్వు చిందించారు. ఇంతలో ఆ వృద్ధుడు స్వామికి 2 అరటిపండ్లను సమర్పించి నమస్కరించగా, స్వామి ఆ రెంటినీ వెంటనే తింటూ "ఇదిగో యీ ఫలముల ద్వారా నీ కర్మఫలమును స్వీకరించుచున్నాను" అన్నారు. అంతే! 6 సం॥నుండి శూలవ్యాధితో బాధపడుతూ అన్నం మెతుకులు తినగానే వికటించు ఆ రోగి ఆ రోజునుండియే పరిపూర్ణ భోజనము

చేసి తృప్తిగా తేన్చెను. స్వామి సాక్షాత్తు దత్తావతారులు కదా. ఆ భక్తుని వ్యాధిని తాను స్వీకరించి, తానే అనుభవించి, ఆ భక్తుని రోగ విముక్తుని చేయుట శ్రీ దత్త తత్త్వము గదా! ఆ రోజు రాత్రి అంతయూ స్వామి ఎంత శూలవ్యాధితో బాధపడినారంటే స్వామి బాధ తట్టుకొనలేక మంచము పై ఎగిరి ఎగిరి పడగా, మంచము నవారు తెగిపోయెను.! ఆ విద్యార్థిని స్వామికి ఒకపిచ్చి భక్తురాలిగా మారినది.

ఆహా! దైవకృప! వర్ణనాతీతముగదా!



## బాలికను కాపాడుట.

రామనాథఅయ్యర్, ధర్మపత్ని, పుత్రిక

శ్రీ రామనాథ అయ్యర్‌గారు బొంబాయిలో యుటిఐ బ్యాంక్‌లో వైస్‌ప్రెసిడెంటుగా పని చేయుచున్నారు. ఒకసారి శ్రీ రామనాథ అయ్యర్‌గారు స్వామిని దర్శించుట జరిగినది. ఇంతలో ఆయన బాలికకు పెద్ద జబ్బు చేసినది. ఆసుపత్రిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్చటం కూడా జరిగింది. శ్రీ అయ్యర్, స్వామి ఫొటోకు ఎదురుగా ఆసీనుడై స్వామిని "స్వామీ! మీరే కాపాడాలి" అని ప్రార్థించారు. ఆ సమయమందు స్వామి విజయవాడలో ఉన్నారు. భక్తులతో ముచ్చటిస్తున్న స్వామి నవ్వుతూ "నుదుటి వ్రాతలను తుడిచివేయగా, వ్రాసినవారే సర్వ సమర్థులు" అని పాడారు. అంతే! అక్కడ బాలికకు జబ్బు అంతయు అదృశ్యమై మృత్యువాత నుండి బయటకు వచ్చినది ఆడుతూ పాడుతూ! కృతజ్ఞత చెప్పుకుంటూ అయ్యర్ ఫోన్ చేశారు. స్వామి అదే పాటను ఫోన్‌లో వినిపించారు అయ్యర్‌గారికి. అందరూ సంతోషించారు. ఈ చరణమే స్వామి రచించిన బ్రహ్మ గాయత్రి భజనలో ఉన్నది.

అయితే అయ్యర్ తన చెల్లెలుకు బాగా జబ్బు చేయగా ఆసుపత్రిలో చేర్చి స్వామిని రక్షించమని ఫోన్ చేసినారు. స్వామి "లాభంలేదు. ఆమె చెవిలో శ్రీరామనామం చెప్పుము" అని పలికారు. ఆమె మరునాడే పరమపదమును చెందినది.!

ఆహా! అంతా దైవ నిర్ణయమే కదా!

## హనుమద్భక్తునికి గండము తప్పించుట.

1999 సం॥ ఆరంభంలో శ్రీ కోనేరు సత్యనారాయణగారి తండ్రి గుంటెపోటుతో హైదరాబాద్ ఆసుపత్రిలో చేర్చగా, వారి ప్రమాదమును నివారించుటకై, శ్రీ సత్యనారాయణగారు స్వామిని అర్థించినారు. మా ఇంటిలోనే స్వామి 3 రోజులు మృత్యుంజయ మంత్రానుష్ఠాన ధ్యానంతో ఉన్నారు ఆ పనిమీద. శ్రీ లక్ష్మయ్యగారు పూర్ణ స్వస్థతతో ఇంటికి తిరిగి వచ్చినారు. శ్రీ సత్యనారాయణగారు స్వామికి కృతజ్ఞతను తెలిపినారు.

ఆ తరువాత కొన్ని సంవత్సరములకు శ్రీ లక్ష్మయ్యగారు జబ్బున పడినారు. ఒక రోజు స్వామి తన సహాధ్యాయునితో సాయంత్రము ఇట్లు చెప్పినారు. "లక్ష్మయ్యగారి ఫైలు మీద సంతకం అయినది". మరునాడే ఉదయం లక్ష్మయ్యగారు మరణించినారు. "ఆయన హనుమంతుని భక్తుడు కావున సద్గతినొందినాడు" అని మాతో వచించినారు. స్వామి స్వయంగా మృత్యుంజయులయ్యును మృత్యుంజయ మంత్రానుష్ఠానము నేల చేసిరి?" అని ఒక భక్తుడు స్వామిని ప్రశ్నించగా "నన్ను భక్తునిగా తలచినచో నీ కొరకు దైవమును ప్రార్థింతును. నన్ను దత్తునిగా తలచినచో నేనే ఆ పనిని చేయుదును. ఎంత మాత్రముగ నిన్ను తలచిన - అంత మాత్రమే నీవు! "యే యథా మాం ప్రపద్యంతే" అని "గీత" అని స్వామి చెప్పియిలా పాడినారు. " భక్తుడు నేనే - దత్తుడు నేనే। ఒక్కడె మీ మీ భావ సిద్ధుడు".

## జ్ఞానము ద్వారా ఆరోగ్యము.

హైదరాబాదులో ఒక పండితుడు అష్టావక్ర సంహితను పురాణము చెప్పుచుండెను. ఒక శ్లోకము వద్ద పండితుడు ఆగిపోయెను. ఆ శ్లోకార్థము చెప్పిన శ్రోతలు రాళ్ళు వేయుదురని సంశయించెను. కానీ జనకుని గురువు అష్టావక్రుడు. శుకుని పరీక్షించిన వాడు జనకుడు. అట్టి జనకునికి గురువైన అష్టావక్రుడు జనకునికి ఉపదేశించుచున్న వేదాంతశాస్త్రము ఆ సంహిత. ఆ శ్లోకార్థము ఇట్లున్నది " ఓ జనకా! ఈ జన్మలో తల్లియైన జీవుడు, తన పుత్రునిపైనున్న శరీర మమకారంతో మరుజన్మలో భార్యగా జన్మించును"! ఈ శ్లోకార్థమును ఎట్లు చెప్పవలయునని ఆ పండితుడు చాల మందినడిగి, అందరును ఆ శ్లోకమును ఛీ కొట్టగా, ఏమీ పాలుపోక, ఆ దిగులుతో అన్న పానాదులు రుచించక 6 నెలలు మంచము పట్టి అనారోగ్యమునకు

గురియై శుష్కించినాడు. స్వామి భక్తులు కొందరు ఆ పండితుని స్వామితో సమావేశ పరచినారు. స్వామి ఆ పండితుని ప్రశంసించుచు "ఓహో! ఎంత నా భాగ్యము! జ్ఞానమునకు ఇంత విలువనిచ్చు వారు కలియుగమున కలరా! నేను తప్పక నీ సంశయమును తీర్చెదను. ముందు అన్నపానాదులను స్వీకరించు" మని బలవంతముగా ఆ పండితుని చేత అన్నపానములను స్వీకరింపచేసెను. ఆ తరువాత స్వామి ఆ శ్లోకమును యిట్లు వివరించెను. " ఒక సినిమా హాలులో ముందు ఒక సినిమా వచ్చినది. దానిలో ఒక నటుడు, ఒక నటి, తల్లి కుమారులుగా నటించిరి. ఆ హాలులో తరువాత మరొక సినిమా వచ్చినది. దానిలో అదే నటీనటులు భార్యా భర్తలుగా నటించిరి. కానీ ఆ నటులు నిజంగా మాత్రం మాతా పుత్రులుకారు, భార్యాభర్తలూకారు. ఇదే విధంగా యీ లోకంలో జీవుల మధ్యనున్న బంధాలు అంతే! స్థూల శరీరములు పోగానే యీ బంధములు నశించును. స్వర్గముననున్న అభిమన్యుని చూచి అర్జునుడు కౌగలించుకొనుటకు సమీపించగా "ఎవరు నీవు?" అని అభిమన్యుడు అడుగుట "నీ తండ్రిని నేను" అని అర్జునుడు చెప్పుట, "నాకు కోట్ల జన్మలు గడచినవి. నీవే జన్మలో తండ్రివి" అని అభిమన్యుడు అడుగుట మనకు తెలిసిన విషయమే గదా.. దీని వలన స్థూల శరీరము పోగానే యీ లోకబంధములన్నియును సినిమా షూటింగు బంధములవలె నశించుచున్నవి అనియే అర్థము కదా. ఇదే అష్టావక్రుడు చెప్పిన శ్లోక తాత్పర్యము. కావున యిట్టి అసత్య బంధముల వ్యామోహములకు లోనుగాక సత్య - నిత్యమైన భగవద్బంధమునకు ప్రయత్నించుడ"ని అష్టావక్ర మహాముని ఉపదేశించుచున్నాడు. ఈ శ్లోకము నిజముగా ఎంత విలువగలది!" అని స్వామి వివరించెను.

ఆ పండితుడు ఆ శ్లోకార్థ వివరణమునకు ఆనందముతో కంపించుచు, అశ్రునయనాలతో స్వామికి ప్రణమిల్లి "స్వామీ! నీవు నిజంగా దత్తుడవే. దత్తుడు తప్ప యిలా ఎవరును వివరించలేర"ని ప్రశంసించెను. ఆ పండితుడు మరునాడు పురాణమును చెప్పుట ఆరంభించి ఆ శ్లోకమును వివరించి జనుల నానందపరచెను. మరియును స్వామి జ్ఞానదానము చేత పండితుడు స్వస్థుడయ్యెను.



## నారదముని గానం.

ఆంజనేయశర్మ, కామేశ్వరమ్మ

శ్రీమతి కామేశ్వరమ్మ గారు, తన భర్త శ్రీ ఆంజనేయ శర్మ గారితో సహావచ్చి స్వామి శరణమును కోరినది. ఆ శర్మగారు వాక్కు మందగించి, పక్షవాతమునకు గురియైనారు. స్వామి శర్మగారితో "స్వామి పాటలు పాడేటంత మాత్రము నీకు స్వామి వాక్కుననుగ్రహించును" అన్నారు. దానితో శర్మగారు "నాదతను మనిశం శంకరం" అను కీర్తన నందుకున్నారు. స్వామి అదే కీర్తనను అందుకొని మధురంగా గానం చేశారు. వెనుక త్యాగరాజు పాడుతుంటే, శ్రీ నారదముని యీ పాటను అందుకొన్నారుగదా. స్వామి నారదునిగా తన గానంతో అనుభూతిని యిచ్చారునాకు, అచటనున్న శర్మగారికి. శర్మగారు ఎంతో ఉద్వేగంతో స్వామి పాదాలపైబడి శరణము వేడినారు. స్వామి ఇట్లు చెప్పినారు " నీ కర్మ ముగియనున్నది. ద్వారకలో కృష్ణాలయంలో ఒక పావురము కంఠానికి రాయి వేసి కొట్టిన ఫలం ఇది. వచ్చే జన్మలో మంచి భక్తుడవై స్వామిగానం చేస్తావు" అని ఆశీర్వదించినారు.

ఆంజనేయ శర్మ గారి ఆనందమునకు అవధులు లేవు. వారి సతీమణి కామేశ్వరమ్మ గారిని గురించి చెప్పనవసరమేలేదు. ఆమె స్వామి భక్తురాలైంది. ప్రతి రోజు సత్సంగములో పాల్గొని తరించుచున్నది.



శ్రీ లక్ష్మీకాంత్, శ్రీమతి అరుణ
(భక్తులు)



శ్రీ నాగేశ్వరరావు, శ్రీమతి సుమతి



# మహిమయమున.

## శివలహరి.
## సాక్షాత్తు దత్తుడే.

శ్రీ శివానంద మహరాజ్

విశాఖపట్నంలో షిర్డిసాయి పీఠాధిపతులు శ్రీ శివానంద మహరాజ్ గొప్ప యతీశ్వరులు. అన్ని సిద్ధులు కల యోగి శ్రేష్ఠులు. సంకల్ప మాత్రం చేత వస్తువులను సృష్టిస్తారు. వారి వయస్సు 500 సం॥ లని ప్రసిద్ధి. శ్రీ నరసింహ సరస్వతి శిష్యులైన సిద్ధయోగి వీరేనని ప్రసిద్ధి. ఆ సిద్ధ పురుషులు విజయవాడ ముత్యాలంపాడు సంస్థానానికి విచ్చేయటం తటస్థించింది. స్వామి భక్తులైన అజయ్, ఫణి, మన స్వామిని వీరి వద్దకు తీసుకుని పోయినారు. స్వామిని చూడగానే ఆ సిద్ధ పురుషులు ఇలా వచించారు. "దత్తుడు దత్తుడు అంటారు. ఆ దత్తుడు ఎక్కడ ఉన్నాడు. ఇదిగో ఈతడే దత్తుడు" అంటూ అజయ్‌గారి వైపుచూసి "ఈయనలో దత్తుడు అప్పుడప్పుడూ వచ్చిపోతుంటాడని నీవు అనుకుంటున్నావు. అలా అనుకుంటే బురదలో నీ కాలు పడినట్లే. ఈయనలో దత్తుడు ఎప్పుడూ ఉంటాడని తెలుసుకో" అని అన్నారు. స్వామి భక్తులందరకు ఇది హెచ్చరికకాక మరేమిటి? భీమశంకరంగారు, భార్య వసుమతి స్వామి తమ ఇంటిలోనున్నప్పుడు శివానంద మహరాజ్ గారిని తమ ఇంటికి ఆహ్వానించారు. అప్పుడు శ్రీశివానందులు ఆమెతో ఇలా అన్నారు. "నీ ఇంటిలోనే దత్తుడు సాక్షాత్తుగా ఉంటే ఇంక నేనెందుకు?" అని అన్నారు. ఆహా! ఎంతటి వివరణ ఆ రోజున వసుమతి గారింట్లో స్వామి ఉన్నారు.

ఒకనాడు శ్రీ కోనేరు సత్యనారాయణగారు శ్రీ శివానంద మహరాజ్‌ను దర్శించడానికి వచ్చినారు. పక్కనే స్వామి కూడా ఉన్నారు. శ్రీ సత్యనారాయణగారితో శ్రీ శివానందులు "మీ పక్కనే దత్తుడు ఉన్నారు. మనం గ్రహించుటలేదు" అంటూ లేచి స్వామిని పెద్ద పూలమాలతో సత్కరించి స్వామికి "జయ జయ దత్త ధ్వానాలు" చేసినారు. ఆహా! ఎంతటి ప్రత్యక్ష నిదర్శనము. స్వామి సాక్షాత్తు దత్తుడే. శివానందులు విశాఖపట్నానికి బయలుదేరేముందు స్వామికి నమస్కరించి "నీ కరుణ నాపై నుంచుము" అని ప్రార్థించారు.

అయితే, స్వామి ఇంత జరిగినా, చిరునవ్వుతో తానొక ధూళి కణాన్ని అన్నారు తప్ప అహంకరించలేదు. "ఎందుకలా మిమ్ములను తక్కువ చేసుకుంటారని భక్తులు ప్రశ్నించగా స్వామి ఇలా చెప్పారు. "దత్త తత్త్వము ఎప్పుడు వినయమే. జ్ఞానఫలం వినయమే, అహంకారం కాదు" ఎంతవారైనా అహంకరిస్తే పతనమగుదురు".

ఆహా! అట్టి నరావతారములో ఎల్లప్పుడూ మన మధ్య శ్రీ కృష్ణభగవానుడు పాండవుల మధ్య ఉన్నట్లు మానవాకృతిగా మనలను రక్షిస్తూ "జ్ఞానమె దీపము భక్తియె మార్గము" అని పదే పదే చెప్పుచూ ఎన్నో భక్తిరసామృత గీతములను ఆశువుగా పాడుతూ ఎలాగో ఒకలా బండరాళ్ళు అయిన మనలను తన శిల్పచాతుర్యం చేత మూర్తులుగా మలచుచూ మన మధ్య తిరుగుచూ ఉన్న ఆ దత్త ప్రభువు అగు స్వామిని గుర్తించి సేవించి తరింతుము గాక!.

## కమల గంధములు వెలువడుట.



శ్రీ సోమయాజులు, శ్రీమతి కామేశ్వరమ్మ (అజయ్ తల్లిదండ్రులు)

స్వామి అజయ్ గారింట్లో మధ్యే బ్రహ్మముఖము - శ్రీ బ్రహ్మదత్తుల స్వామి చిత్రమును ప్రతిష్ఠించారు కదా. అప్పుడు "తన తనువున గల కమల గంధముల, త్రిభువనములు ఆహ్లాదము నొందగ" అంటూ కీర్తించారు స్వామి బ్రహ్మగాయత్రి భజన కీర్తనలో. ఆ కీర్తన విన్న అజయ్‌గారి తల్లిదండ్రులు ఆ బ్రహ్మదత్తుల వారి చిత్రపటం ముందు కూర్చుని భజన చేస్తు " ఇది నిజమేనా? నిజంగా దత్తుని నుండి సుగంధం వస్తుందా?" అని సందేహించారు. స్వామి సత్య స్వరూపులు గదా! ఆశ్చర్యం! ఆ చిత్రపటం నుండి కమల గంధము 3 రోజులు ఘుమ ఘుమలాడింది. అదే గంధము స్వామి శయనించు గది నుండి కూడా వెలువడింది. ఎంతటి అద్భుతం ! అజయ్‌గారింటికి వచ్చినప్పుడల్లా ఆ గదిలోనే స్వామి శయనిస్తారు. అదీ సంగతి. ఈ సంఘటన, స్వామికి, బ్రహ్మదత్తులకు అభేదాన్ని సూచించటంలేదా?


శర్మ

## మరియొక సంఘటన.

ఒకసారి సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఉద్యోగియగు శర్మగారు అజయ్‌గారి స్కూటరు వెంట తన స్కూటరుపై వస్తున్నారు. అజయ్‌గారి స్కూటర్ వెనుక స్వామి కూర్చున్నారు. "స్వామి నిజంగా దత్తుడేనా? అనే సందేహం హృదయాంతరాలలో మెదిలింది శర్మగారికి. అంతే! వెంటనే స్వామి నుండి గాఢమైన పద్మగంధం వచ్చి శర్మగారికి సోకింది. స్వామి వెనుకకు తలతిప్పి శర్మగారి వైపు చూసి చిరునవ్వును నవ్వి ఇంటికి రాగానే "ఎలా ఉంది సుగంధం?" అని అడిగినారు. శర్మగారు ఆశ్చర్య చకితులయినారు! ఆహా! స్వామీ! నాది ఎంతటి అవిశ్వాసమయ్యా! నన్ను క్షమించు అని మనసా వేడుకున్నారు శర్మగారు. ఇట్లే ఒకసారి స్వామి రచించిన దత్తవేద గ్రంథము నుండి కూడా ఇదే కమల గంధం రావటంతో అచ్చటి భక్తుల సందేహం తీరి ధన్యులయ్యారు.

ఇలా ఉండగా మొట్టమొదటిసారిగా విజయవాడలో సత్యనారాయణపురంలో శ్రీ శిష్ట్లా భీమశంకరం గారింటికి స్వామి వచ్చారు. ఆ మరుసటి దినం వారింటికి స్వామి రాలేదు. స్వామి కోసం అందరు ఎదురు చూచారు. ఇంతలో ఆ క్రిందటి రోజు స్వామి ఆసీనులైన స్థలంనుండి విపరీతముగ సుగంధము రావటం మొదలైంది. ఆ సమయంలో వసుమతి భీమశంకరం దంపతులు బయటకి వెళ్ళటంవల్ల వారికి ఈ సుగంధం విషయం తెలియలేదు. ఇంటిలో పద్మ ప్రభాకర్ దంపతులు ఇద్దరే ఉన్నారు. ఆ గంధము చాల గాఢముగ వచ్చుచున్నందున, ఆ దంపతులు భయపడి ఆ గదినంతయును కిటికీలతో సహా బంధించి వేశారు. గంట తరువాత ఆ గదిని తెరువగా ఆ గంధము అదృశ్యమైనది. ఆ మరునాడు వచ్చిన స్వామి "రెండవ రోజు నేను రాలేదని మీరు అనుకున్నారు. కానీ నేను వచ్చాను కదా. ఆ గదిలో నుండి వచ్చిన కమల సుగంధం నేను వచ్చాననటానికి ప్రత్యక్ష నిదర్శనం కాదా!" అన్నారు స్వామి. ఆహా! అద్భుతం!!

## స్వామి "మూడు తలలోడు"

స్వామి ఒకరోజు విజయవాడ కృష్ణలంకలోని మా ఇంటి రెండవ అంతస్థులో శయనించారు. 3వ అంతస్థులో ఉన్న శ్రీ దత్త పీఠమందిరంలో యధా ప్రకారమే మేము శయ్యను వేసి చిన్న దిండును పెట్టి పవళింపు సేవ చేసి వచ్చినాము. తెల్లవారింది. రెండవ అంతస్థులో శయనించిన మన స్వామి నిద్రలేచి నా భార్య వైపు చూసి "ఏమమ్మా భవానమ్మా! ఏమిటి ఇంత చిన్న దిండు పెట్టావు. నా మూడు తలలకు సరిపోవద్దా? రేపు అయినా కాస్త పెద్ద దిండు పెట్టు" అన్నారు. అలా ఎందుకు అన్నారో మాకు అర్థం కాలేదు ఎందుకనగా – రెండవ అంతస్థులో శయనించిన స్వామికి పెద్ద దిండే పెట్టినాము గదా! స్వామి స్నానాదులు ముగించుకొని వెడలి పోయినారు. ఆ తరువాత మేము యధా ప్రకారము పై మందిరంలోకి శయ్యను తీసి మందిరాన్ని శుభ్రపరుద్దామని వెళ్ళినాము. ఆశ్చర్యం! ఆ శయ్యపై మేము రాత్రి ఉంచిన దిండు కుడి వైపున బాగా అణిగి ఉంది. అప్పటికి గాని స్వామి పలుకులు మాకు అర్థము కాలేదు. మేము ఉంచిన దిండు రెండు తలలకు సరిపోయి మూడవ తలకు చాలక అణిగిపోయినది అన్నమాట. "మూడు తలలోణ్ణిరా నేను మూడు లోకాల ఏలికనురా" అని స్వామి పాడిన పాటకు ఇది ప్రత్యక్ష నిదర్శనం కాదా!.

ఆ నాటి నుండి పైన శయనమందిరంలో శయ్యపై పెద్ద దిండు పెట్టాము. స్వామి సాక్షాత్తు మూడు తలల శ్రీ దత్త ప్రభువే అని రెట్టించిన భక్తి ప్రపత్తులతో ఆరాధన సాగించాము. స్వామీ! ధన్యులము!



బ్రహ్మ యజ్ఞంలో స్వామి



## రూపాయి నాణెము సృష్టించుట.

నాగప్రసాద్, నాగశివరత్న ప్రభావతి

ఒక రోజు గుంటూరులో విశ్వప్రియ రియల్ ఎస్టేట్స్ అధినేత నాగప్రసాద్ గారి ఇంటిలో స్వామి భజన చేసినారు. ప్రసాద్ దంపతులు స్వామిని ప్రార్థించగా, భజన తరువాత "నేను లక్ష్మిని నీ ఇంట వదిలినాను. నీకు వృద్ధాప్యంలో, దత్తుడైన నేను కావలయును కావున అప్పుడు వస్తానులే" అని అన్నారు స్వామి. భజన స్థలంలో అమ్మవారి చిత్రం ముందు ఒక రూపాయి అద్భుతరీతిలో ప్రత్యక్షమైనది. దానిని వారు స్వామి ప్రసాదంగా భావించి దాచుకున్నారు. అదియే లక్ష్మి ప్రసన్నము.

## పుల్కాలను సృష్టించుట.

విజయవాడ వాస్తవ్యులు శ్రీ కోనేరు సత్యనారాయణ గారు షిరిడి యాత్ర చేయాలని సంకల్పించి, వారితో వారి సతీమణి శ్రీమతి శివకాంచన లత గారిని, వారి మాతృదేవత చిట్టెమ్మగారిని బయలుదేరతీశారు. వారితోపాటు మన స్వామిని కూడా తీసుకువెళ్ళడం జరిగింది. షిరిడీలో స్వామి ఒక అద్భుత సత్యాన్ని నిరూపించి శ్రీ సత్యనారాయణ గారిని ఆశ్చర్యచకితులను చేశారు. ఆనాటి ఉదయమున షిరిడిలో స్వామి రెండు పుల్కాలను అద్భుతరీతిలో సృష్టించి, శ్రీ సత్యనారాయణ గారి చేతిలో పెడుతూ "షిరిడీసాయి వీటిని నాకు ఇచ్చారు. బిచ్చగానికి, కుక్కకు దానము చేయమన్నారు" అని అన్నారు. సత్యనారాయణగారు ఆశ్చర్యచకితులై, ఆ పుల్కాలను స్వీకరించి నడుస్తూ ఉండగా, మందిరానికి పోవు దారిలో ఎదురుగా వచ్చిన ఒక బిచ్చగానికి ఆ రెండు పుల్కాలను ఇచ్చినారు. ఆ పుల్కాలను అందుకొన్న ఆ బిచ్చగాడు వాటిని వెనుకకు ముందుకు త్రిప్పుచూ పరీక్షించి అక్కడే ఉన్న ఒక నల్ల కుక్క చేత వాటిని తినిపించాడుట. ఈ సంఘటన విన్న నేను స్వామిని ఇలా ప్రశ్నించాను.

"స్వామీ ! షిరిడి బాబావారు ఆ పుల్కాలను బిచ్చగానికి కుక్కకు పెట్టమన్నారు గదా. మరి సత్యనారాయణగారు అక్కడ పుల్కాలను బిచ్చగానికి దానం చేయటం, ఆ బిచ్చగాడు ఆ రెండు పుల్కాలను నల్ల కుక్కచేత తినిపించటం" అద్భుతంగా ఉన్నది. దీనిలోని దేవరహస్యం చెప్పరా? అని ప్రార్థించాము

స్వామి ఇలా వివరించారు.

"షిరిడీ బాబా ఎవరు? దత్త భగవానుడే కదా! భగవంతునకు భక్తునిపై ప్రేమ ఎలా ఉంటుందో ఈ సంఘటనలో స్వామి నిరూపించారు. అసలు విషయం ఏమంటే షిరిడీబాబా వారు, ఒక పుల్కా బిచ్చగాడికి, ఒక పుల్కా కుక్కకు అని ప్రసాదించారు. కానీ సత్యనారాయణగారు ఆ రెండు బిచ్చగానికే యిచ్చారు. అసలు ఆ బిచ్చగాడు ఎవరో తెలుసా? సాక్షాత్తు లక్ష్మీనారాయణుడే. స్వీకరించిన పుల్కాలలో ఒకటి తనకు, ఒకటి కుక్కకు గదా. సాక్షాత్తు లక్ష్మీనారాయణ స్వరూపుడైన ఆ బిచ్చగాడు కుక్క పుల్కా కుక్కచేత తినిపించి, తాను తినవలసిన పుల్కాను భక్తుడైన ఆ కుక్కచేత తినిపించి తాను తృప్తిపడ్డాడు. ఇదీ రహస్యం -

కనుక స్వామికి తన భక్తులంటే ఎంతటి ప్రేమయో నిరూపించబడలేదా" అన్నారు స్వామి.

## స్వామి వాక్యమే సత్యము.

ఒక భక్త దంపతులు విజయవాడలో వేడుకొనగా స్వామి "ఆవీరోజాయతాంపుత్ర:" అని ఆశీర్వదించినారు. ఇది వేదములోని వాక్యము. దీని అర్థము "మీకు మంచి మొనగాడైన పుత్రుడు జన్మించుగాక" అని. తరువాత ఆ భక్తురాలు గర్భవతి అయినది. 8వ నెలలో స్కానింగ్ తీయగా ఆడ శిశువు అని వచ్చినది. ఆ భక్తురాలి తండ్రి స్వామితో ఈ విషయం చెప్పినాడు. స్వామి "నేను ఆశీర్వదించినది వేద మంత్రము. అది పొల్లుపోదు - పుత్రుడే జన్మించును" అని అన్నారు. దానికి ఆయన నవ్వుతూ "మంత్రాలకు సెక్స్ (లింగము) మారునా?" అని ఎగతాళి చేసినారు. 9వ నెలలో ఆ భక్తురాలు షండంటి పుత్రుని కన్నది!

గుంటూరులో మరియొక భక్తురాలు గర్భవతిగా ఉన్నప్పుడు స్కానింగ్‌లో ఆడశిశువు అని తేలినది. స్వామి "నిజమే నీ గర్భములో ఉన్నది ఆడశివువే, కానీ దైవశక్తికి అసాధ్యము కలదా? నీ గర్భముననున్న ఈ ఆడశివువును ఈ క్షణములో

మగశిశువుగా మార్చుచున్నాను" అనెను. అక్కడ ఉన్న కొందరు వ్యక్తులు స్వామితో పందెము కాసిరి. ఆ భక్తురాలికి మగ శిశువు జన్మించెను. ఆ శిశువు ఆడపిల్లవలె సుందరముగ కోమలముగ నుండెను!.

## శివుడు ఆదిత్య రూపుడు.

శ్రీశైలంలో ఉదయం ఎప్పుడూ శివునిమీద భజన క్యాసెట్లు వేస్తారు, అందులోను మొట్టమొదటి క్యాసెట్టు ఎప్పుడు శివపరంగానే ఉంటుంది. ఒకరోజు స్వామి తెల్లవారుఝామున లేచి మాతో "ఈ రోజు శివుడు ఆదిత్యస్వరూపంతో ఉన్నాడు. అసౌయస్తామ్రో అరుణ:" అని శ్రుతిగదా". అన్నారు. ఈ మాట చెప్పగానే శివాలయంనుండి మొదటి క్యాసెట్టు పాట ఆదిత్యహృదయం వినిపించింది. మేము శివాలయమునకు పోయి మొదటి పాట ఆదిత్య హృదయము ఎందుకువేశారని విచారించగా, ఆరోజు క్యాసెట్లు వేయు ఉద్యోగి సెలవు పెట్టినందున ఎవరో కొత్తవాడు (ఉద్యోగిచే పంపబడినవాడు) వచ్చి తెలియక ఆ క్యాసెట్టును వేసినాడట.

ఆహా! ఎంతటి మహిమ!

## సంన్యాసి పరీక్ష.

ఆ రోజుల్లో స్వామి దత్త భక్తులుగా వ్యవహరించేవారు. స్వామి, నేను, నా శ్రీమతి శ్రీశైలంలోయున్నాము. ఆనాడు శ్రీ మల్లికార్జునుల సేవించి భ్రమరాంబ తల్లి దేవాలయానికి వెళ్ళాము. భ్రమరాంబదేవి గుడిలో మేము ముగ్గురము నిలచియున్నాము. ఆ గుడిలో విరిగిన ఒక పాత గంట త్రాడుతో బాగా పైకి కట్టబడి ఉంది. బలంగా ఆ ఎత్తుకు ఎగిరితే తప్ప ఆ గంట అందదు. అది విరిగిన గంట కదా! అందువలన ఎవరూ కొట్టరు. దానికి ముందు కొత్త గంట బాగా క్రిందకు కట్టబడివున్నది. అందరూ ఆ కొత్త గంటనే కొడుతున్నారు. ఆ గుడిలో కొంత దూరమున ఒక సంన్యాసి కనిపించాడు. ఆ సంన్యాసి స్వామి వైపు అదేపనిగా చూస్తున్నాడు. మన స్వామి ఒక సిద్ధపురుషునిగా గోచరిస్తున్నట్లుంది. ఆ సంన్యాసి తీవ్రంగా ఆలోచిస్తునట్లు కనిపించాడు. ఆ సంన్యాసి "స్వామి సిద్ధ

పురుషుడా? కాదా?" అన్న సంశయముతో మధన పడుతూ మనస్సులో ఇలా అనుకున్నాడు. "ఇతడు సిద్ధపురుషుడు అయినచో వెనుకకు వచ్చి ఎగిరి ఆ పాత గంట కొట్టాలి" అని. స్వామి సర్వాంతర్యామి గదా! అతని మనో భావాన్ని ఇట్టే గుర్తించి అతడి వైపు చూచి చిరునవ్వు నవ్వి, వెనుకకు వచ్చి వేగంగా పైకి ఎగిరి పాత గంటను కొట్టినారు. ఆ చర్యను గమనించిన ఆ సంన్యాసి స్వామి వద్దకు వచ్చి తనను పరిచయం చేసుకొని ఆ తరువాత మేముంటున్న శివసదనానికి వచ్చారు. గుడిలో తాను ఏమి భావించినది పూసగుచ్చి నట్లు వివరించాడు. ఇదంతయూ స్వామికి విదితమే గదా. స్వామి చిరునవ్వు చిందించారు.

అప్పటినుండి ఆ సంన్యాసి ప్రతి రోజూ వచ్చి స్వామిని దర్శిస్తూ ఉండేవాడు. ఒకనాడు నేను ఆ సంన్యాసితో ఇలా అన్నాను స్వామిని గురించి. "వీరు దత్త భక్తులు. వీరికి దత్త దర్శనం అయింది" అని. కానీ, ఆ సంన్యాసి తటాలున లేచి నిలబడి ముఖంలో మాత్సర్యం ఉట్టి పడగా ముఖం చిట్లించుకొని " ఆ! వీరికి దత్తుడు కనిపించినాడా? దయ్యం కనిపించిందా?" అని వికటంగా నవ్వాడు. అప్పటి వరకు కూర్చునియున్న స్వామి లేచి తటాలున లేచి నిలబడి కన్నెర్ర చేసి "ఓ సంన్యాసీ! నీవు కొన్ని అల్ప సిద్ధులను సాధించి మిడిసిపడుతున్నావు. నీవు మహాత్ముడైన ఒక స్వామివారి శిష్యుడవు. నీవు నీ గురువు మీదే నీ క్షుద్ర విద్యలను ప్రయోగించినావు. అందుకే ఆయన నిన్ను తన్ని తగలేశాడు. ఎంతటి గురుద్రోహము చేశావు. పో! ఆయన పాదములపై పడు. ఆయన నిన్ను అనుగ్రహించగలడు". అని ఆ సంన్యాసిని స్వామి హెచ్చరించారు. అప్పుడు ఆ సన్యాసి మరల వికటంగా నవ్వి "నీవు చెప్పినదంతా కట్టు కథ", అంటూ మరల రుసరుస లాడుతూ తన నివాసానికి వెళ్ళిపోయాడు. పట్టరాని క్రోధంతో, మాత్సర్యంతో ఆ సంన్యాసి ఆ రాత్రి చండీ ఉపాసన చేసి స్వామిపై ప్రయోగం చేసినాడు. స్వామి సర్వాంతర్యామి గదా! ఆయనకు తెలియనిది ఏముంది. చిరునవ్వుతో ఉండిపోయారు. కానీ జరిగిన ఆ సంఘటనలు, ఆ సంభాషణలు విన్న మాకు చాలా భయం వేసింది. అప్పుడు స్వామి " ఏమి

ఫరవాలేదు, మీరు విశ్రాంతిగా పడుకోండి" అన్నారు. శివసదనంలో గదిలో ఉన్నాము గదా మేము. మంచి నిద్రలో ఉన్నాము. ఇంతలో మాగది తలుపులు తటతట ఎవరో కొట్టారు. లేచి తలుపు తెరిచాము. ఆశ్చర్యం! ఆ సంన్యాసి లోపలికి వేగంగా వచ్చాడు. అప్పటికే లేచి కూర్చుని ఉన్న స్వామి పాదాలపై పడి క్షమించమంటూ ప్రాధేయపడ సాగాడు. స్వామి అతడిని లేవనెత్తి ఆసీనులను చేశారు. అప్పుడు ఆ సంన్యాసి ఇలా వివరించాడు గద్గద గళంతో – "స్వామీ ! నీవు సర్వజ్ఞుడవు. నీవు నాగురించి చెప్పినదంతా నిజమే. నా గురువు నన్ను మరల అనుగ్రహించునట్లు చేయుము. ఇది ఎవరికిని తెలియని రహస్యము! నీకు తెలిసినది! గత రాత్రి చండిని ఉపాసిస్తూ, నిన్ను బాధించుటకు నేను శ్రీ చక్రార్చన చేయుచుండగా జగదంబ సాక్షాత్కరించి తీక్ష్ణ దృక్కులతో నావంక చూచుచూ ఉంగరాల వేళ్ళతో నామాడును గట్టిగా మొట్టినది. "పోయి స్వామి పాదాలపై బడి శరణము పొందుము" అని ఆదేశించింది. అందుకే ఉరుకు పరుగులతో వచ్చినాను. స్వామీ! నన్ను క్షమించి, నాకు మార్గదర్శకులు కండి" అని ప్రార్థించాడు. అప్పుడు స్వామి అపార వాత్సల్యంతో చిరునవ్వు చిందించుచూ, "ఇక నైననూ దుష్ట ఆలోచనలను దూరము చేసుకొని సన్మార్గములో నడుచుకొనుము" అని బోధించి పంపివేసినారు. ఆ సంన్యాసి పేరును ఇచ్చట వ్రాయవద్దన్నారు స్వామి. "ఆయన గౌరవమును కాపాడాలి" అన్నారు. ఆహా! స్వామి కరుణ ఎంత ఉన్నతము!

జగదంబయే స్వామి దైవత్వమునకు ప్రత్యక్ష నిదర్శనమయ్యెను గదా! ఎంతటి ప్రత్యక్ష ప్రమాణము!

## మంచి ఉద్యోగమును అనుగ్రహించుట.

మేము హైదరాబాదులో ఉన్న రోజులవి. మా పిల్లలు అందరూ ఉద్యోగాలలో స్థిరపడ్డారు. మా మూడవ కుమారుడు చి॥ రమణకు మంచి ఉద్యోగము దొరకలేదు అనే చింత మా దంపతులలో చోటు చేసుకున్నది. అప్పటికే స్వామి మా ఇంట్లో దత్త భక్తులుగా వ్యవహరిస్తున్నారు. నేను, నా శ్రీమతి, స్వామి ముగ్గురం

శ్రీశైలం వెళ్ళాము. మల్లికార్జున స్వామివారికి మొక్కించి అభిషేకం చేయించి, భ్రమరాంబ తల్లి ఆలయంలో కుంకుమార్చన చేయించి, మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్ల దగ్గర కూర్చోపెట్టి మాకు దత్త మంత్రం ఉపదేశించి శ్రీసూక్త పారాయణం చేయించారు. ఈ ఆరాధనలన్నీ ప్రతిఫలాపేక్ష లేకుండా మాలో దత్త భక్తిని స్థాపించుటకే నన్నారు స్వామి. మరియు ఇలా వచించారు స్వామి "మీ కుమార్డు రమణకు మంచి ఉద్యోగం రాలేదనే చింత మిమ్ములను లోలోపల వేధిస్తోంది గదూ. సరే మీ రమణకు మంచి ఉద్యోగం ఇస్తాను మరి మీరు నావైపుకు పూర్తిగా తిరుగుతారా?" అన్నారు స్వామి. " అంతకంటేనా? స్వామీ! తప్పక తిరుగుతాము. మాకు ఇంక ఏ కోరికలు లేవు అన్నాము. ఆహా! ఎంతటి మహిమ! వెంటనే నెలలోగానే మా రమణకు జనచైతన్య హౌసింగ్ లిమిటెడ్‌లో ఉద్యోగం వచ్చి డిప్యూటీ జనరల్ మేనేజరుగా ఎదగటం స్వామి అనుగ్రహం కాకపోతే మరేమిటి? మేము ఏ చింతా లేకుండా విజయవాడ చేరి స్వామిసేవ చేసుకుంటూ, దత్తమందిరంలో అర్చనలు జరుపుకుంటూ మా శేషజీవితాన్ని ధన్యము చేసుకొనటం కూడా స్వామి అనుగ్రహమే.

మా కుమార్డు మా కోడలు హైదరాబాదులో స్వామి ఉన్నప్పుడు చక్కగా సేవ చేసుకునేవారు. స్వామి రమణను తాత్య అని సంబోధించేవారు కూడా. ఒకరోజు రమణ కుమార్డు పసివాడైన రామకృష్ణకు తీవ్రమైన జ్వరం వచ్చి ఒళ్ళు కాలిపోతోంది. మా కోడలు సుజాత తహతహలాడుచు కన్నీరు పెట్టు కుంటోంది. ముందు హాలులో పడుకున్న స్వామి లేచి వెళ్ళి పిల్లవానికి విభూతి పెట్టారు. అంతే! వాడి జ్వరం నిమ్మదించింది. పూర్తిగా ఆరోగ్యం చేకూరింది.

ఆ రోజుల్లో స్వామి భక్తులుగా వ్యవహరించేవారు కావున దైవాన్ని ప్రార్థించారు. ఈ రోజుల్లో దత్తునిగా ఫలప్రదాత తానేనని వ్యవహరిస్తున్నారు. ఈ తేడా స్వామిలో లేదు. ఈతేడా మా దృష్టిలో ఉంది. మేము భక్తుడనుకుంటే భక్తుడే. దత్తుడనుకుంటే దత్తుడే. అంతేకాదు. "నన్ను వంచకునిగా భావించువారికి వంచకునిగనే వ్యవహరిస్తాను" అంటారు స్వామి. యద్భావం తద్భవతి గదా!



## పుత్రుని అనుగ్రహించుట.

ప్రసాద్, విజయ (ధర్మపత్ని)

ప్రసాదు గారు విజయవాడలో స్టేటు బ్యాంకులో ఉద్యోగి. స్వామి భక్తుడు. పుత్రుని కొరకు స్వామిని ప్రార్థించగా స్వామి ఆశీర్వదించినారు. భార్య గర్భవతి యైనది. కానీ 4వ నెలలో గర్భము జారిపోయినది. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి భక్తుడైన ప్రసాదుగారు వెంకటేశ్వర స్వామి గుడిలో "ఇట్లేల చేసితివి"? అని బాధపడినారు. ఆ రోజు భజనకు రాగానే "మ్రొక్కిన వరమీని వేల్పు, గ్రక్కున విడువంగవలయు" అని గదా యీ మానవుల నీతి శాస్త్రము! స్వామి ఎవరికీ అపకారము చేయడు. వారి కర్మ ఫలాల ప్రకారమే జరుగును, ఫలమునిచ్చిన ప్రశంస. ఫలము జారినచో తిట్లు!" అని చెప్పి ప్రసాదుకు ఫలాన్ని ఆశీర్వదించి ఇచ్చినారు. ప్రసాదు గారి భార్య మరల గర్భవతియై ప్రసవ దినమున బిడ్డ అడ్డము తిరుగగా ఆపరేషను చేయవలసి వచ్చెను. ఆమె రక్తము గ్రూపు ఎచ్చట తిరిగినా దొరకలేదు. ఆ సమయమున అజయ్ అక్కడ ఉండెను. ఆ రోజు ఉదయం స్వామి అజయ్‌తో "ఎంత సంకటము వచ్చినా నేను రచించిన సంకటమోచన హనుమద్భజన చేసిన ఆ సంకటము విడిపోవును. ఇది ముమ్మాటికి సత్యము" అని చెప్పియున్నారు. అది గుర్తుకు వచ్చిన వెంటనే అజయ్‌గారు, ప్రసాదుగారు సంకటమోచన హనుమత్ భజన చేసిరి. ఆపరేషన్, రక్తము అవసరము లేకుండానే సుఖ ప్రసవమయ్యెను. పుత్రుడు జన్మించెను. ఎంతటి కరుణ! ప్రసాద్‌గారికి పుత్రభిక్ష పెట్టి ఆ దంపతులను అనుగ్రహించినారు స్వామి.

## రైలు ప్రమాదమునుండి రక్షించుట.

తిరుపతి నివాసి గంద్రకోట శివరామమూర్తి గారి యింట్లో స్వామి చేసే దత్త భజన జరుగుచున్నది. సరిగా ఉదయం 10 గం॥ అయింది. భజన చేయుచున్న స్వామి హఠాత్తుగా "దత్తుడిప్పుడు ఇక్కడ లేడు, ఎక్కడకో వెళ్లినాడు" అని మౌనంగా ఉన్నారు. అరగంట కన్నులు మూసుకున్నారు. ఏమీ అర్థంకాక అందరూ నిర్ఘాంత

పోయారు. 10-30 గం॥కు కన్నులు తెరిచి "ఇప్పుడు దత్తుడు వచ్చేశాడు, పని ముగిసింది" అన్నారు. అప్పటికి ఎవరికీ ఏమీ అర్ధము కాలేదు. ఆ రోజు సాయంత్రానికి శివరామమూర్తిగారి కుమార్డు గోపి ఇంటికి వచ్చినారు. అప్పుడు గానీ విషయం అర్ధంకాలేదు. గోపి ఇలా చెప్పసాగారు. ఆ రోజు ఆయన రైలులో ఉన్నారు తిరుపతి వస్తూ. సరిగా 10 గం॥కు రైలు ఆగింది. ఎవరో వ్యక్తి వచ్చి రైలును ఆపినాడు ఎర్రగుడ్డను ఊపుతూ. పట్టాలు కోసినారు దుండగులు! అని చెప్పి. 10.30 గం॥కు ఆ వ్యక్తి ఎటో పోయినాడు. ఆ పట్టాలు రిపేరు చేయించి రైలు వచ్చినందువల్ల చాలా ఆలస్యమైనది! స్వామి ఆ రూపంలో పోయి కాపాడినారని తేలినది. ఆ దంపతులు స్వామికి ఎంతో కృతజ్ఞత తెలిపినారు వారి పుత్రుని రక్షించినందులకు. వారు ధన్యులు.

## ఫణిని ఆవేశించి స్కూటరు నడుపుట.

ఫణి ఒకరోజు ఒక పరీక్ష వ్రాయబోతూ ఆ ముందు స్వామికి మనవి చేసుకున్నాడు. స్వామీ, ఆశీస్సుల నీయకుండా "కర్మ ఫలముల ననుభవించక తప్పదు. నేనేనిమియు జోక్యము చేసుకొనను. ఆ విధముగా యీ పరీక్షలో సాయపడలేను" అన్నారు. మరురోజు పరీక్షకు వెళ్ళి హాలులో కూర్చొనగానే ఫణికి విపరీతముగా జ్వరము వచ్చి బుద్ధి స్వాధీనము తప్పిపోయి పరీక్ష వ్రాయలేక వెంటనే బయటకు వచ్చినాడు. శరీరము కాని మనస్సు కానీ అతని స్వాధీనములో లేవు. స్వామిని ప్రార్థించాడు. "స్వామీ! నాకు ఒళ్ళు తెలియటంలేదు. కళ్ళు తిరుగుతున్నాయి. నీవే నా స్కూటరు నడపాలి స్వామీ! " అని స్కూటరుమీద బయలుదేరినాడు. స్వామి అతడిని ఆవేశించి వాని యింటివరకు తీసుకు వెళ్ళారు. ఫణి స్కూటరు దిగగానే ఫణి నుండి స్వామి తొలగినారు. అంతే! స్కూటరు ఒక వైపుకు ఫణి మరియొక వైపుకు పడిపోయినాడు. ఏమిటిది అని ఇంట్లో వారు చూచి, పరుగు పరుగున వచ్చి ఫణిని తీసుకొని వెళ్ళి ఆసుపత్రిలో చేర్చారు. స్వామి అనుగ్రహంవలన ఫణి క్రమముగ స్వస్థుడయ్యెను. "ఫణి ఏ పరిస్థితిలో ఉన్నాడో తెలియజేయుటకే అట్లు చేసినాను. స్కూటరు దిగగానే పడిపోయేవాడు స్కూటరు నడుపగలడా"? అన్నారు స్వామి. ఏమీ! నేను ఉపేక్షింతునా? అన్న శ్రీ దత్త ప్రభువుల దివ్యవాణి సార్ధకము గదా!.



పూర్ణ

## శ్రీ సాయియే

రాజమండ్రిలో పూర్ణ స్వామి భక్తురాలు. స్వామిని దర్శించక చాలా కాలమైనందున, స్వామిని దర్శిస్తానని ఫోన్‌లో సోమవారం అడిగింది. రాజమండ్రికి వచ్చిన స్వామి బుధవారం రమ్మన్నారు. కానీ, మంగళవారం ఒక షిరిడీసాయి భక్తురాలి వద్దకు పూర్ణ వెళ్ళినది. ఆ భక్తురాలిని షిరిడీ సాయి ఆవేశిస్తారు. బుధవారం స్వామిని దర్శించటానికి పోతున్నానని చెప్పింది. "సరే పొమ్ము స్వామి దర్శనమిస్తాడు. కానీ ఇక నుండి నీ పూజా మందిరంలోనే కూర్చుని ధ్యానించుము. స్వామి అంతటా ఉన్నాడు" అని ఆ భక్తురాలి ద్వారా అన్నారుట. పూర్ణ సరేనని అలానే స్వామి కోసం ఇంటి గడప దాటనని చెప్పింది. వాగ్దానమును చేయమన్నారుట షిరిడీశాయి. అలానే చేసి పూర్ణ బుధవారం స్వామిని దర్శించటానికి వచ్చింది. పూర్ణను చూడగానే స్వామి తన ఫొటోనిచ్చి పూజించమని చెప్పుతూ "ఇక నుండి నా వద్దకు రానవసరము లేదు. ఇంటి గడప దాటపని లేదు. నీ పూజా మందిరంలోనే స్వామి ఉన్నారు. కృష్ణదత్తునికి, షిరిడీ సాయికి భేదములేదు. సాయికి వాగ్దానము చేస్తే కృష్ణదత్తునికి వాగ్దానం చేసినట్లే. ఇరువురు పరమాత్మలు లేరు. ఒక్కడే పరమాత్మ" అని చెప్పినారు. ఇన్ని సంవత్సరాలలో స్వామి ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు. అని మొదట పూర్ణ ఆశ్చర్యపడినా, క్రిందటి రోజు షిరిడీ సాయికి చేసిన వాగ్దానమును గుర్తు తెచ్చుకుని స్వామి సర్వజ్ఞత్వమును స్తుతించినది.



శ్రీ ప్రభాకర్, శ్రీమతి బాల
(భక్తులు)



శ్రీ రమేష్, శ్రీమతి శృతకీర్తి
(భక్తులు)



## ఉద్యోగమును రక్షించుట.

అజయ్ అన్నగారు

అజయ్‌గారు ఒకనాడు వారి అన్నగారిని వెంటపెట్టుకొని వచ్చి స్వామి పాదాలకు నమస్కరించి "స్వామీ! మిమ్ములను ఏ కోరిక అడగలేదు. మా అన్నయ్యగారు వీరు. వీరిని హఠాత్తుగా ఉద్యోగమునుండి నిష్కారణంగా పొమ్మని యజమాని చెప్పినాడు, మీరే రక్షించాలి" అన్నారు. "సరే మీ అన్నగారి విషయం మా అన్నగారైన హనుమంతునికి చెపుతాను" అని అన్నారు కనులు మూసుకొని. తరువాత "మా అన్నగారు మీ అన్నగారి వద్దనే తప్పు ఉన్నదని అంటున్నారు. అడగండి" అని స్వామి అనగా, అజయ్‌గారు తన అన్నగారి నుండి మెల్లగా విషయాన్ని రాబట్టినారు. ఆయన అన్నగారే యజమానితో "నీవు జీతం పెంచకున్నచో వెళ్ళిపోతాను" అని బెదిరించగా యజమాని పొమ్మన్నాడే తప్ప నిష్కారణంగా అనలేదు అని తేలింది! కానీ యజమాని చాలా మొండివాడు మరలపోయి అడిగితే వినడు" అని అజయ్ అన్నగారు మరల పోవుటకు భయపడినారు. స్వామి "పొమ్ము నీ యజమానికి మా అన్న హనుమన్న చెప్పి వచ్చినాడు" అన్నారు. అజయ్ అన్నగారు వెళ్ళి అడిగినారు. **యజమాని "అలానే మీ ఉద్యోగం మీరు చేసుకోండి"** అని ప్రశాంతముగా సమాధానము నిచ్చాడు. **ఎంత విచిత్రము!**


## స్వామి శ్రీ నరసింహ సరస్వతియే

ఆ రోజు శ్రీ నరసింహ సరస్వతి శ్రీశైలంలో కృష్ణానదిలో కలిసిపోయిన పుణ్యదినము. స్వామి ఆ రోజంతా దాదాపు శ్రీ దత్త భజనలు పాడుతూనే ఉన్నారు. మధ్యాహ్నం 12 గం|| అయింది. శ్రీ నరసింహ సరస్వతి మధ్యాహ్న భిక్ష సమయమయింది. స్వామి కోసం ప్రత్యేకంగా సీతమ్మగారు గిద్దెడు బియ్యంతో అన్నం వండింది. (స్వామి అన్నం స్వల్పంగా తింటారు). భక్తులంతా ఇళ్ళకు పోయి భోజనాలు చేసి వస్తామన్నారు. "ప్రసాదం తిని వెళ్ళండి" అని స్వామి భాస్కరశర్మ సమారాధన కథను (గురుచరిత్రలోనిది) మనోరంజకంగా చెపుతూ "శ్రీ నరసింహ సరస్వతి ఇలా

తమ శాలువను, గిద్దెడు బియ్యం అన్నం కల చిన్న **పాత్రపైకి విసిరినారు**". అంటూ చేతులను వంటయింటిలోని అన్నం పాత్రమీదకు **విసిరినట్లుగా చూపించినారు**. సీతమ్మగారు స్వామికి ఆ అన్న పాత్రలో నుండి వడ్డిస్తూనే **ఉంది - అన్నం అక్షయంగా** వస్తూనే ఉన్నది! స్వామి ముద్దలు చేసి 18 మంది భక్తులకు **పెడుతూనేఉన్నారు**. చివరకు పెరుగు అన్నము నిమిత్తంగా అన్నం వడ్డించటంతో **పాత్ర ఖాళీ అయింది!** స్వామి దత్తావతారులే కదా! అన్నాన్ని అక్షయం చేయటం వారి **అనంత శక్తికి** సాధ్యమేకదా! స్వామి సాక్షాత్తు నృసింహసరస్వతియే అని నిరూపించారు.

## అరచేతినుండి వాసనలను చూపుట.

స్వామి ఒకసారి ఉదయంనుండి ఉపవాసమున్ననాడు సాయంత్రం మా పెద్దకోడలు శ్రీ లక్ష్మి స్వామిని భోజనం చేయమని బలవంతం చేయగా ఇప్పుడే సాంబారన్నం ఒక భక్తుడు నివేదించగా తినివస్తున్నానని శ్రీ లక్ష్మికి అరచేతిని వాసన చూపించినారు. సాంబారు అన్నం వాసన స్పష్టంగా ఘుమఘుమలాడుతూ వెలువడినది. ఇదే విధంగా చేతినుండి అజయ్‌గారికి ఒకనాడు సాంబారన్నంవాసన మరోనాడు పెరుగన్నం వాసన **చూపించినారు. స్వామి ఉదయంనుండి ఏ ఆహారం స్వీకరించకుండానే!. ఎంతటి మహిమ!**



**శేషమ్మ,**
సుబ్బారావుగారు
(గాయత్రి తల్లిదండ్రులు)

## సర్వజ్ఞత.

కువైట్‌నుండి చి॥సౌ॥ గాయత్రి ఆమె తల్లిగారికి ఫోన్ చేసింది (ఈమె మరియు యీమె భర్త చంద్రశేఖర్ గారు దత్తవేదం తృతీయ ముద్రణం చేసి ప్రచారం చేసిన ధన్యులు). తమ పుత్రిక సరిగా చదవటంలేదని, స్వామికి చెప్పమని. ఆమె తల్లిగారు ఆ విషయం చెప్పటానికి వచ్చింది. ఆమె చెప్పకుండానే, స్వామి ఆ రోజు సరస్వతీమాత మీద ఆశువుగా, ఆద్భుతమైన భజన "భజరే వీణా పాణిం" పల్లవితో పాడినారు. స్వామి ఆనాటి వరకు సరస్వతి దేవిపై ఎప్పుడూ భజన చెప్పలేదు. గాయత్రి తల్లి గారు విషయం చెప్పగా స్వామి "ఇంతవరకూ ఏనాడు సరస్వతిని స్తుతించని నేను యీనాడు ఎందుకు యీ భజన చెప్పాను? మీ గాయత్రి ఫోన్ చేసిన విషయము గుర్తించియేగదా. భజరే వీణాపాణిం అని నేను యిప్పుడు పాడిన

భజన పల్లవి అర్థము ఏమిటి? సరస్వతీ దేవిని ప్రార్థించుము అనియే గదా. ఆ సందేశమునే మీ అమ్మాయికి చెప్పండి" అన్నారు స్వామి. ఫెయిల్ అవుతుంది అనుకున్న ఆ అమ్మాయి ఫస్టుక్లాసులో ఉత్తీర్ణురాలైనది.!

## సూర్యుని కనుమరుగు చేయుట.

2002 సం॥ ఏప్రియల్ 28వ తేది, అనేక భక్తుల సమూహంలో స్వామి కృష్ణలంకలో మా ఇంట్లో దత్త నిలయంలో బ్రహ్మయజ్ఞమును చేసినారు. అనాటి ఉపన్యాసములో యజ్ఞస్వరూపాన్ని ఎంతో ఆశ్చర్యకరమైన వేద రహస్యాలతో వివరించినారు. అది ఎండా కాలం గదా. యజ్ఞ సమయంలో సూర్యుని ఎండ తీవ్రతకు అందరు భయపడినారు. కానీ స్వామి సూర్యుని వైపుకు తీక్ష్ణంగా చూశారు. అంతే! కారుమేఘాలు కమ్మి సూర్యుడు మబ్బులచాటుకు పోయినాడు! అందరూ యజ్ఞం ముగిసి ఇళ్ళకు చేరిన తర్వాత సూర్యదేవుని ప్రతాపంసాగింది.

"సూర్యుడు కూడా యీ విశిష్ట యజ్ఞాన్ని చూడాలని ఆరాటపడటంవలన సరేనన్నాను. అందుకే యజ్ఞ సమయంలో కొంతసేపు చూడనిచ్చాను. స్వామి కార్యానికి సూర్యుడెందుకు సహకరించడు? ఎండ ఎండ అని మీరు విశ్వాసం లేక గోల చేశారు". "భీషోదేతి సూర్యః" అని శ్రుతిగదా. పరబ్రహ్మ భయముతో సూర్యుడు ఉదయించుచున్నాడని కదా అవి అన్నారు స్వామి. ఆనాడు శ్రీ కృష్ణ పరమాత్మ సూర్యునికి తన చక్రము నద్దు వేయుట గుర్తుకు రావటంలేదా!.

## ఒకే సమయంలో రెండు ప్రదేశములందుండుట.

2001 సం॥ దత్తజయంతినాడు ఒకపెద్ద కుక్క పైకి హుటాహుటిగా వచ్చి స్వామి పాదాలపై తల ఉంచి నమస్కరించి ప్రదక్షిణము కావించి, స్వామి పాదాలవద్ద కూర్చున్నది. ఆ విచిత్రాన్ని ఫొటో కూడా తీశారు. ఆ ఫొటోను చూచి స్వామి ధర్మపత్ని కుమారి వేళాకోళంగా స్వామితో "ఈ విధంగా కుక్కను కూర్చుండ బెట్టుటకు

మీ భక్తులు ఈ కుక్క చేత ఎన్నాళ్ళు రిహార్సల్సు చేయించారో!" అన్నారు. స్వామి యధా ప్రకారంగా చిరునవ్వు చిందించారు.

డిసెంబరు 21 కాలేజీ వార్షికోత్సవము. మరునాడు పగలు గుంటూరులో ఉండి సాయంత్రం 6 గం॥ కు ఇంటికి వస్తున్నానని స్వామి యింటికి ఫోన్ చేశారు. కానీ మరునాడు కాలేజీకి సెలవు యివ్వనందున స్వామి మరునాడు సాయంత్రం 6గం॥ గుంటూరులో ఉండిపోయినారు. 40 మంది సమూహానికి 6గం॥ - 8గం॥ వరకు స్వామి ఉపన్యాసమిచ్చినారు. అదేరోజు అదే సమయమున తాను ఫోన్‌చేసిన ప్రకారముగా నరసారావుపేటలో స్వామి యింటికి వచ్చియున్నారు! ఇంట్లో అందరూ చూసినారు. స్వామి హఠాత్తుగా బయటనుండి మాయమైనారు. నరసారావుపేటలో ఒక కాలేజీ వార్షికోత్సవం ఆనాడు. దానికి వెళ్ళినారని అందరూ భావించినారు. ఇక్కడ గుంటూరులో స్వామి ఆ రోజు నిద్రించి (22 వ తేదీ), 23వ తేదీ ఉదయం ఇంటికి వచ్చినారు. "నిన్న రాత్రి చెప్పకుండా ఎక్కడికి వెళ్ళినారు?" అని కుమారి ప్రశ్నించుట, స్వామి ఆ సమయంలో గుంటూరులో ఉన్నానని నిరూపించుటతో కుమారి ఆశ్చర్యంతో నిర్ఘాంత పోయినారు! స్వామి చిరునవ్వుతో "ఇదీ రిహార్సల్ అంటావా?" అని కుమారిని అడిగినారు.

## సరిత అనుభవము.

గుంటూరులో లలితా భక్తురాలైన సరితగారు ఒకనాడు బాగా దు:ఖించుచుండగా, స్వామి ఆమెకు సాక్షాత్కరించి "నేనున్నానుగా" అని పలికి వీపుమీద బాగా చరిచినారట. ఆమె ఫోను చేసి చెప్పగా స్వామి "గట్టిగా చరిచినాను. నెప్పిపుట్టినదా" అని అడుగగా ఆమె "అవును స్వామీ, ఆ మంట చాలాసేపు ఉన్నది"అన్నారు. స్వామి నవ్వుతూ సారీ చెప్పినారు!

## సర్వ వ్యాపియే.

కృష్ణలంకలో సుజాత, సుమతి, సుందరి అను భక్తులు స్వామిపై పూర్ణ విశ్వాసమున్నవారు. సుజాత తల్లిగారు స్వామిని దర్శించిన (కృష్ణ భక్తురాలు) ప్రతిసారీ

"సమయానికి తగు మాటలాడెనే" అనే పాటను స్వామితో పాడించుకొని ఆనందించేది. ఆమె యింట్లో వివాహమునకు రమ్మని స్వామిని అర్థించినది. కానీ స్వామి రాలేదు. ఆమె ఎంతో బాధతో మనస్సులో స్వామి రాలేదని ఆలోచిస్తూ కూర్చున్నది. ఆ సమయంలో మేళగాళ్ళు కూర్చుని ఏవో పిచ్చాపాటి మాటలాడుకుంటున్న వారల్లా హఠాత్తుగా లేచి వాద్యములను తీసుకొని "సమయానికి" అనే కీర్తనను అద్భుతంగా వాయించినారు. ఆమె దానితో స్వామి వచ్చారని సంతృప్తి చెందినది. అయినా, సుజాత మాత్రము భోజన సమయంలో స్వామి రాలేదని బాధపడెను. వెంటనే ఆమె నుదుటి మీద ఎర్రని కుంకుమరేఖ తిలకము గోచరించెను. స్వామి ఎప్పుడూ భక్తులకు అలానే తిలకమును పెట్టుతారు. ఆమె కుమారుడు మౌళి వెంటనే " అమ్మా! స్వామి వచ్చారా? నీ నుదుటిపై కుంకుమరేఖ పొడవుగా ఉన్నదే" అని స్వామి వచ్చినారన్న విషయమును సూచించినాడు. అలా మౌళి ద్వారా మాటలాడినది స్వామియేగదా. సుజాత నమ్మలేక అద్దము చూసుకొన్నది. పరమానంద భరితురాలైనది.

ఒకసారి సుమతికి శ్రీ వెంకటేశ్వర విగ్రహములో స్పష్టంగా స్వామి కనపడినారట. ఎంతో సంతోషించినది.

ఒకసారి సుందరి నరసరావుపేటకు పెండ్లి పిలుపుతో బయలుదేరి స్వామికి నమస్కరించగా "నీవు పోవలసినదేనా? ఏదో ఒక సాకుతో యీ ప్రయాణము మానుకోరాదా?" అన్నారు. "సరే పొమ్ము" అని మరల కొంత ఆలోచించి అన్నారు. వెళ్ళిన సుందరి మేడమెట్లు మీద జారిపడగా కాలికి దెబ్బ తగిలింది. అయితే అచట ఒక దత్త భక్తునితో దత్త సత్సంగము నిర్విరామంగా జరిగి ఎంతో ఆనందించినది. స్వామి చెప్పినారు తరువాత " నిన్ను ఆపితే యీ కర్మ ఫలం వడ్డీతో మరు జన్మలో యాక్సిడెంటు వలన కాలు పూర్తిగా విరిగిపోవును. మరియు ఆ సత్సంగము జారి పోవునుకదా అని పొమ్మన్నాను".



ఆంజనేయులు, సుజాత



డి. ప్రసాద్, సుందరి



ప్రభాకర్, మాలతి

## రుద్రాభిషేక ప్రభావము.

నాగులవరం గ్రామంలో స్వామి 15 సం॥ వయస్సుగల బాలుడుగా ఉన్నప్పుడు ఒక సంవత్సరము కరువు వచ్చెను. వాన చినుకు కూడ పడదయ్యెను. ఊరిలోని బ్రాహ్మణులు పూజలు, అభిషేకములను చేసినా ఉపయోగము కనపడలేదు. ఒకరైతు స్వామితో "ఏం బాపనోళ్ళయ్యా? పూజలు, జపాలు చేసినా చినుకు పడలేదు" అని నిందించగా స్వామి బాధపడుచూ స్వయముగా ఉదయము నుండి బావిలోని జలముతో రుద్రాభిషేకమును చేయ ప్రారంభించెను. సాయంత్రము 3 గం॥ అయినది. స్వామి అభిషేకమును ఆపడు. వాన చినుకు పడదయ్యెను. స్వామి పెదనాన్నగారు వచ్చి "నాయనా! లేచి భోజనము చేయరా! అంత పట్టుపట్టరాదురా" అని బ్రతిమలాడెను. కానీ స్వామి ఆ మాటను వినకుండ అభిషేకమును సాగించెను. సాయంత్రము 4 గం॥ అయినది. అద్భుతం! ఆకాశమున కాల మేఘములు ఆవిర్భవించి వర్షము ఆరంభమయ్యెను. అప్పటికి గానీ స్వామి లేచి భోజనము చేయలేదు. ఆ వర్షము కుంభవృష్టియై చెరువు నిండి అలుగులు వారెను. దీని భావమేమనగా చేసే పూజలలో భక్తి ప్రధానమని స్వామి అందరికీ బోధించెను. "భక్తి లేక వృధ పూజలు జపములు – ప్రేమయె మార్గము ఓరన్నా" అని స్వామి భజన పాటలోని చరణమును స్మరింతుముగాక.

## నాటి కృష్ణుడే.

స్వామి 18 సం॥ వయస్సులో నున్నప్పుడు తల్లి, మేనత్తలతో కలసి తీర్థ యాత్రలకు వెళ్ళినారు. బృందావనంలో స్వామి చెట్లు మీదకు ఎక్కి కొమ్మలపై కూర్చుని, ఆనందముతో మురళిని వాయించినారు. ఎంత సేపటికి దిగిరాలేదు. గుడికి పోవలెనని ఆదుర్దాలో తల్లి మేనత్తలిద్దరూ స్వామిని దిగి రమ్మన్నారు. స్వామి వారితో "నన్ను చూడలేని వారు నా విగ్రహమును చూడగలరా" అని నవ్వుతూ అన్నారు. "వీడితో ఎందుకు?" అని అనుకుని ఇరువురు గుడికి పోయినారు. సాయంత్రం 4 గం॥ లకే గుడి తెరుస్తారని తొందరతొందరగా గుడికి చేరారే గానీ

ఏమి లాభం. ఆ రోజున గుడి తలుపులు తెరవనేలేదు. 6 గం॥ల వరకు వేచివేచి విసుగుపుట్టి తిరిగి బృందావనం వద్దకు వచ్చారు. స్వామి మురళీ గాన నిమగ్నులై ఉన్నారు. అక్కడే 7 గం॥ లయింది. స్వామి దిగి వచ్చి "పదండి గుడి తలుపులు తెరిచినారు" అని గుడి వద్దకు తీసుకువెళ్ళినారు. అదే సమయంలో అర్చకుడు వచ్చి గుడి తలుపులు తెరుస్తున్నాడు. ఇద్దరూ అర్చకుడిని ఆ రోజు ఆలస్యానికి కారణమడిగినారు. అర్చకుడు పొరుగూరు పోయినాననియు, 4 గం॥లకు మరొకరిని ఏర్పాటు చేయగా అతడును హఠాత్తుగా వేరొక పని మీద పోయినందున అట్లు జరిగినదనియు చెప్పినాడు! దీని ద్వారా నరావతారము, విగ్రహాదుల కన్నను సంపూర్ణమైనది అని స్వామి ఈనాడు చెప్పు సిద్ధాంతము అనాడే నిరూపితమైనదిగదా!

## మహిమల గురించి బోధ.

నేను నా శ్రీమతి ఒకనాటి రాత్రి ఎంతో ఖేదంతో స్వామిని యిలా అడిగినాము "స్వామీ! మీరు అందరికీ మహిమలను చూపిస్తున్నారు మాకు తప్ప. మేము దత్త సేవ ఎంతో చేస్తున్నామని మీరే పొగుడుతుంటారు అందరి ముందు! మాపై ఏల యీచిన్న చూపు? మాకేల మహిమను చూపరు?" అని. స్వామి చిరునవ్వుతో యిలా అన్నారు. "కాలభైరవుడు వ్రాసిన ప్రణాళిక పత్రం ప్రకారమే అంతా జరుగుతుంది. మీకు అంతిమ క్షణంలో మా దర్శనం వల్ల మా స్మరణం కలిగి మీరు ముక్తులౌతారు. అయితే ఆ క్షణం తరువాత దర్శనం కలిగిందనీ, కలుగలేదనీ చెప్పే అవకాశము ఉండదు. కావున సంశయము రావచ్చును. నేను కాలభైరవుని ఒప్పిస్తాను. ఆ దత్త దర్శనం యీ క్షణంలోనే యిస్తాను". అన్నారు స్వామి.

దానికి మేము యిలా అన్నాము. "వద్దు స్వామీ! మీపై మాకు పూర్ణ విశ్వాసమున్నది. అంత్యక్షణ దర్శనము ముక్తిదాయకము. దానిని యిప్పుడే పొంది ముక్తిని పోగొట్టుకొన జాలము" అని అన్నాము. అప్పుడు స్వామి ఇలా అన్నారు "శంకరాచార్యులు తలుపులు మూసి ఉన్నాలోపలకు ప్రవేశించినారు. దానిని చూసి శ్రాద్ధము పెట్టుచున్న మండనమిశ్రుడు కానీ, భోక్తలుగా వచ్చిన వ్యాస జైమినులు కానీ శంకరులను గౌరవింపలేదు. మహిమలు వారికి బ్రహ్మవిద్యకావు. రాక్షసులు,

క్షుద్ర మాంత్రికులు సైతము వాటిని ప్రదర్శింతురు. శంకరులు చేసిన 21 రోజుల జ్ఞాన చర్చకు వారు ముగ్ధులైనారు. మండనమిశ్రుడు పాదాక్రాంతుడై శిష్యుడైనాడు. కావున జ్ఞాన రత్నముల ముందు మహిమలు గులకరాళ్ళు. మీకు నేను ఎల్లప్పుడును జ్ఞానరత్నములనే యిచ్చి యున్నాను. మీ చేత జ్ఞాన ప్రచారమునే చేయించి ఉన్నాను. మీ స్థాయి అది అని తెలుసుకొనుడు. మీరు నేనిచ్చిన రత్నరాశులకు ఆనందము చెందక, గులకరాళ్ళ కోసము అర్థించినచో ఎంత పామర స్థాయికి వస్తారో ఆలోచించుకొనుడు. విష్ణుదత్తుడవై, శ్రీ నరసింహ సరస్వతి శిష్యుడవైన నీ స్థాయి ఎంత ఉన్నత స్థాయి! భక్తి జ్ఞాన ప్రచారమునకే నిన్ను నేను అవతరింప చేసితినని తెలియుము" స్వామి వాగమృత గంగాధారతో మాకున్న కాస్త భ్రమ తొలగిపోయినది. శంకరాచార్యుల కులచాదస్త భ్రమను స్వామి కాశీలో తొలగించిన గురువుల గురువు కదా! మా కర్తవ్యమును తెలుసుకొని నాటినుండి జ్ఞాన - భక్తి ప్రచారములను తీవ్రముగా చేయుచున్నాము. మేము ధన్యులమైతిమి.

## గోలోకమును చూపించుట.

చంద్రశేఖర్‌గారు, గాయత్రిగారు, వారి పిల్లలు ప్రియాంక, మానసలతో స్వామిని దర్శించుటకు కువైట్ నుండి వచ్చినారు. చంద్రశేఖర్ వారి మొదటి అనుభవమును ఇట్లు వచించినారు. "స్వామికి ఫోన్ ఎన్నిసార్లు చేసినా, వేలలో కావలసిన బిల్లులు, 5-10 రూ॥ లలోనే వచ్చినవి!" స్వామి, ఆ కుటుంబముతో కోట్ల జన్మల బంధమున్నదని చెప్పినారు. ఆ కుటుంబము కూడ స్వామిపై అట్లే అపార ప్రేమతో ఉండిరి. స్వామి, వారితో 24 రోజులు రాత్రులంతా మేల్కొని భాషించినారంటే స్వామి ప్రేమ వర్ణనాతీతము కదా!

ఇక గాయత్రి గారు స్వామి భక్తిలో పరాకాష్ఠకు చేరియున్న మహాభక్తురాలు. ప్రియాంకను మీరావేషంలో ఫొటో తీయమన్నారు స్వామి. అంతా సిద్ధమైనది. స్వామి కృష్ణ కీర్తన పాడినారు. అంతే! ప్రియాంక అలౌకికమైన సమాధి స్థితిని పొందినది. స్వామి పాడిన మొదటి చరణంలోనే! రెండవ చరణము కూడా

వినిపించలేదట. ఆమె శబ్దము వినపడని స్థితిలోనికి పోయినది. కొంత సమయము తరువాత లౌకిక స్థితిలోనికి వచ్చినది ప్రియాంక. ప్రియాంక ఏమీ చెప్పకముందే స్వామి "ఈమెను గోలోకానికి తీసుకపోయాను. ఆకాశమును దాటి తరువాత చీకటిలోనికి ప్రవేశించినది. అదే విశ్వలయస్థితి. ఆ తరువాత, అద్వైతానంద యోగిరాజ దత్తలోకమైన సత్య బ్రహ్మలోకము. దానిపైనున్నది గోలోకము. ఆ గోలోకము మాధుర్యమిళితమైన బ్రహ్మానందముతో నుండు రాధాకృష్ణ లోకము. ప్రియాంక సత్యలోకమును దాటి రెప్పపాటు కాలము మాత్రమే అక్కడ ఉన్నది. మరొక రెప్పపాటు కాలము అచటనున్నచో మరల తిరిగిరాదు. అందుకే, పైకి పోవునపుడు (ఆరోహణము) మధ్య స్థితులు ఆమెకు గోచరించినా, దిగి వచ్చునపుడు (అవరోహణము) ఎంతో వేగంగా వచ్చినందున మధ్య స్థితులు గోచరించలేదు" అని అన్నారు. ప్రియాంక అనుభవాన్ని యిలా చెప్పింది. "స్వామి చెప్పినది సత్యము. స్వామి పాడిన పాటలో మొదటి చరణం తరువాత ఏ శబ్దము వినపడని స్థితిలో ఆకాశాన్ని దాటి పోయాను ("శబ్దగుణక మాకాశం" - శబ్దము ఆకాశగుణము అన్నారు స్వామి). ఆ తరువాత గాఢాంధకారము. హృదయమంతా ఎంతో బరువెక్కింది. ఎంతో మాధుర్యం గల ఆనందాన్ని రుచి చూశాను. తిరిగిరావటం హఠాత్తుగా వచ్చాను. వచ్చిన తరువాత యీ లోకం అంతా కలుషితమైన చెత్త కుండిలాగా, మనుష్యులందరు ఈగల్లాగా కనిపించినారు" అని చెపుతూ, స్వామితో "ఎందుకు తీసుక వచ్చారు నన్ను కిందకు?" అని దెబ్బలాడింది. "24 రాత్రులు నీవు స్వామి వైపే చూస్తూ అశ్రుధారలతో తపస్సు చేశావు. అందుకే ఆ ఫలాన్ని యిచ్చాను. గోలోకం పైన లోకంలేదు. అది అత్యుత్తమ ఫలము. ఈ అవతారంలో నేనింతవరకు యీ అత్యుత్తమ ఫలాన్ని ఎవరికీ యివ్వలేదు. ఆధ్యాత్మికంలో అత్యుత్తమ ఫలాన్ని పొందినావు. అలానే ఐహికంలో నీ కర్తవ్యాలను నెరవేర్చుటంలో కూడా ప్రథమ స్థానాన్ని పొందు" అని ఆశీర్వదించారు కువైట్‌లో 11వ తరగతి చదువుచున్న ప్రియాంకను స్వామి.



శ్రీ సాయినాథ్, మంజుల



శ్రీ సీతారామస్వామి, శ్రీమతి సీతారావమ్మ
(భక్తులు)

# ఇటీవలి సంఘటనలు.

**26-09-2002** గురువారము రాత్రి మంగళగిరిలో సీతమ్మగారింటికి వచ్చారు స్వామి. సీతమ్మగారి కోడలు భావన విపరీతమైన శిరోవేదనతో మధ్యాహ్నం నుండి విలవిలలాడుతూ ఏడుస్తున్నది. ఔషధములు పని చేయలేదు. స్వామి వారు తన సంచిలోనుండి శొంఠి కొమ్మును సాది గంధమును తలకు వ్రాయమన్నారు. సీతమ్మగారు శొంఠి గంధమును తీయుచున్నది. భావన వచ్చి తన పాదాలకు నమస్కరించింది. స్వామి విభూతిని నుదుటికి వ్రాసినారు. వెంటనే శిరోవేదన అదృశ్యమైనది. భావన "శొంఠి గంధం తీయ వద్దు, నెప్పి పోయింది" అని సంతోషముతో కేకలు పెట్టసాగింది. అప్పుడు స్వామి అన్నారు. "ఆపవద్దు. శొంఠి గంధమును తీయండి. నాకు విపరీతమైన శిరోవేదనగా ఉంది" అన్నారు. భావన దీనంగా "స్వామీ! నా తలనొప్పిని తీసుకున్నారా?" అన్నది. స్వామి "అవును. ఎవరో ఒకరు అనుభవించ వలసినదే. నీకు జరిమానా శిక్ష పడినపుడు నీవు కట్టలేక బాధపడుచున్నచో, నీవారు దానిని కట్టి నిన్ను విడిపించుచున్నారు గదా. అలానే, స్వామియు తన భక్తుల కర్మ ఫలాలను తాను అనుభవించి వారిని కర్మ విముక్తులను చేయుచున్నాడే తప్ప వాటిని రద్దు చేయడు. ఈ రహస్యమును తెలియని వారు స్వామి తన అధికార శక్తితో మన కర్మఫలములగు కష్టములను రద్దు చేసినాడని భావించుచున్నారు" అని బోధించినారు.

**02-10-2002** రెండు నెలలనుండి వాన చుక్కలేదు. "భగవంతుని విస్మరించినందున వానలు పడవని ఒక ఎద్దు మనుష్యభాషలో మాట్లాడి మరణించినది" అని నరసారావుపేటలో ఒక వార్త బయలుదేరినది. స్వామి " అది కాలభైరవుని శాసనము" అని పలికినారు.

స్వామి గతంలో విజయవాడలో గ్రీష్మ ప్రతాపమును శమింపచేయుటకు వరుసగా 2 సం॥లు భజన చేయించి అప్పటికప్పుడే వర్షమును కురిపించుట యీ గ్రంధములో వివరించినాము గదా. ఆ సమయంలో "కాల కర్మ చక్రాలలో ఇక జోక్యం చేసుకోనని, అది సరియైనది కాదు" అని భక్తులకు హితవు చెప్పినారని చెప్పినాముగదా.

భక్తులు వర్షంకోసం తహతహలాడుచున్నారు. స్వామి తాను జోక్యం చేసుకోనన్న మాట తప్పరు. ఈ సమస్యకు పరిష్కారాన్ని ఆలోచించినారు. స్వామి ఒక నిర్ణయానికి వచ్చినట్లు గోచరించినారు. వెంటనే భక్తులచేత "శ్రీ దత్తదేవం........" భజన తోను భవాని శంకర నామాల భజనతోను, శివలింగమునకు అభిషేకము చేయించినారు ఆజ్ఞ ఇచ్చినారు స్వామి. భజన పూర్తికాగానే స్వామి కాలభైరవునితో వాదించిన ప్రకారమిట్లున్నది. (స్వామి చెప్పినది).

<u>కాలభైరవ</u> స్వామీ, మీరు కాల కర్మలలో జోక్యం చేసుకొనునని మాట యిచ్చి, మరల ఇదేమి? ఇలా చేసినారు. నేను ఆ వృషభరూపంలో వానలు కురవవని ప్రకటించినాను గదా! ఏమిటి స్వామీ?

<u>స్వామి</u> వెనుక నేను చేసిన భజనకుగదా వర్షము వచ్చినది. ఇప్పుడు భజన నేను చేయలేదు కదా. కావున నేను మాట తప్పలేదు. అయితే, నా భక్తుల భజనకు యిప్పుడు ఫలము రావలయునుగదా. నాకన్న, నాకు నా భక్తులెక్కువని నీకు తెలియని విషయమా? భక్తుల పరాభవమును నేను సహించలేను గదా. స్వామి భక్తుడవైన నీవు యీ విషయమును కొంచెం ఆలోచించకున్న ఎట్లు?

ఈ వాదనతో కాలభైరవుడు చాల ఆనందించినాడు. అప్పుడే వర్షము పడినది హఠాత్తుగా వచ్చిన మెరుపులతో! అప్పటినుండి వర్షాలు ప్రారంభమైనవి.

భజన సమయంలో సీతమ్మగారికి స్వామి సింహాసనాసీనుడై విష్ణు వేషంలో కనపడి చేతినుండి ప్రవహించు గంగతో శివలింగమునకు అభిషేకము చేయుచున్నట్లును, శంకరుడు గౌరితో సుబ్రహ్మణ్యునితో " ఆ భజన ఎంతబాగున్నదో చూడండి" అని చెప్పుచున్నట్లు కనిపించినది. ఆమె మిగిలిన భక్తులకు చెప్పగా విని ఆనందంతో, ఆ అమృత వర్షంలో తడుస్తూ "శ్రీ దత్త దేవం...." భజన పాడుతూ నృత్యము చేసినారు!

**29-09-2002** నరసరావుపేట, బ్యాంక్ కాలనీ వాస్తవ్యురాలు శ్రీమతి భారతీదేవి ఆల్ ఇండియా రేడియో ఆర్టిస్టు. అమె స్వామి ఇంటికి ప్రతి ఆదివారము సత్సంగాలకు వచ్చేది. ఆమె స్వామితో ఒక వారము "స్వామీ! మీరు విజయవాడ భక్తులకేనా మహిమలు చూపుట. మాకు చూపరా?" అని దెబ్బలాడినది. అప్పుడు స్వామి చిరునవ్వు నవ్వినారు. అంతే! ఆమెకు స్వామి హృదయంమీద దివ్యకాంతితో శివలింగం దర్శనమిచ్చినది. ఆ లింగము పెరుగసాగినది. స్వామి ధరించిన లాల్చీ హృదయము మీద ఎత్తుగా లేచినది. ఆ అద్భుత దర్శనంతో ఆమె స్తంభించి లేచి స్వామి ముఖమును చూచినది. స్వామి ముఖము మీద 3 కాంతి చారలు కనిపించి క్రమంగా 3 ముఖాలు కనిపించినవి దివ్య తేజస్సుతో! దానితో ఆమె పరవశించి నమస్కరిద్దామనుకొను చుండగా, స్వామి చేతిలో పంచరంగుల విష్ణు చక్రం మహావేగంతో తిరుగుతూ దర్శనమిచ్చినది. ఆ వేగము ప్రపంచములో ఏ వస్తువుకూ లేదట! ఆ చక్రం అంచు నొక్కులుతో ఉండి అంచునందు ఎరుపు – నీలం – తెలుపు రంగులు మాత్రమే ఉన్నవి. ఆ చక్రం మీద ఆమె దృష్టి 15 ని॥లు ఉన్నది. కనురెప్ప మూతపడలేదు. ఇది కంటి భ్రమకాదు గదా అని సంశయించి, దగ్గరకు వచ్చి ఆ చక్రం మధ్యభాగంలోకి చూపుడు వ్రేలును దించినది. ఆ వ్రేలు కరెంటు షాకును పొంది స్తంభించి స్పర్శను కోల్పోయినది. జిల్లు జిల్లుమని నరాలు లాగనారంభించినవి. దానితో ఆమె అరగంట పాటు మూర్ఛనొందినది. ఉపచారములు చేయగా తేరుకొన్నది. స్వామి పాదాలవద్ద రెండు టెంకాయలను కొట్టి అందరకీ ప్రసాదమునిచ్చినది. "నీవు హృదయంలో శివలింగమును, ముఖంలో బ్రహ్మవర్చస్సును, చేతిలో విష్ణు చక్రమును చూచినావు ఒకేసారి. ఆ చక్రంలోని పంచ రంగులే పంచభూతములు. అదియే కాల – కర్మ – సృష్టి చక్రము. చక్రము యొక్క శక్తి అంతయు అంచులోనుండును. అంచులో కనిపించిన 3 రంగులే త్రిమూర్తులగు శ్రీ దత్త శక్తి" అని స్వామి బోధించిరి. ఆమె విజయవాడ భక్తులకు ఫోను చేసి మరునాడుకూడ ఆ చూపుడు వ్రేలు అలానే స్తంభించియున్నదని తెలిపినది. "బ్రహ్మ తేజము – విష్ణు చక్రము – శివలింగమును చూపియుంటిని" అన్న ఈ భజన (భక్తి గంగ – స్వామి భజనల లోనిది) నిరూపణమును ఈ దర్శనము ద్వారా శ్రీమతి భారతీ దేవి గారికి అనుగ్రహించినారు స్వామి. ఆమె ధన్యురాలు.

**09-10-2002** పద్మ, వెంకటేశ్వరరావు దంపతులు స్వామి భక్తులు. వారి రెండవ పుత్రిక సుష్మను స్వామి ముద్దుగా శ్యాంరసియా అని పిలుస్తారు. శ్యాంరసియా తల్లి తండ్రులతో పాటు పూరీ తీర్థయాత్రలకు వెళ్ళినది. ఆ రోజు రాత్రి గాఢాంధకారం పూరీలో బీచ్‌లో ఉన్నారు. చీకటిగదా అందరికీ భయంవేసినది. శ్యాంరసియాకు వెంటనే స్వామి తన పక్కనే సాక్షాత్కరించి నేనున్నాను భయం ఎందుకు అని అన్నారు. పూరీ గుడిలో అందరూ దేవుని దర్శించుచుండగా గుడిలో స్వామి స్తంభాల చాటున నక్కి నక్కి కనపడుతూ శ్యాంరసియాతో ఆడుకున్నారట! ఎంతటి మహిమ - ఇది ఆ చిన్నారికి రెండవ అనుభవం.

**12-10-2002** స్వామి యీ రోజు మా ఇంటికి రాలేదు. అందరము పైన ఉన్నాము. మా కోడలు శ్రీలక్ష్మి తన కుమారుడు బాలకృష్ణతో స్వామి పైన ఉన్నారేమో చూచిరమ్మని పైకి పంపినది. దిగివచ్చి స్వామి మరియు అక్కడ ఉన్న భక్తుల పేర్లు చెప్పినాడు. వాడు చెప్పిన పేర్లలో స్వామి, సుమతి పేర్లు ఉన్నవి. కానీ స్వామి లేరు రాలేదుకావున. సుమతి కూడా రాలేదు ఆ రోజు ఇంట్లోనే ఉంది. మా కోడలు కొంతసేపు ఆగిన తరువాత స్వామి ఉన్నారేమో చూచిరమ్మన్నది, ఎవరో స్వామి కొరకు ఫోన్ చేసినందున. వాడు పైకి వెళ్ళి వచ్చి స్వామిని చూచి ఉన్నారని చెప్పినాడు. సుమతి మెట్లు ఎక్కుతూ మా భాస్కరుకు కనిపించినది. చివరకు మేము అంతా కిందకు దిగి వచ్చినాము. మమ్ములను అడుగగా స్వామి పైన లేరని చెప్పినాము. స్వామి వాడికి కనిపించుటయేకాక, సుమతి రూపంలో మా కుమారుడు భాస్కర్‌కు కనిపించినారు! ఇదంతా స్వామి క్రీడా వినోదమని భావించితిమి.

**15-10-2002** శర్మగారు స్వామి భక్తులు. వీరు బొంబాయి వెళ్ళటం జరిగింది. 15-10-2002 విజయదశమి. అక్కడ పన్వేల్ లోని దుర్గామాతా మందిరం దర్శించినప్పుడు "గౌరీ కళ్యాణ వైభవమే" అని స్వామి రచించిన భజన పాడారట స్వామిని గుర్తుచేసుకుంటూ. వెంటనే స్వామి అక్కడే తాను ఉన్నట్లు నిదర్శనంగా విపరీతమైన సుగంధము శర్మగారికి సోకి సొమ్మసిల చేసినదట. ఎంతటి అద్భుతం!

**16-10-2002** మాలతి స్వామి భక్తురాలు. స్వామిని సాక్షాత్తు దత్త భగవానులని విశ్వసించిన భక్తురాలు. స్వామి మాలతి వాళ్ళ యింటికి అప్పుడప్పుడు భిక్ష స్వీకరించడం జరుగుచుండగా స్వామి మాలతితో ఇలా పదేపదే వచించారు. " ఆడుగుము ఇవ్వబడును" "అస్క్ దట్ షల్ బి గివెన్" "కేళుంగళ్ - కుడుకంబడుం" అని మూడు భాషలలో పదేపదే చెప్పినారు. ఐహికములను కోరుకొమ్మనమని స్వామి అడుగుచున్నారని భావించి "నాకేమీ వద్దు. ఇలా ఉంటే చాలు" అన్నది మాలతి. కానీ తరువాత రోజు ప్రయాణం చేయవలసి వచ్చినది. తాడేపల్లిగూడెంలో రాత్రి 8 గం॥లకు తిరుమల ఎక్స్‌ప్రెస్ ఎక్కాలి. రైలులో ఒక కుమారుడు ఎక్కినాడు. రైలు కదిలింది. తండ్రి రైలును పట్టుకొని పరుగెత్తుచున్నాడు. ఎక్కిన పిల్లవాడు రైలునుండి దూకటానికి సిద్ధమైనాడు. రైలు వేగం అందుకొన్నది. మాలతికి దిక్కుతోచలేదు. తత్తరపడింది. స్వామిని తలచుకొని ఎంతో తీవ్ర స్వరంతో "స్వామీ" అని పెద్దగా కేక పెట్టినది. వెంటనే స్వామి సాక్షాత్కరించారు. లుంగీ ధరించి, భుజాన సంచితో చెయ్యి పైకెత్తి "ఆపండిరా" అని కేకవేసినారు. రైలు తక్షణం ఆగినది. మాలతి రెండవ కుమారుడు తండ్రితో సహా రైలునెక్కినది. పెట్టెలో అందరూ "ఏ దేవుడో నీ కోసమే వచ్చి ఆపినాడమ్మా రైలును" అని ప్రశంసించినారు.

**ఇలా స్వామి మహిమలు అనాది - అనంతాలు. అందుకే స్వామి చెప్పినారు "నాన్తో2స్తి మమ దివ్యానాం, విభూతీనాం పరంతప!" (గీత). అందువలన సమాప్తి లేని యీ గ్రంథమును ఇంతటితో సమాప్తి చేయుచున్నాము.**



భావన



భారతీ దేవి



బాలకృష్ణ

## ముగింపు

1. జ్ఞానమే నా సహజ సత్య స్వరూపం - ప్రేమయే నా సహజ సత్య సౌందర్యం।
ఈ రెండె నను పట్టగా గుర్తులిచ్చుట - నా అలంకారాలె యీ అష్టసిద్ధులు ।
దైత్య పుత్రులు గూడ మొండి తపములంజేసి ।
నా నుండి పొందుదురు అష్ట సిద్ధులనిలను ।
అవె గుర్తులను తలచువారలజ్ఞానులే ।
స్వార్థమును తీర్చుకొన యత్నించు లుబ్ధులే ।

2. అష్ట సిద్ధుల అవసరమేల? - సుందరాకృతికి సొమ్ములు ఏల?
జ్ఞాన యోగమే నా స్వరూపమగు - జ్ఞానులు వ్యక్తిని గుర్తించెదరు।

3. సాధన పూర్తిగ చేయకయే - కొన్ని సిద్ధులను పొందగనే ।
అవతారములుగ గురువులుగ - బ్రహ్మోహమనిరి కొందరిలన్ ।
జ్ఞాన భాస్కరుడు దత్తాత్రేయుడు - తత్త్వాంబరమున గోచరించగా ।
మాయగురువులిల అంధకారములు - పటాపంచలై పారిపోదురు ।

4. అష్ట సిద్ధులను భ్రమలను వీడుము - పాపలకే గద మాయలు వింతలు।
జ్ఞానయోగమున గమ్యము చేరుము - జ్ఞాన యోగమన తెలియుట చెప్పుట ।

(స్వామి భజనలనుండి)

జీవునకు మహిమల వలన దేవుడున్నాడని విశ్వాసమేర్పడుతుంది. కానీ క్రమముగా, ఆ మహిమలను ప్రదర్శించిన అవతార పురుషునిపై ఆ జీవునకు మాత్సర్యద్వేషములు కలిగి, ఆ సిద్ధులను పొంద యత్నిస్తాడు. వాటిని పొంది తానూ దేవుడు కావలయుననుకుంటాడు. ఈ సిద్ధులు స్వామికి సొమ్ములే. మొండి బిడ్డలగు రాక్షసులు మొండి తపస్సుల చేత సర్వపితయగు స్వామి నుండి వాటిని పొందినా వారు స్వామి కాలేరు. ఆయన నుండి వేరు చేయలేని ఆయన జ్ఞాన స్వరూపమును, ప్రేమ సౌందర్యమును వారు పొందలేరుగదా. పులియంత బలవంతుని జ్ఞానులు పులి యందురు కానీ బాలురు కేవలం పులి వేషగాడినే పులియందురు. సిద్ధులు పామరుల గుర్తులు. అసురులను జయించిన దేవతలు, సర్వ క్షత్రియ సంహారము చేసిన పరశురాముడు ఆ మహిమ తమదేనని అహంకరించి గర్వభంగమును పొందలేదా. వీరి ద్వారా శ్రీ దత్త పరబ్రహ్మమే ఆ మహిమలను చేసినదని గుర్తించలేకపోయారు గదా! లైటును వెలిగించినది కరెంటుగానీ, తీగెకాదు. ఎన్ని మహిమలు చేసినా సదా దాస భావమున నున్న అవతార పురుషుడైన శ్రీ హనుమంతుడు సర్వదా విజయము, సత్కీర్తిని పొందినాడు. మహిమల ద్వారా, తమ స్వార్థములను తీర్చుకొనుటకు, సొమ్ముల కాశించిన వేశ్యవలె భక్తిని నటించుచు, డబ్బుల కాశించి లారీలలో రాజకీయనాయకుని ప్రసంగమునకు తీసుకరాబడిన జనులవలె విశేష సంఖ్యలో భక్తులు చేరుదురు. అట్టి గులకరాళ్ళ గుట్టలు ఏల? శంకరాచార్యుని కడకు జిజ్ఞాసతో చేరిన శిష్యులవలె వజ్రముల వంటి నలుగురు సద్భక్తులు చాలరా? ఒకే సమయమున అనేక దత్తావతారములుండును. ఒకే సమయమున పరశురామ శ్రీరామ అవతారములును, అక్కల్‌కోట మహారాజ్, షిరిడీ సాయి అవతారములున్నవి. నేనే దత్తుడనువాడు అవివేకి. శ్రీదత్తుడు చేసిన మహిమలను నేనే చేసితినని పలుకువాడు మూర్ఖుడు. ఒకే సమయమున అనేకావతారముల ద్వారా, ఒకే దత్తుడు అనేక రకముల మహిమలను చేయును. ఒకే సమయమున అనేక తీగెలద్వారా ఒకే విద్యుత్తు, లైటును వెలిగించి, రేడియోను మ్రోగించి, ఫోన్‌ను త్రిప్పుచున్నది.

**స్వామి**

**(జన్నాభట్ల వేణుగోపాల కృష్ణమూర్తి)**



కర్తవ్య నిర్వహణలో స్వామి

ప్రొఫెసర్..డా॥.జన్నాభట్ల వేణు గోపాల కృష్ణమూర్తి